epaper.vaartha.com
: fb.com/vaartha Digital
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
హైదరాబాద్
22-6-2025 ఆదివారం
సంపుటి: 31 సంచిక: 141
పేజీలు: 10+4 వెల: 8.00
Published from Hyderabad, Vijayawada, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
WWW.VAARTHA.COM

# విశ్వమంతా మన యోగా


11వ సారి భారత్ బాటలో నడిచిన 175 దేశాలు

శాస్త్రవేత్తల నుంచి దివ్యాంగుల దాకా ఒకేమాట

ఆహారంలో నూనెలు 10 శాతం తగ్గించండి

ఆరోగ్య భారత్‌ను ఆవిష్కరిద్దాం

విశాఖ 'యోగాంధ్ర'లో ప్రధాని మోడీ





శనివారం వైజాగ్‌లో నిర్వహించిన అంతర్జాతీయ యోగా దినోత్సవంలో పాల్గొన్న ప్రజలు

**విశాఖపట్నం ప్రతినిధి, జూన్ 21, ప్రభాతవార్త:** యోగా మొత్తం ప్రపంచాన్ని ఒక తాటితో బంధించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. శనివారం విశాఖపట్నంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఒక గొప్ప జాతీయ కార్యక్రమాన్ని నిర్వహించారని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును ప్రధానమంత్రి హృదయపూర్వకంగా ప్రశంసించారు. యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రసంగించిన ప్రధాని మోదీ దేశ ప్రజలకు, ప్రపంచ ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. జూన్ 21న 11వ సారి ప్రపంచం మొత్తం కలిసి యోగా చేస్తోందని అన్నారు. యోగా యొక్క సరళమైన అర్థం కనెక్ట్ అవ్వడం, మరియు యోగా మొత్తం ప్రపంచాన్ని ఒకే దారంలో బంధించిందని చూడటం ఒక ఆహ్లాదకరమైన అనుభవమని ఆయన అన్నారు. యోగ పట్ల ప్రపంచంలో రోజురోజుకు ఆదరణ పెరుగుతోందని అన్నారు. నేడు శాస్త్రవేత్తలు అంతరిక్షం లో యోగా చేస్తున్నారని, దివ్యాంగులు యోగశాస్త్రం అధ్యయనం చేస్తున్నారని, యువ స్నేహితులు ప్రతి గ్రామంలో యోగా ఒలింపియాడ్‌లో పాల్గొంటున్నారని ప్రధానమంత్రి అన్నారు. యోగా విస్తృత

>>2

# అసలైన ఆరోగ్య మార్గం

గచ్చిబౌలి స్టేడియం యోగా దినోత్సవంలో గవర్నర్ జిష్ణుదేవ్



గచ్చిబౌలి స్టేడియంలో మంత్రి దామోదర

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్21:** సమాజంలో ఆరోగ్యవంతమైన జీవనం గడిపేందుకు అనారోగ్యం బారిన పడకుండా ముందు జాగ్రత్తగా ఆరోగ్య జీవనశైలిని అలవర్చుకోవాలని రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ తెలిపారు. శనివారం 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గచ్చిబౌలిలోని బాలయోగి స్టేడియంలో ఆరోగ్యం కుటుంబ సంక్షేమ, ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ,రాష్ట్ర మంత్రులు

>>2



# తెరచాటునే 'నైరుతి'!

563 మండలాలలో దుర్భిక్ష పరిస్థితులు

ఎండుతున్న పత్తి మొలకలు

వర్షాకాలం మొదట్లోనే కనిపించని మేఘాలు

**హైదరాబాద్,జూన్ 21,ప్రభాతవార్త:** తెలంగాణలో నైరుతి ముఖం చాటేయడంతో వ్యవసాయంకు జీవనాధరమైన చెరువులు నెర్రలువాసి ఎండుతున్నాయి.తొలకరి ముందే వానదేవుడు పలకరించడంతో ఎంతో ఆశగా రైతులు విత్తుకోగా ఎండవేడికి నాగేటి చాలులోనే మొలకలు ఎండుతున్నాయి.ఏటా జూన్ నెలలో సాధారణానికి మించి వర్షపాతం నమోదయ్యేది. రైతులు దుక్కులు దున్ని విత్తనాలు వేయడంతో పాటువరినార్లు పోసుకునేవారు. ఈ సారి రుతుపవనాలు ప్రవేశించినా వరుణుడు కరుణించని పరిస్థితి నెలకొంది. వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కరవు ఛాయలు ఏర్పడతాయనే ఆందోళన రైతుల్లో వ్యక్తమవుతోంది. తెలంగాణలో దాదాపు ఇప్పటి వరకు ఖరీఫ్‌లో సాగు చేసే సాధారణ సాగుభూమిలో 13శాతం మాత్రమే విత్తనాలు విత్తుకొన్నారు. వర్షాభావ పరిస్థితుల కారణంగా అనేక మంది రైతులు విత్తనాలు విత్తేందుకు ఆలోచిస్తున్నారు. దీనితో ఏరువాక ముందకు కదలని పరిస్థితి నెలకొంది. వరినారు పోయడానికి కూడా రైతాంగం ఆలోచిస్తున్నది. వ్యవసాయ పనులు ఊపందుకోవాల్సి ఈ సమయంలో రైతాంగం మొగులువైపు చూస్తు వర్షపు ఆనవాళ్ళు కానరాక నీరుగారి పోతున్నారు.వర్షాభావ పరిస్థితులు తెలంగాణ రైతాంగానికి ఆందోళనకు గురిచేస్తున్నాయి. ఈ ఏడాది రుతుపవనాలు ముందస్తుగా వచ్చినా వాటి వల్ల ఎలాంటి అదనపు ప్రయోజనం లేకుండా పోయింది. సీజన్ ప్రారంభమై 22 రోజులు దాటినా వర్షాభావ పరిస్థితులు వెంటాడుతుండటంతో అటు రైతులతో పాటు అన్ని వర్గాలకు ఇబ్బందులు తప్పడం లేదు. ముందస్తుగా వర్షాలు కురుస్తాయన్న ఆశతో విత్తు విత్తిన రైతులు వర్షం జాడరాక ఏమి చేయాలో పాలుపోని పరిస్థితి. ఇక వరి సాగు చేసే రైతులు సాగునీటి వసతి ఉన్న చోట్ల మాత్రమే వరి నారు పోశారు. ములుగు,ఖమ్మం, హనమకొండ,వరంగల్,భూపాలపల్లి,కరీంనగర్,పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, నిర్మల్, ఆదిలాబాద్‌జిల్లాలో పత్తి విత్తిన రైతులు బిందెలతో

>>2



# కేబినెట్ ఆమోదం ఉందా, లేదా?

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ నిర్మాణ ఉత్తర్వుల వివరాలు ఘోష్ కమిషన్‌కు ఇవ్వనున్న సర్కార్

మాజీ సీఎం కెసిఆర్, మాజీ మంత్రులు ఈటల, హరీష్‌రావు నిర్ణయాల వెనుక నిజాలపై ఆరా

టెండర్ ప్రక్రియపై కమిషన్‌కు వివరించనున్న ప్రభుత్వం

రేపు జరిగే కేబినెట్ భేటీలో నివేదికపై చర్చ

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్21:** కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సంబంధించి మంత్రివర్గం నిర్ణయాల వివరాలను ఈ నెల 30లోగా అందజేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద మైంది. ఈ మేరకు ముఖ్యమంత్రి కార్యాలయం జస్టిస్ ఘోష్ కమిషన్‌కు సమాచారం ఇస్తూ లేఖ రాసింది. మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు ఈటల రాజేందర్, హరీశ్‌రావులు నిర్ణయాలన్నీ మంత్రివర్గ ఆమోదంతో తీసుకొన్నట్లు కమిషన్ ఎదుట చెప్పడంతో, వాటిని నిర్ధారించుకునేందుకు కమిషన్ ప్రభుత్వానికి ఇటీవల లేఖ రాసిన విషయం తెలిసిందే. దీనికి రాష్ట్ర ప్రభుత్వం స్పందించింది. కమిషన్‌కు సమాచారం ఇచ్చేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన ఉత్తర్వులు జారీచేసిన సమయానికి మంత్రివర్గ ఆమోదం ఉందా లేదా అన్న వివరాలను నీటిపారుదల శాఖ నుంచి తీసుకుంటున్న ట్లు సమాచారం. కాళేశ్వరం కమిషన్ అడిగిన సమాచారాన్ని ఆర్థిక శాఖకు సిఎంవోగా పంపించగా ఆర్థిక శాఖ అప్పటి వివరాలను సేక రించే పనిలో పడింది. ఈ నెల 23న రాష్ట్ర కేబినెట్ సమావేశంలో కాళేశ్వరం కమిషన్ లేఖపై ప్రభుత్వం చర్చించనుంది. కాగా, కాళే శ్వరం ప్రాజెక్టు బ్యారేజ్‌ల నిర్మానంపై విచారణలో భాగంగా జస్టిస్ ఘోష్ కమిషన్ చేపట్టిన క్రాస్ ఎగ్జామినేషన్ ప్రక్రియ దాదాపు ముగిసింది. ప్రాణహితచేవెళ్లలో భాగంగా ఎల్లంపల్లి నుంచి నీటిని మళ్లించే పనులకు టెండరు పిలవగా, డిజైన్ మార్పు తర్వాత కాలువల సామర్థ్యం పెరగడంతో పనులను గుత్తేదారులకు ఎలా అప్పగించాలన్న దానిపై ముగ్గురు మంత్రులతో ఉపసంఘాన్ని అప్పటి ప్రభుత్వం నియమించింది. ఉప సంఘం ప్యాకేజీల వారీగా వివరాలు సేకరించారు. మొదట చేపట్టిన పనితో కలిసిపోయి ఉండి విడతీయడానికి వీలుకాకపోతే అప్పటికే ఉన్న కాంట్రాక్టర్‌కు ఇవ్వాలని సూచించింది. ప్రత్యేకంగా టెండర్ పిలవడానికి అవకాశం ఉన్నవాటికి టెండరు ప్రక్రియ చేపట్టాలని నిర్ణయించింది. ప్రతి ప్యాకేజీలో ఈ వివరాలు స్పష్టంగా పేర్కొంటూ నివేదిక ఇచ్చింది. ట్రాన్స్‌పరెన్సీ ప్రైస్ డిస్కవరీ, స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో టెండర్ ప్రక్రియకు సిఫార్సు చేసినట్లు తెలిసింది. ఉదాహరణకు 14వ ప్యాకేజీలో కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్మాణంతో పాటు అప్రోచ్ ఛానల్, కాలువ, సొరంగం, పంపుహౌస్ ఉన్నాయి. వీటి సామర్థ్యం పెరిగిన పంపుహౌస్‌లో సగం పని ఒకరు, మిగిలినది పూర్తి చేయడానికి మరొకరికి వీలుకాదు అని భావించి, ఉన్న కాంట్రాక్టర్‌కే 2015-16 ధరలతో ఇవ్వాలని సిఫార్సు చేసింది. కొండపోచమ్మ రిజర్వాయర్ సామర్థ్యం మొదట ఒక టీఎంసీ కాగా ఏడు టీఎంసీలకు (తదుపరి 15 టీఎంసీలకు) పెంచారు. అదనపు ఆయకట్టు ఉన్నందున ఈ పనికి టెండరు పిలవడం లేదా ట్రాన్స్‌పరెన్సీ

>>2



# ట్యాపింగ్ పాపం ప్రభాకర్‌రావుదే

సిట్ విచారణలో ప్రణీత్‌రావు

బ్యాంకు ఖాతాల వివరాలు, ముఖ్యపత్రాల అందజేత

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్ కేసులో ఎస్ఐబి మాజీ డిఎస్‌పి దుగ్యాల ప్రణీత్ రావును సిట్ అధికారులు శనివారం ఐదుగంటల పాటు విచారించారు. ఉదయం 11 గంటలకు జూబ్లీహిల్స్ ఎసిపి కార్యాలయానికి వచ్చిన ప్రణీత్ రావు సాయంత్రం నాలుగు గంటలకు వెళ్లిపోయారు. ఫోన్ ట్యాపింగ్ పాపం ప్రభాకర్ రావుదేనని మొదటి నుంచి చెబుతూ వచ్చిన ప్రణీత్ రావు శనివారం జరిగిన విచారణలోనూ ఇదే అంశాన్ని మళ్లీ చెప్పినట్లు తెలిసింది. అప్పట్లో జరిగిన ఫోన్ ట్యా పింగ్ అంతా ప్రభాకర్ రావు కనుసన్ననలోనే జరిగిందని ప్రణీత్ రావు చె ప్పినట్లు సమాచారం. 2023 నవంబర్ 15వ తేదీన ఒక్క రోజులో 650 ఫోన్లు ట్యాపింగ్ జరిగిన విషయమై ప్రణీత్ రావును సిట్ అధికారులు ప్రశ్నించినట్లు సమాచారం. దీనిపై సమాధానం ఇచ్చిన ప్రణీత్ రావు ఇది నిజమేనని అంగీకరించినట్లు తెలిసింది. 2023 నవంబర్ నెలలో లెక్కకు మించి ఫోన్ నంబ ర్లను టా ్యపింగ్ చేశామని, ఇదంతా ప్రభాకర్ రావు ఆదేశాల మేరకే జరిగిందని ఆయన అంగీకరించినట్లు తెలిసింది. అప్పట్లో మావోయిస్టుల పేరిట రాజకీయ నేతలు, సినీతారలు, సెలబ్రిటీలు, వ్యాపారుల ఫోన్లు ట్యాపింగ్ జరిగిన విషయం కూడా నిజ మేనని ప్రణీత్ రావు అంగీకరించినట్లు తెలిసింది. అయితే ఇదంతా తన ప రిధిలోని అంశం కాదని, నాటి ఎస్ఐబి బాస్ ప్రభాకర్ రావు పరిధిలోనిదని ఆయన చెప్పినట్లు తెలిసింది.

ప్రణీత్ రావు ఎస్ఐబిలో పనిచేసిన సమయంలో వాడిన బ్యాంకు ఖాతాల వివ రాలను, అప్పట్లో ఎస్ఐబికి సంబంధించిన కొన్ని పత్రాలను సిట్ అధికారులు ఆయన నుంచి తీసుకున్నారని తెలిసింది. ఎవరి ఆదే శాల మేరకు ఫోన్ ట్యాపింగ్ జరిగిందని సిట్ అధికారులు ప్రశ్నిం చగా తనకు తెలిసినంత వరకు ప్రభాకర్‌రావుఆదేశాలతోనే ఇదంతా జరిగిందని ఆయన చెప్పినట్లు తెలిసింది. (ఈ కేసులో అవసరం అయితే మరోసారి విచారణకు పిలుస్తామని,ఇందుకుహాజరు కావాల్సి వుంటుందని సిట్ అధికారులు ప్రణీత్‌రావును ఆదేశించారు. సిట్ అధికారి, జూబ్లీ హిల్స్ ఎసిపి వెంకటగిరి ఆధ్వర్యంలో ఈ విచారణ సాగింది.



శనివారం హైదరాబాద్‌లో ఎడ్‌సెట్ ఫలితాలు విడుదల చేస్తున్న ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డి తదితరులు

# ఎడ్‌సెట్-25లో 96.38% అర్హత

80% పైగా మహిళలే

హైదరాబాద్‌కి చెందిన గణపతి శాస్త్రికి ఫస్ట్ ర్యాంక్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో బిఈడి కోర్సులో ప్రవేశాల కోసం నిర్వహించిన ఎడ్‌సెట్-2025 పరీక్ష ఫలితాల్లో 96.38శాతం మంది అర్హతసాధించారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 32, 106 మంది పరీక్షకు హాజరు

>>2

# ఇరాన్ అణుస్థావరాలపై ముప్పేట దాడులు

ఇజ్రాయెల్‌పై విరుచుపడుతున్న ఇరాన్

తాజాగా ఖుద్స్‌ఫోర్స్ ఆయుధ సరఫరా కమాండర్ హతం



**టెహ్రాన్,జూన్ 21:** అణ్వాయుధ ఒప్పందంపై వివాదం చెలరేగిన రెండుదేశాల మధ్య జరుగుతున్న యుద్ధం తొమ్మిదోరోజు కూడా కొనసాగింది. అణుస్థావరాలే లక్ష్యంగా ఇజ్రాయెల్ ఇరాన్‌పై డ్రోన్లు, క్షిపణులవర్షం కురిపిస్తోంది. ప్రత్యేకతలు ఏమిటంటే భారత్‌లోని డిఆర్‌డివో అభివృద్ధిచేసిన బరాక్ క్షిపణుల వ్యవస్థను ప్రస్తుతం ఇజ్రాయెల్ ఇరాన్‌పై ప్రయోగిస్తోంది. ఇరాన్‌లోని కీలక అణుకేంద్రాలపై ఇజ్రాయెల్ తన ఆయుధ సంపత్తితో విరుచుకుపడుతోంది. ఇస్ఫహాన్ నగరంపై ఇజ్రాయెల్ దళాలు దాడులు జరిపినట్లు ఇరాన్ వెల్లడించింది. ఈ దాడిలో ఎలాంటి విషవాయువులు లీక్‌కాలేదని తెలిపింది. అక్కడ అణ్వాయుధాల తయారికి అవసరమయ్యేపరికరాలు ప్రాజెక్టులు ఉన్నట్లు తెలిపింది. ఇజ్రాయెల్

>>2



# ఆ ముగ్గురిని తొలగించండి

ఎయిరిండియాకు డిజిసిఎ ఆదేశం

**న్యూఢిల్లీ,జూన్ 21:** అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదానికి సంబంధించి భద్రతా లోపానికి కారణమైన ముగ్గురు ఉద్యోగులను తొలగించాలని పౌరవిమానయానశాఖ డైరెక్టరేట్ జనరల్ ఎయిర్ కార్యాలయం ఇండియాను ఆదేశించింది. ఈ విషయాన్ని సంబంధిత వర్గాలు శనివారం వెల్లడించాయి. ఆ ముగ్గురు అధికారుల్లో ఎయిర్‌లైన్ డివిజనల్ వైస్ ప్రెసిడెంట్ కూడా ఉన్నట్లు తెలిసింది. అహ్మదాబాద్ నుంచి లండన్ బయల్దేరిన ఎయిర్ ఇండియా విమానం ఎయిర్ పోర్ట్‌కు సమీపంలోని

>>2

# '108'కి గుడ్ బై..

అత్యవసర సేవలకు ఇక '112'

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో పోలీసు, ఫైర్, అంబులెన్స్ సేవలకు ఇక నుంచి 112 నంబర్‌ను మాత్రమే అందుబాటులో వుండేలా సర్కారు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటి వరకు 112తో పాటు 108 నంబర్ కూడా అత్యవసర సేవలకు వాడడం తెలిసిందే. శనివారం నుంచి 108 నంబర్ ను రద్దు చేసి అన్ని రకాల అత్యవసర సేవలకు 112 ను కొనసాగించాలని బంజారాహిల్స్‌లోని రాష్ట్ర సమీకృత కమాండ్ కంట్రోల్ సెంటర్ నిర్ణయించింది. ల్యా ండ్ లైన్‌తో పాటు సెల్‌ఫోన్ నుంచి కూడా 112 ఫోన్ చేసే వెసులుబాటు వుంటుంది. కమాండ్ కంట్రోల్‌లోని ఎమ్మర్జెన్సీ రెస్పాన్స్ సపోర్టు సిస్టం కాల్ సెంట ర్ కేంద్రంగా 112 పనిచేస్తుంది. ఈ నంబర్‌కు ఎవరైనా ఫోన్ చేస్తే జిపిఎస్ ఆధారంగా లొకేషన్‌ను కనుగొని సమీపంలోని గస్తీ పోలీసు లేదా అంబులెన్స్, ఫైర్ ఇంజన్‌ను పంపుతారు. తరువాత పరిస్థితులకు అనుగుణంగా సహాయం అందిస్తారు.



వరంగల్ సుబేదారి పోలీసు స్టేషన్ వద్ద ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

# కౌశిక్ రెడ్డి అరెస్టు, బెయిలు

బెదరింపుల కేసులో అదుపులోకి తీసుకొన్న పోలీసులు

వరంగల్లులో రోజంతా సాగిన హైడ్రామా

**వరంగల్ క్రైం జూన్ 21 ప్రభాతవార్త:** ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టు శుక్రవారం రాత్రి పోలీసులు నడిపిన నాటకీయా పరిణామాల మధ్య ముగిసింది. బిఆరెస్ పార్టీ ముఖ్య నేతలు పార్టీ న్యాయవాదుల కృషి ఎట్టకేలకు ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డికి షరతులతో కూడిన బెయిల్ కాజీపేట రైల్వే కోర్టు మంజూరు చేసింది. తోలుత జ్యుడిషియల్ రిమాండ్ విధిస్తూ ఆదేశాలు జారీ చేసినకోర్టు ముందు కౌశిక్ రెడ్డి తరుపున న్యాయవాదులు వాద ప్రతివాదనలు వినిపించి వినిపించిన షరతులతో కూడిన బెయిల్‌సాధించారు. గతంలో హానుమకొండ ఎక్సైజ్ కాలనీకి చెందిన క్వారీ యజమాని కట్టా మనోజ్ రెడ్డిని యాభై లక్షలు డిమాండ్ చేశారనే ఫిర్యాదు మేరకు వరంగల్ సుబేదారి పోలీస్ స్టేషన్‌లో

>>2

వివిధ ప్రాంతాలలో యోగా సాధన..


దెహ్రాడూన్‌లో రాష్ట్రపతి ముర్ము


పార్లమెంటు వద్ద లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా


న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి నడ్డా


హర్యానాలో కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్


జమ్మూ కాశ్మీర్‌లో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్


న్యూఢిల్లీలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్

## ఎడ్‌సెట్-25లో 96.38% అర్హత

>> కాగా వారిలో 30,944 మంది అర్హత సాధించారు. పరీక్షకు దరఖాస్తు చేసుకున్న వారిలో, హాజరైన వారిలో 80 శాతానికిపైగా మహిళలే ఉన్నారు. ఎడ్ సెట్-2025 ఫలితాలను శనివారం తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో విడుదల చేశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ ప్రతాప్ రెడ్డి ఫలితాలను విడుదల చేశారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి వైస్ ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, ఎడ్‌సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రామ్ రెడ్డి పాల్గొన్నారు. కాకతీయ విశ్వవిద్యాలయం ఎడ్‌సెట్ పరీక్షను నిర్వహించిన సంగతి తెలిసిందే. జూన్ 1న ఎడ్ సెట్-2025 పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎడ్‌సెట్-2025కి 38,758 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 32,106 మంది పరీక్షకు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 82.84 శాతం మంది హాజరయ్యారు. పరీక్షకు 32,106 మంది హాజరయ్యారు. పరీక్షకు హాజరైన వారిలో 30,944 మంది(96.38 శాతం) అర్హత సాధించారు. పరీక్షకు హాజరైన వారిలో 26,304 మంది బాలికలు ఉండగా వారిలో 25220 మంది(95.88 శాతం) అర్హత సాధించారు. బాలురు 5801 మంది హాజరు కాగా.. వారిలో 5723 మంది(98.66 శాతం) మంది అర్హత సాధించారు. గత ఏడాది రాష్ట్రంలో 208 కాలేజీల్లో 18,550 సీట్లు అందుబాటులో ఉండగా వాటిలో 14,420 సీట్లు భర్తీ అయినట్టు తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టా రెడ్డి తెలిపారు. ఈ ఏడాది కూడా రాష్ట్రంలో 7 ప్రభుత్వ బిఈడి కాలేజీలు, 201 ప్రైవేటు కాలేజీల్లో అడ్మిషన్లు తీసుకోనున్నట్టు తెలిపారు. గత ఏడాది ఆగస్టు 31న క్లాసులు ప్రారంభమయ్యాయని తెలిపారు. ఈ ఏడాది కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను త్వరలోనే ప్రకటిస్తామని తెలిపారు.

**హైదరాబాద్‌కి చెందిన వి గణపతి శాస్త్రి మొదటి ర్యాంక్**

ఎడ్‌సెట్-2025లో హైదరాబాద్‌కి చెందిన వి గణపతి శాస్త్రి 126.83 మార్కులతో మొదటి ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన జిశరత్ చందర్ 121.75 2వ ర్యాంక్‌ను.. వరంగల్ జిల్లాకి చెందిన కె నాగరాజు 121.31 మార్కులతో 3వ ర్యాంక్‌ను సొంతం చేసుకున్నాడు. సికింద్రాబాద్‌కి చెందిన శారద పొలిపెద్ది 118.75 మార్కులతో 4వ ర్యాంక్‌ను సొంతం చేసుకుంది.

## ఇరాన్ అణుస్థావరాలపై ముప్పేట దాడులు

>> దాడులతో ఇస్ఫహాన్‌నగరం పేలుళ్లతో దద్దరిల్లింది. ఖొండాబ్ అణుపరిశోధన రియాక్టర్‌సమీపంలోకూడా ఇజ్రాయెల్ దాడులు జరిపింది. గడచిన రెండురోజులుగా టెహ్రాన్‌లోని డజనుకుపైగా సైనిక కేంద్రాలపై 60వరకూ ఉన్న ఫైటర్ జెట్లు దాడిచేసాయి. 120కిపైగా బాంబులు ప్రయోగించినట్లు ఇజ్రాయెల్ ఎయిర్‌ఫోర్స్ ప్రకటించింది. క్షిపణిభాగాలు తయారీ సైనికపారిశ్రామికప్రదేశాలు, క్షిపణి ఇంజిన్లకోసం ఉపయోగించేముడిపదార్థాలు తయారుచేసే ప్రదేశాలపై ఫైటర్‌జెట్లు దాడిచేసాయని ఇజ్రాయెల్ ఎయిర్‌ఫోర్స్ ప్రకటించింది. టెహ్రాన్‌లోని ఎస్పీఎన్‌డీ కేంద్రంపైనా ఫైటర్‌జెట్లు దాడిచేసినట్లు తెలిపారు. ఇజ్రాయెల్‌పై దాడికి సిద్ధంచేసిన ఇరాన్‌లోని మూడు క్షిపణి లాంచర్లు ధ్వంసంచేసామని ఇజ్రాయెల్‌చెపుతోంది. ఇదిలా ఉంటే తాజాగా ఇరాన్‌లోని డ్రోన్‌యూనిట్‌కమాండర్‌ను హతమార్చినట్లు ఇజ్రాయెల్ ఐడిఎఫ్ ప్రకటించింది. డ్రోన్‌యూనిట్‌కమాండర్ అమీన్ జుడ్డిని హతమార్చినట్లు వెల్లడించింది. టెల్ అవీవ్‌పై ఇరాన్‌చేసిన దాడులవెనుక అతని హస్తం ఉందని తెలిపింది. ఇరాన్‌లోని అహ్వాజ్‌ప్రాంతంనుంచి ఇజ్రాయెల్‌వైపు వందలాదిడ్రోన్‌దాడులను ఆతడే పర్యవేక్షించాడని ఇజ్రాయెల్‌ఆరోపించింది. కాస్పియన్ సముద్రం సమీపంలోని రాస్త్‌నగరంపైనా ఇజ్రాయెల్ ఐడిఎఫ్ బాంబులతో విరుచుకుపడింది. ఇందుకుప్రతిగా ఇరాన్‌చేస్తున్న దాడుల్లో గోలన్ హైట్స్‌లోని అనేక ప్రాంతాల్లో సైరన్‌లు మోగుతున్నాయి. ఇరాన్‌ప్రయోగించిన వందలాది డ్రోన్లను జనావాసాలులేని ప్రాంతాల్లోకూల్చివేసామని ఇజ్రాయెల్‌ప్రకటించింది. ఇరాన్‌ను అస్థిరపరిచేందుకు ఆదేశంపై దాడులు మరింత ముమ్మరంచేయాలని ఇజ్రాయెల్‌రక్షణమంత్రి కాట్జ్ అన్నారు. ఇరాన్‌ప్రభుత్వ కేంద్రాలు, సంస్థలు, మౌలికసదుపాయాలు ఆస్తులు టార్గెట్‌చేయాలన్నారు. టెహ్రాన్‌లోని శక్తివంతమైన బాసిజ్, ఐఆర్‌జిసి వంటి కేంద్రాలు ధ్వంసంచేయాలని ఆదేశించారు. ఇప్పటికే ఖుద్స్‌ఫోర్స్ కమాండర్ బెహ్నామ్ షాహ్‌రియారీని అంతంచేసామని ఐడిఎఫ్ వెల్లడించింది.

## మెట్రో రెండో దశకు వేగంగా అడుగులు.. రూ.19,579 కోట్ల వ్యయం

### కేంద్రానికి ప్రతిపాదనలు సమర్పించిన ప్రభుత్వం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,జూన్21:** హైదరాబాద్ మెట్రో రైల్ ఫేజ్2(బి) ప్రతిపాదనదతో పాటు అవసరమైన అన్ని పత్రాలు,డిపిఆర్‌లను శనివారం కేంద్ర ప్రభుత్వానికి సమర్పించినట్లు హైదరాబాద్ ఎండీ ఎన్‌విఎస్‌రెడ్డి వెల్లడించారు. ఇటీవల రాష్ట్ర కేబినెట్ ఆమోదించిన ఫేజ్2(బి) ప్రాజెక్టులో 3 కారిడార్లు ఉన్నాయి. ఆర్‌జిఐఏ నుంచి భారత్ ఫ్యూచర్ సిటీ(39.6 కి.మీ: రూ,7,168 కోట్లు),జేబీఎస్ నుంచి మేడ్చల్(24.5 కి.మీ:రూ.6,946 కోట్లు),జేబిఎస్ నుంచి శామీర్‌పేట్(22 కి.మీ.: రూ.5465 కోట్లు) మొత్తం 86.1 కి.మీ పొడవును కవర్ చేసే ఈ ఫేజ్2(బి) ప్రాజెక్టులో మొత్తం రూ.19,579 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేశారు. గతంలో సమర్పించిన ఐదు కారిడార్లు (76.4 కి.మీ) ఫేజ్2(ఎ) మాదిరిగానే, ఈ ఫేజ్2(బి) ప్రాజెక్టును కూడా కేంద్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్టుగా అభివృద్ధి చేయాలని ప్రతిపాదించినట్లు మెట్రో ఎండీ వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం జాయింట్ వెంచర్ ప్రాజెక్టు నిబంధనల ప్రకారం ఫేజ్2(బి) వ్యయం రూ.19,579 కోట్లలో తెలంగాణ ప్రభుత్వం వాటా రూ.5874 కోట్లు (30శాతం),కేంద్ర ప్రభుత్వ వాటా రూ.3,524కోట్లు (18శాతం),అంతర్జాతీయ ఆర్థిక సంస్థల నుంచి రుణంగా రూ.9,398 కోట్లు (48శాతం),చిన్న మొత్తంలో పిపిపి భాగంగా రూ.783 కోట్లు (4శాతం)ఉంటాయని తెలిపారు. రెండు రోజుల క్రితమే హైదరాబాద్ మెట్రో ఫేజ్‌ను మంజూరు చేయాలని కోరుతూ ఢిల్లీలో సిఎం రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణ వ్యవహారాల శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసిన విషయం తెలిసిందే.

## ఆ ముగ్గురిని తొలగించండి

>> ఓ బిల్డింగ్‌పై కుప్పకూలిన విషయం తెలిసిందే. విమానం కూలిన అనంతరం 1,000 డిగ్రీల ఉష్ణోగ్రతతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటలో మొత్తం 279 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. పలువురు గాయపడ్డారు. ఇక ఈ ఘటనలో మృతదేహాల గుర్తింపు ప్రక్రియ కొనసాగుతోంది. అహ్మదాబాద్ సివిల్ ఆసుపత్రిలో డీఎన్ఏ పరీక్ష ద్వారా మృతదేహాలను అధికారులు గుర్తిస్తున్నారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్నారు. ఈ ముగ్గురు సీనియర్లు సిబ్బంది షెడ్యూలు, రోస్టర్ విధులు నిర్వహిస్తున్నట్లు డిజిసిఎ వెల్లడించింది నిబంధనలు పాటించకపోవడంవల్లనే వారిపై చర్యలకు డిజిసిఎ సిఫారసుచేసింది. లైసెన్సింగ్, సర్వీసింగ్ లోపాలున్నా ఎయిరిండియా విమాన సిబ్బందిని విధులకు షెడ్యూలుచేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. జవాబుదారీతనం లోపించిందని, ఎలాంటి జాప్యంలేకుండా సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డిజిసిఎ వెల్లడించింది. ముగ్గురు అధికారులపై తీసుకున్న చర్యల వివరాలను 10 రోజుల్లోపు డిజిసిఎకి నివేదించాలని ఉత్తర్వుల్లో వెల్లడించింది. వీరిస్థానాల్లో కొత్తవారిని నియమించాలని ఆదేశించింది. బెంగళూరు నుంచి లండన్‌కు బయలుదేరిన రెండు విమానాల సమయపరిమితి 10 గంటలు ఆలస్యంగాచేరుకున్నాయని, వీటిపైనా వివరణ ఇవ్వాలని డిజిసిఎ ఎయిరిండియాకు షోకాజ్‌నోటీసులు జారీచేసింది. ఏడురోజుల్లోపు వివరణ ఇవ్వాలని హుకుం జారీచేసింది.

## వారం - వర్జ్యం

తేది : 22-06-2025, ఆదివారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణ పక్షం
ద్వాదశి రా.1.21
భరణి సా.5.37
వర్జ్యం తె.4.26-5.53
దు.సా.4.54-5.46
రాహుకాలం - సా.4.30-6.00

## వార్తాఫలం

**మేషం** :సన్నిహితుల సాయంతో ముందడుగువేస్తారు. వృత్తి-వ్యాపారాలలో లాభాలు పొందుతారు.

**వృషభం** : ఎంతటివారినైనా మాటలతో ఆకట్టు కుంటారు. సంబంధ బాంధవ్యాలు మెరుగు పడతాయి.

**మిథునం:** సన్నిహితుల నుండి ధన, వస్తు లాభాలు పొందుతారు. కాంట్రాక్టులు లభిస్తాయి.

**కర్కాటకం** : సంతానం నూతన సాంకేతిక విద్యావకాశాలు పొందుతారు. పనులు సకాలంలో పూర్తి.

**సింహం:** గృహ నిర్మాణ ఆలోచనలు కలిసివస్తాయి. పెట్టుబడులకు తగిన లాభాలు పొందుతారు.

**కన్య** : రాజకీయ, కళారంగాలవారికి విదేశ పర్యటనలు వుంటాయి. వివాదాలకు దూరంగా వుండండి.

**తుల** : ఎంతటి పనినైనా పట్టుదలతో పూర్తిచేస్తారు. వృత్తి - వ్యాపారాలు అభివృద్ధిచెందుతాయి.

**వృశ్చికం:** ముఖ్యమైన పనులలో విజయం సాధిస్తారు. సభలు, సమావేశాలలో పాల్గొంటారు.

**ధనుస్సు:** జీవిత భాగస్వామినుండి ఆస్తి లాభం పొందుతారు. క్రయ విక్రయాలలో ప్రోత్సాహం.

**మకరం:** నూతన మిత్రులు పరిచయమై కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. వస్తుసేకరణ.

**కుంభం:** రాజకీయ, పారిశ్రామిక రంగాల వారికి కొంత కలిసివచ్చే కాలం. వాహనాల కొనుగోలు.

**మీనం** : సంతానం విదేశాలలో విద్యా, ఉద్యోగావకాశాలు పొందుతారు. ప్రయాణాలు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# అసలైన ఆరోగ్య మార్గం

>> దామోదర్ రాజనర్సింహ,వాకిటి శ్రీహరి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావులతో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ మాట్లాడుతూ యోగాకు నిత్యజీవితంలో ఉన్న ప్రాధాన్యతను ప్రతి ఒక్కరు గమనించాలని,ఆధ్యాత్మిక, శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో అద్భుతమైన సాధనం యోగా అని అన్నారు. యోగా అనేది శరీర వ్యాయమమే కాకుండా జీవన విధానంలో భాగమని, ప్రతి ఒక్కరు క్రమం తప్పకుండా యోగా చేసి తమ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆనందంగా ఉండాలని గవర్నర్ అన్నారు. ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర రాజ నరసింహ మాట్లాడుతూ యోగా ప్రపంచానికి భారతదేశం ఇచ్చిన బహుమతి, యోగా కేవలం వ్యాయామం కాదు, ఇది శరీరం, మనస్సు, ఆత్మను ఏకం చేస్తుందని, ఆరోగ్య సమస్యలకు ఇది ఉత్తమ పరిష్కారమని చెప్పారు. వాగా చేయడానికి దృఢ సంకల్పం, మంచి గురువు అవసరమని, యోగ సాధన ద్వారా తమ ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవడంతోపాటు ప్రతి ఒక్కరు దినచర్యలో భాగంగా యోగాను అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థులలో యోగాభ్యాసం ద్వారా ఒత్తిడిని నివారిస్తుందని ఏకాగ్రతను పెంపొందిస్తుందని, ప్రతి పాఠశాలలో యోగా తరగతులు నిర్వహించాలని ఈ యోగ సాధన ద్వారా విద్యార్థులకు మానసిక స్పష్టత, శారీరక బలం ఏకాగ్రతను బలోపేతం చేయడానికి సహాయపడుతుందని అన్నారు. యోగ ధ్యానం అనేది ఆరోగ్యంగా ఉండటానికి దోహదపడు సాధనమని ప్రపంచ సమాజానికి యోగా అనే గొప్ప వరాన్ని అందించిన మహర్షి పతాంజలి చిరస్మరణీయులను అన్నారు. క్రీడలు, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు యోగాను పరిచయం చేసిన గడ్డ మన దేశమని, యోగాను అన్ని దేశాలకు చాటి చెప్పి వైద్యులకు పని లేకుండా ఆరోగ్యవంతులను కాపాడే సాధనమని అన్నారు. ప్రతిరోజు యోగ చేయడం ద్వారా మానసిక ఉల్లాసంతోపాటు చురుకుగా పని చేస్తారని, అదేవిధంగా యోగ ఎలాంటి వ్యాధులనైన నయం చేసే సాధనమని అన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ అంతర్జాతీయ యోగా దినోత్సవానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, యోగాను అలవర్చుకోవాలని, జబ్బు వస్తే ఎంతో ఖర్చు పెడతారని దానికి ముందే ఆరోగ్యంగా ఉండడానికి యోగా లాంటి అలవాట్లను పాటించినట్లయితే అందరూ ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేదికపై ఎమ్మెల్సీ ఏవిఎన్ రెడ్డి, ఆరోగ్యశాఖ సెక్రటరీ క్రిస్టినాజో చొంగత్, స్పోర్ట్స్ ఛైర్మన్ శివసేనారెడ్డి, ఆయుష్ డైరెక్టర్ శ్రీకాంత్ బాబు,జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి, జిహెచ్‌ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి జిహెచ్‌ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్ తదితరులు పాల్గొన్నారు. ఈ యోగా కార్యక్రమంలో యువతి యువకులు, విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.


శనివారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలిలో నిర్వహించిన అంతర్జాతీయ యోగా వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

## వేల కోట్ల ఎగవేతదారులను ఏమీ చేయలేరా?

### బ్యాంకులపై హైకోర్టు ఘాటు వ్యాఖ్యలు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** వేల కోట్లరూపాయల రుణంతీసుకొని, వాటిని చెల్లించకుండాఎగవేతకు పాల్పడే వారిని బ్యాంకులు ఏమీ చేయలేవని హైకోర్టు ఘాటైన వ్యాఖ్యలు చేసింది. అదే సమయంలో సామాన్యులపై మాత్రం తమ ప్రతాపాన్ని ప్రదర్శిస్తాయని బ్యాంకుల పనితీరును తప్పుపట్టింది. తీసుకున్న రుణాన్ని ముందుగా చెల్లించినందుకు కూడా స్టేట్ బ్యాంకు రూ.1.16 కోట్ల మేర చార్జీలు విధించడాన్ని సవాల్ చేస్తూ సనత్‌నగర్‌కు చెందిన బాధితుడొకరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సీవీ భాస్కర్‌రెడ్డి ధర్మాసనం విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలువ్యాఖ్యలు చేసింది.దేశంలోని బ్యాంకింగ్‌వ్యవస్థలోఅనేక లోపాలున్నాయని అభిప్రాయపడింది. తప్పుడు డాక్యుమెంట్లు చూపించిన వారికి కనీస తనఖీలు, పరిశీలన లేకుండా రూ.కోట్లు మంజూరు చేస్తాయని తెలిపింది. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీసుకునే చిన్న రుణాలకు ముక్కు పిండి ఛార్జీలు వసూలు చేస్తారని అభ్యంతరం వ్యక్తం చేసింది. వాయిదాల చెల్లింపుల్లో కాస్త ఆలస్యం జరిగితే మోయలేని విధంగా జరిమానాలు వడ్డిస్తారని విమర్శించింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూరుణాన్ని ముందుగా చెల్లించినందుకు చార్జీలు వసూలు చేయడం, రిజర్వు బ్యాంకు నిబంధనలకు విరుద్ధమని పేర్కొన్నారు. వసూలు చేసిన ఛార్జీలను వడ్డీతో సహా చెల్లించేలా ఆదేశాలు జారీ చేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం స్టేట్ బ్యాంక్ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కౌంటర్లు దాఖలు చేయాలని రిజర్వు బ్యాంకు, స్టేట్ బ్యాంకులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ రెండు వారాలకు వాయిదా పడింది.

# కౌశిక్ రెడ్డి అరెస్టు, బెయిలు

>> ఎమ్మెల్యేపై ఎఫ్ ఐఆర్ నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం రాత్రి ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిని సుబేదారి పోలీసులు శంషాబాద్ ఎయిర్పోర్టులో అదుపులోకి తీసుకొని స్టేషన్ కు తరలించారు. అరెస్టు విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, శ్రేణులు భారీగా పోలీస్ స్టేషన్ కు చేరుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. పోలీసులు భారీ బందోబస్తు నడుమ పాడి కౌశిక్ రెడ్డిని ఎంజీఎంలో వైద్య చికిత్సల అనంతరం కాజీపేట రైల్వే స్టేషన్ లో హాజరు పరిచారు. విచారణ అనంతరం న్యాయమూర్తి బెయిల్ మంజూరు చేస్తూ తీర్పునిచ్చారు. కోర్టు నుంచి బయటికి వచ్చిన ఎమ్మెల్యే పాడి ప్రభుత్వ తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించి నినాధాలు చేశారు.అక్రమ కేసులు బిఆరెస్ మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, దాస్యం వినయ్ భాస్కర్, ఏనుగుల రాకేశ్ రెడ్డిలు మాట్లాడుతూ ప్రభుత్వం పాలన విఫలం పై ప్రశ్నిస్తున్న కౌశిక్ రెడ్డిపై రాజకీయ కక్ష సాధింపు కేసులు కొత్తేం కాదని అన్నారు. అసెంబ్లీలో ప్రశ్నిస్తూ ప్రభుత్వాన్ని నిలదీస్తున్న కౌశిక్ పై అక్రమకేసులు పెట్టి వేధిస్తున్నారని ఆరోపించారు. గత నెలలో కేసు పెట్టి సాక్ష్యాలు లేకపోవడంతో ఇన్ని రోజులు కాలయాపన చేశారని విమర్శించారు. కేసుపెట్టిన వ్యక్తిపై అనేక ఆరోపణలు ఉన్నాయని, దేవంత్ రెడ్డి స్థాయిలో ఒత్తిడి తెచ్చి కౌశిక్ రెడ్డి ని ఇబ్బంది పెడుతున్నారని తెలిపారు. బెయిల్ రాకుండా ఎన్ని కుట్రలు కుతంత్రాలు చేసి జైలుకు పంపాలని చూసినా నాయాస్థానం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో అవినీతి పెరిగిపోయిందని రాష్ట్రంలో పాలన విఫలం అయ్యిందని దమ్ముంటే స్థానిక సంస్థల ఎన్నికలు పెట్టాలని డిమాండ్ చేశారు. లోకల్ బాడీ ఎన్నికల కోసమే నేతలను అరెస్ట్ చేశారని తప్పుడు కేసులను ఎత్తివేయ కుంటే కాంగ్రెస్ పార్టీ భారీ మూల్యం చెల్లించు కుంటుందని హెచ్చరించారు. కాంగ్రెస్ లో ఎమ్మెల్యేలు మంత్రులు ఎవరికి వారు దోచుకు తింటున్నది జనాలకు అర్ధం కాకుండా అక్రమ కేసుల గిడవలు సృష్టిస్తున్నారని అన్నారు. పర్సంటేజీల సర్కార్ బెయిల్ మంజూరు అనంతరం ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి మాట్లాడుతూ నేను ఎవరికి అన్యాయం చేయలేదని, నా వైపు న్యాయం ఉండడంతి న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసిందని అన్నారు. త్వరలో వరంగల్ కాంగ్రెస్ మంత్రులు,ఎమ్మెల్యేలు చేసిన అక్రమాలను భయటపెడు తానని హెచ్చరించారు. కక్షపూరిత కేసులు మోస పూరిత, కుట్రలకు కుతంత్రాలకు పాల్పడితే కాంగ్రెస్ తప్పకుండా భారీ మూల్యం చెల్లించుకుంటుందని అన్నారు. 308(2), 308(4), 352 కింద కేసు నమోదైన అక్రమ కేసులు బేషరతుగా తొలగించాలని పోలీసులను డిమాండ్ చేశారు.

## కేబినెట్ ఆమోదం ఉందా, లేదా?

>> ప్రైస్ డిస్కవరీ పద్ధతిని అనుసరించాలని సూచించింది. కొన్ని పనులకు స్విస్ ఛాలెంజ్ పద్ధతిని సూచించినట్లు తెలిసింది. ఉప సంఘం నివేదికను మంత్రివర్గంలో ఆమోదించినట్లు తెలిసింది. 21వ ప్యాకేజీ పనిని స్విస్ ఛాలెంజ్ పద్ధతిలో పిలవగా ఆర్థిక శాఖ దీనిని తిరస్కరించినట్లు సమాచారం. దీంతో ఈ పద్ధతికి స్వస్తిపలుకుతూ నీటిపారుదల శాఖ మెమో జారీ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. టెండర్ ప్రక్రియ మంత్రివర్గం ఆమోదం ప్రకారమే జరిగిందా లేక భిన్నంగా జరిగిందా అనేది పరిశీలించి కమిషన్‌కు కాంగ్రెస్ ప్రభుత్వం నివేదించనున్నట్లు సమాచారం.

## విశ్వమంతా మన యోగా

>> ఆమోదానికి ఇది నిదర్శనమని అన్నారు. భారతదేశం చేసిన ప్రతిపాదనపై 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ని అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ఎలా గుర్తించిందో ప్రధాని మోదీ గుర్తు చేసుకున్నారు. కొన్ని నెలల్లోనే 175 దేశాలు ఈ ప్రతిపాదనకు మద్దతు ఇచ్చాయని ఆయన అన్నారు. ఇది ఒక ప్రతిపాదనకు మద్దతు మాత్రమే కాదని, మానవాళి మంచి కోసం ప్రపంచవ్యాప్త ప్రయత్నం అని అన్నారు. యోగా నేడు జీవితంలో అంతర్భాగంగా మారిందని, అది ప్రపంచాన్ని శాంతి, ఆరోగ్యం మరియు ఐక్యత వైపు నడిపిస్తోందని ఆయన అన్నారు. సిడ్నీ ఒపెరా హౌస్ మెట్లు అయినా, ఎవరెస్ట్ శిఖరాలు అయినా, సముద్రపు అలలు అయినా, యోగా అందరికీ మరియు అందరిద్ధి అనే సందేశం ప్రతిచోటా వస్తుందని ప్రధాని మోదీ అన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మోదీ'చమురును 10 తగ్గించండ్ఠి అనే పిలుపును మళ్ళీ పునరుద్ఘాటించారు, స్థూలకాయాన్ని ప్రపంచ సవాలుగా అభివర్ణించారు. 'మన్ కీ బాత్'లో నేను దీని గురించి వివరంగా చర్చించానని, ప్రజలు తమ ఆహారంలో నూనెను 10 శాతం తగ్గించుకోవాలని కోరారు. ఈ రోజు నేను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రజలను ఈ సవాలులో తిరిగి చేరాలని పిలుపునిస్తున్నానని అన్నారు.

## తెరచాటునే 'నైరుతి'!

>> మొక్కలకు నీళ్ళు ఎత్తిపోస్తున్నారు. జోగులాంబ జిల్లాలో ఈ నైరుతి రుతుపవనకాలంలో ఒకే ఒక్క వర్షపు రోజు నమోదు కావడం విశేషం. తెలంగాణలో జూన్ 20వ తేదివరకు 88.9 మి.మి సాధారణ వర్షాపాతం నమోదు కావాల్సి ఉండగా 50.7 మి.మి వర్షాపాతం మాత్రమే నమోదైంది. ఇందులో అత్యధిక భాగం మహబూబ్‌నగర్,వనపర్తి,నాగర్‌కర్నూల్ జిల్లాలలోనే సగటున 33 మి.మి వర్షాపాతం కురిసింది. మిగితా జిల్లాలో తీవ్రమైన దుర్భిక్షపరిస్థితులు నెలకొన్నాయి.రాష్ట్రవ్యాప్తంగా -43.67శాతం లోటువర్షాపాతం నమోదైంది. 26జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి.తెలంగాణలో మొత్తం 621 మండలాలు ఉంటే కేవలం 17 మండలాలలో అత్యధికపాతం నమోదు కాగా 563 మండలాలో తీవ్రవర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. భూగర్భజలాలు అడుగంటిపోవడంతో బావులపై సాగు కూడా రైతుకు ఇబ్బందిగా మారింది. రాష్ట్రంలో 46531చెరువులు ఉంటే అందులో అందులో 29247చెరువులు నీటి చుక్కలేక ఎండిపోయాయి. 8345 చెరువుల్లో 15శాతం నీరు మాత్రమే అందుబాటులో ఉంది. తెలంగాణలో సుమారు 20లక్షల ఎకరాల భూమి చెరువుల కింద సాగవుతోంది. తెలంగాణ వ్యాప్తంగా చెరువులు కుంటల్లో 257టిఎంసిల నీటి నిల్వసామర్థ్యం కలిగి ఉన్నప్పటికి ప్రస్తుతం అందులో నీటి ఆనావాళ్ళు లేకపోవడంతో బోర్లు,బావుల కింద సేద్యం రైతుకు అనిశ్చితి కలిగిస్తున్నది. అడువుల జిల్లా ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రతి యేడు అత్యధికవర్షాపాతం నమోదు కావడం రివాజు కానీ ఈ యేడు అక్కడ కూడా అతి తక్కువ వర్షపురోజులతోపాటు అతి తక్కువ వర్షాపాతం నమోదైంది. హన్మకొండ, సూర్యాపేట,ములుగు, కరీంనగర్,ఖమ్మం, జిల్లాలలో ఈ యేడు ఇప్పటివరకు కేవలం రెండు వర్షపు రోజులు మాత్రమే నమోదైనాయి. మల్కాజ్‌గిరి,హైదరాబాద్ జిల్లాలో మూడు వర్షపు రోజులు నమోదైనాయి. రాష్ట్రంలో అత్యధికంగా వనపర్తి జిల్లాలో 8వర్షపురోజులు, నాగర్‌కర్నూల్ జిల్లాలో 7 వర్షపు రోజులు నమోదైనాయి. వర్షాకాలం ఆరంభంలోనే తెలంగాణలోని 23జిల్లాలో డ్రైస్పెల్ నమోదు కావడంతో రైతాంగంలో ఆందోళన మొదలైంది.14జిల్లాలోని -60శాతం నుంచి-99శాతం లోటు వర్షాపాతంతో 249 లార్జ్‌డెఫిసిట్ మండలాలుగా గుర్తించారు. 12 జిల్లాలో -20శాతం నుంచి -60శాతం తక్కువ వర్షం పడటంతో డెఫిసిట్ మండలాలుగా గుర్తించారు. ఇదే పరిస్థితి రానున్న మరో రెండు వారాలు ఉంటే తెలంగాణ వ్యాప్తంగా తాగునీటికి కూడా ఇబ్బంది తలెత్తే అవకాశం ఉందని భావిస్తున్నారు. మరోవైపు గోదావరి బేసిన్‌లోని చిన్న మధ్య తరహా జలాశయాల్లో కూడా నీరు నిండుకొంటున్నది. లోయర్ మానేరు డ్యామ్‌లో ముంపుకు గురైన హైదరాబాద్ -కరీంనగర్ రహదారి బయటపడటంతో ప్రజలు ఆ రోడ్డునుంచి బెజ్జంకి గన్నేరువరంవైపు రాకపోకలు సాగిస్తున్నారు. మధ్యమానేరులో నీరు ఇంకిపోయి బావురుమంటోన్నది. షాబాజ్‌పల్లి వద్ద మధ్యమానేరులో ముంపుకు గురైన వేములవాడ కరీంనగర్ రోడ్డుపై ఉన్న కాజ్‌వే ఇప్పుడు నీరు లేకపోవడంతో బయటకు తేలింది.వర్షాలు కురవకపోవడంతో కూరగాయలు,మిర్చి,పసుపు, వంటి సాగు చేయడానికి రైతాంగం ఇబ్బందులు పడుతున్నారు.

## ఇక టూవీలర్ కొనుగోలుతోనే రెండు హెల్మెట్లు

**న్యూఢిల్లీ,జూన్ 21:** కేంద్ర ప్రభుత్వం రోడ్డు భద్రతను పెంచే దిశగా మరో కీలక నిర్ణయం తీసుకుంటున్నది. ఇకపై కొత్త ద్విచక్ర వాహనం కొనుగోలు చేసినప్పుడు, దానితో పాటే రెండు హెల్మెట్లను కూడా తప్పనిసరిగా అందించేలా డీలర్లపై నిబంధన విధించాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ ప్రతిపాదన అమల్లోకి వస్తే, వాహనదారులకు కొనుగోలు సమయంలోనే నాణ్యమైన హెల్మెట్లు అందుబాటులోకి వస్తాయి, తద్వారా భద్రత మరింత మెరుగుపడుతుంది. భారతదేశంలో ద్విచక్ర వాహన ప్రమాదాలు, వాటిలో జరిగే తల గాయాలు తగిలిన ప్రమాదాలు ఆందోళనకర స్థాయిలో ఉన్నాయని ప్రభుత్వ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కేంద్ర రోడ్డు రవాణా మరియు రహదారుల మంత్రిత్వ శాఖ వెల్లడించిన సమాచారం ప్రకారం, 2022లో జరిగిన మొత్తం రోడ్డు ప్రమాదాల్లో 44.5 శాతం ద్విచక్ర వాహనాలకు సంబంధించినవే కావడం గమనార్హం. వీటిలో అత్యధిక మరణాలు, తీవ్ర గాయాలు తలకు బలమైన దెబ్బలు తగలడం వల్లే సంభవిస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ కొత్త విధానం అమల్లోకి వస్తే, ద్విచక్ర వాహన డీలర్లే వాహనం అమ్మేటప్పుడు రెండు హెల్మెట్లను కొనుగోలుదారులకు అందించాల్సి ఉంటుంది. దీనివల్ల వాహనం కొన్న మొదటి రోజు నుంచే రైడర్‌తో పాటు వెనుక కూర్చునే వారికి (పిలియన్ రైడర్) కూడా హెల్మెట్ ధరించే అవకాశం కలుగుతుంది. తరచూ నాణ్యత లేని హెల్మెట్లు వాడటం లేదా అసలు హెల్మెట్ లేకుండా ప్రయాణించడం వంటి సమస్యలకు ఇది కొంతమేర పరిష్కారం చూపుతుందని నిపుణులు భావిస్తున్నారు.

# యోగముద్రలో ప్రపంచం

## వివిధ దేశాల్లో అట్టహాసంగా సాగిన 'అంతర్జాతీయ యోగా డే' వేడుకలు

### న్యూఢిల్లీ నుంచి న్యూయార్క్ దాకా పాల్గొన్న పలువురు నాయకులు, వివిధ రంగాల ప్రముఖులు


యోగా చేస్తున్న సైనికులు

**న్యూయార్క్, జూన్ 21:**అంతర్జాతీయ యోగా దినోత్సవం సంబురంగా సాగు తోంది. ప్రపంచవ్యాప్తంగా పలు చోట్ల ప్రముఖులు, పౌరులు యోగాసనాలు వేస్తూ సందడి చేశారు. జమ్ముకశ్మీర్ నుంచి టోక్యో, న్యూయార్క్ సిటీ వరకూ ఎక్కడ చూసినా యోగముద్రలో ఉన్న జనంతో కోలాహల వాతావరణం కని పించింది. ప్రధాని నరేంద్ర మోడీ విశాఖపట్టణంలో యోగాంధ్ర కార్య క్రమంలో ప్రత్యేక అతిథిగా పాల్గొనగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము డెహ్రా డూన్‌లో యోగా డేలో ఆసనాలు వేశారు. జపాన్ ప్రధాని భార్య యొషికొ ఇషిబా టోక్యోలో వేలాది మందితో కలిసి అంతర్జాతీయ యోగా దినోత్స వంలో పాల్గొన్నారు. న్యూయార్క్‌లోని టైమ్స్ స్క్వేర్‌లో బాలీవుడ్ వెటరన్ అనుపమ్‌ఖేర్ ఉత్సాహంగా యోగా సనాలు వేస్తూ కనిపించారు. సరిహద్దుల్లో విధులు నిర్వర్తించే భారత సైనికులు సైతం యోగా డేలో ఉత్సాహంగా పాల్గొన్నారు. సరిహద్దు భద్రతా దళానికి చెందిన సైనికులు అమృత్‌సర్‌లోని అట్టారీ సరిహద్దు వద్ద పలు యోగాసనాలు వేస్తూ.. కాసేపు ధ్యానముద్రలో ఉండిపోయారు. విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి జై శంకర్, రక్షణ శాఖ మంత్రివర్యులు రాజ్‌నాథ్ సింగ్‌లు కూడా యోగ చేస్తూ ప్రశాంతంగా గడిపారు. శనివారం ఉదయం విశాఖ సాగర తీరంలో 'ఒకే భూమి ఒకే ఆరోగ్యం కోసం యోగా' అనే థీమ్‌తో జరిగిన యోగాంధ్ర వేడుకలో పాల్గొన్న ప్రధాని ప్రపంచానికి శాంతి సందేశం వినిపించారు. ఈ రోజుల్లో యోగా అనేది ప్రతిఒక్కరికి అవసరం. వయసు, దేశం విదేశం వంటి తారతమ్యాలు లేకుండా ప్రతి పౌరుడు యోగా చేయాలి. యోగాతో మనలోని ప్రశాంతత అంతర్జాతీయ విధానంగా మారే అవకాశముందని మోడీ తెలిపారు. ఐక్యరాజ్యసమితిలోని సభ్యత్వం ఉన్న అనేక దేశాల్లో యోగాడేను నిర్వహించారు. మొత్తం 191 దేశా ల్లోని 1300 నగరాల్లో ప్రజలు, నాయకులు, పదవుల్లో ఉన్న వారు యోగాడేలో పాల్గొన్నారు. సుమారు 2వేలకుపైగా ప్రత్యేకయోగా కార్య క్రమాలను నిర్వహించారు. బ్రెజిల్, అర్జెంటీనా, రష్యా, చైనా, దక్షిణాఫ్రికా, మలేసియా, శ్రీలంక, ఇండోనేసియా, సింగపూర్, దక్షిణకొరియా వంటి దేశాలనుంచి వచ్చిన 17 మంది యోగా గురువులు ఆధ్వర్యంలో దేశంలో యోగాబంధన్ ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఐక్యరాజ్యసమితిలోని ఉత్తరలాన్ ప్రాంతంలో యోగాడే కార్యక్రమంలో సమితి కార్యాలయ సిబ్బంది, అధికారులు పాల్గొని యోగాసనాలు వేసారు. యోగా ఫర్ వన్ ఎర్త్, అండ్ వన్ హెల్త్ సందేశంతో 11వ అంతర్జాతీయ యోగాడే కార్యక్రమాలను నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఐక్యరాజ్యసమితిలో భారత్ చేసిన ప్రతిపాదనలకు 171 దేశాలు ఏకగ్రీవంగా ఆమోదం తెలపడంతో ఆనాటి నుంచి ప్రత్యేక సందేశాత్మక ప్రచారంతో అంతర్జాతీయ యోగాడేను నిర్వహిసున్నారు.


సఫ్దర్‌జంగ్ వద్ద యోగా ప్రదర్శన దృశ్యం

# ఫోన్ ట్యాపింగ్‌పై సోమవారం నుంచి బిజెపి నేతల వాంగ్మూలం

### ముందుగా కేంద్రమంత్రి బండి సంజయ్ హాజరు?

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో సంచలనం రేపిన ఫోన్ ట్యాపింగ్‌పై బిజెపి నేతల వాంగ్మూలం సోమవారం నుంచి నమోదు చేయనున్నారు. ఈ కేసులో ఇప్పటికే పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌తో పాటు మాజీ ఎంఎల్‌ఎ గోనె ప్రకాష్ రావు, గద్వాల మాజీ జడ్‌పి ఛైర్మన్ సరిత సహా పలువు రు కాంగ్రెస్ నేతలు ఇప్పటికే సిట్ అధికారులకు వాంగ్మూలం ఇవ్వడం తెలిసిందే. ఇదే కేసులో బిజెపి నేతల వాంగ్మూలం ఇప్పటికే ఇవ్వాల్సి వుండగా అనేక కా రణాల వల్ల ఇది వాయిదా పడింది. సోమవారం నుంచి బిజెపి నేతల వాంగ్మూలం మొదలుకానుందని తెలిసింది. ముందుగా కేంద్ర మంత్రి బండి సంజయ్ సిట్ అధికారి ఎదుట సోమవారం ఉదయం హాజరు కానున్నట్లు సమాచారం. ఫోన్ ట్యాపింగ్ కేసులో బండి సంజయ్ ఫోన్ ట్యాపింగ్ అయినట్లు తేలడంతో దీనిపై ఆయన వాంగ్మూలం తీసుకోవాలని భావించిన సిట్ అధికారులు దీనిపై శుక్రవారం నాడు నేరుగా సంజయ్‌కు ఫోన్ చేసి వాంగ్మూలం కోసం సమయం ఇవ్వాలని కోరారు. ఈ విషయాన్ని బండి సంజయ్ కూడా ధృవీకరించారు. సోమవారం ఉదయం ఆయన విచారణకు హాజరై ఫోన్ ట్యాపింగ్‌కు సంబంధించి వాంగ్మూలం ఇవ్వడంతో పాటు దీనిపై తన వద్ద వున్న ఆధారాలను సమర్పించనున్నారని తెలిసింది. ఫోన్ ట్యాపింగ్‌లో బండి సంజయ్ నాటి ఎస్‌ఐబి బాస్ ప్రభాకర్ రావు పై తీవ్రంగా ఆరోపణలు చేయడంతో పాటు నాటి సిఎం కెసిఆర్ కార్యాలయం కేంద్రంగా ఈ గోల్‌మాల్ నడిచిందని వెల్లడించడం తెలిసిందే. కాగా బండి సంజ య్‌తో పాటు ఆయన అనుచరులు కూడా సోమవారం నాడు వాంగ్మూలం ఇవ్వనున్నారని సమాచారం. వీరి తరువాత బిజెపి ఎంపిలు ఈటల రాజేందర్, ధర్మ పూరి అర్వింద్ సహా ఆ పార్టీ నేతలు పలువురి సిట్ విచారించి వారందరి వాంగ్మూలం నమోదు చేయనుంది. ఇదంతా నాలుగైదు రోజుల పాటు సాగే అవకాశా లున్నాయి.

# రైతు భరోసా కింద ఇంతవరకూ రూ.7,770.83 కోట్లు జమ

### వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** ఈ వానాకాలం సీజన్‌లో ఇంత వరకూ (6 రోజుల్లో) రైతు భరోసా కింద 7,770.83 కోట్ల రూపాయల నిధులు విడుదల చేసినట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో పంట పండే ప్రతీ గుంటకు రైతు భరోసా చెల్లించే బాధ్యత తమదని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం రైతు సంక్షేమం కోసం దేశంలో ఏ రాష్ట్రం అమలు చేయని విధంగా 2 లక్షల రూపాయల లోపు రుణమాఫీని ఒకేసారి చేశామన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల ఉన్న 2.18 లక్షల ఎకరాలలో దాదాపు 93000 ఎకరాల వరకు రియల్ ఎస్టేట్ వెంచర్లు, సాగుకు అనువుకాని భూములను ఇప్పటికే గుర్తించామని, వీటికి తప్ప సాగులో ఉన్న మిగతా 1.20 లక్షల ఎకరాల భూమికి రైతుభరోసా పథకాన్ని వర్తింపచేయుటకు కట్టుబడి ఉన్నామని వివరించారు. ఈ రైతులకు కూడా రానున్న 2,3 రోజులలో రైతు భరోసా నిధులు వారి ఖాతాలలోకి జమ చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. సాగు చేసే భూములకే రైతు భరోసా అందించాలనే ఉద్దేశ్యంతోనే ఔటర్ రింగ్ రోడ్ లోపల ఉన్న భూముల విషయంలో సమయం పట్టిందని చెప్పారు. కాని దీనిని కూడా బిఆర్‌ఎస్ నాయకులు రాజకీయ లబ్ధి కోసం వాడుకోవాలని చూస్తున్నారు. కోతల ప్రభుత్వమని బిఆర్‌ఎస్ పార్టీని ప్రజలు, రైతులు తిరస్కరించిన విషయం వారు మరిచినట్టున్నారని ఎద్దేవా చేశారు. రైతుల తరపున పేటెంట్లు తమకే ఉన్నట్టు ప్రవర్తిస్తున్న బిఆర్‌ఎస్ నాయకులు, వారి హయాంలో అమలు చేసిన రుణమాఫీని గుర్తుచేసుకుంటే రైతుల ముందుకు రావడానికి కూడా మొహం చెల్లదని విమర్శించారు. రైతుబంధు నిధులను ఎన్ని నెలల పాటు విడుదల చేశారో ఒకసారి తిరిగి చూసుకోవాలని హితవు పలికారు. అంతేకాకుండా వారు విడుదల చేసిన నిధుల మొత్తం కూడా ఎప్పుడు 7,624 కోట్ల రూపాయలు దాటలేదన్నారు. కాని తమ ప్రభుత్వం ఇప్పటికే కేవలం 6 రోజులలోనే 9 ఎకరాల వరకు రైతు భరోసా కోసం 7,700 కోట్లు విడుదల చేశామని పేర్కొన్నారు. ప్రకటించిన 2 లక్షల రుణమాఫీ కూడా, గత ప్రభుత్వ మాదిరిగా విడతల వారిగా, సంవత్సరాల వారిగా చేయకుండా, ఏకమొత్తంలో అధికారంలోకి వచ్చిన మొదటి పంటలోపే చెల్లించామని ఇదీ రైతుల పట్ల మా ప్రభుత్వానికున్న నిబద్ధత అని తెలిపారు.


ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో కెటిఆర్‌కు స్వాగతం పలుకుతున్న తెలంగాణ విద్యార్థులు

# ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీలో కెటిఆర్‌కు తెలంగాణ విద్యార్థుల స్వాగతం

**హైదరాబాద్ (సరూర్‌నగర్), జూన్ 21, ప్రభాతవార్త:** గ్రేట్ బ్రిటన్‌లోని ప్రతిష్టాత్మక ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీకి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఐటి, మున్సిపల్ శాఖల మాజీ మంత్రి కెటిఆర్‌కు అక్కడి యూనివర్సిటీలో చదువుతున్న తెలంగాణ విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. రెండు రోజుల లండన్ పర్యటనలో భాగంగా కెటిఆర్ ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో జరిగే ఆక్స్ ఫర్డ్ ఇండియా ఫోరంలో భారత అభివృద్ధికి ఫ్రంటియర్ టెక్నాలజీ పాత్ర అనే అంశంపై ప్రసంగించడానికి ప్రత్యేక ఆహ్వానం మేరకు వెళ్ళిన సంగతి విదితమే. అయితే ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీ చేరుకున్న కెటిఆర్‌కు అక్కడ తెలంగాణకు చెందిన విద్యార్థులు అజయ్‌రెడ్డి సామల తదితరులు ఘన స్వాగతం పలికారు. ఈ మేరకు ఆయనకు పుష్పగుచ్ఛాలనందజేసి సాదరంగా ఆహ్వానించారు. అదే విధంగా కెటిఆర్ వెంట వెళ్ళిన తెలంగాణకు చెందిన యువ నేత, బిఆర్‌ఎస్ మీడియా సెల్ జాతీయ కన్వీనర్ పట్లోళ్ళ కార్తీక్‌రెడ్డికి కూడా విద్యార్థులు స్వాగతం పలికారు. కాగా తెలంగాణ ఖ్యాతిని పెంచే విధంగా కెటిఆర్ ఆక్స్ ఫర్డ్ యూనివర్సిటీలో ప్రసంగం చేయడం పట్ల అక్కడి తెలంగాణ విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

# చేతివృత్తుల వస్తుప్రదర్శనశాల

### 25 నుంచి 29 వరకు : మంత్రి పొన్నం ప్రభాకర్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే బోనాల ఉత్సవాల సందర్భంగా చేతివృత్తుల ప్రదర్శనను చేపట్టాలని బిసి సంక్షేమ శాఖ నిర్ణయించింది. ఈ నెల 25 నుంచి 29 వరకు 5 రోజులపాటు చేతి వృత్తుల వస్తు ప్రదర్శన శాలను ఏర్పాటు చేయనున్నట్టు బిసి సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. బోనాల ఉత్సవాల సంధర్బంగా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 25 నుంచి 29 వరకు చేతివృత్తుల కళాకారులచే తయారుచేసిన వివిధ వస్తువుల ప్రదర్శన, విక్రయాన్ని టాంక్ బండ్‌పై గల అంబేద్కర్ విగ్రహము ప్రక్కన ఉన్న గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఈ ప్రదర్శనలో కుమ్మరులు తయారుచేసిన మట్టిపాత్రలు, గౌడన్నలచే నీరా స్టాల్, మేదరివారు తయారు చేసిన వెదురు వస్తువులు, హ్యాండ్ లూమ్స్ (పోచంపల్లి ఇక్కత్, గద్వాల్, నారాయణపేట్) పూసలవారి సామగ్రితోపాటు ఇతర బిసి వర్గాలచే తయారుచేసిన వస్తువులు దాంతోపాటు తెలంగాణ వంటకాలు, బెస్త సోదరులచే చేప వంటకాలు, ఇతర భోజన స్టాల్స్ ప్రదర్శించబడనున్నాయి.

అవి కొనుగోలుకు అందుబాటులో పెట్టనున్నారు. ఈ ప్రదర్శన ప్రతిరోజు ఉదయం 10 గంటల నుండి రాత్రి 9:30 గంటల వరకు ఉంటుంది. ఇట్టి ప్రదర్శనకు ప్రజలకు ఉచిత ప్రవేశము కల్పించబడిందని.. కాబట్టి ఇట్టి ప్రదర్శనకు ప్రజలు హాజరై ప్రదర్శనను తిలకించి వారికి నచ్చిన వస్తువులు కొనుగోలు చేసి విజయవంతము చేయాలని బిసి సంక్షేమ శాఖ తరపున మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

### కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ



# ఇప్పటివరకూ చూసింది ట్రైలరే.. అసలు సినిమా ముందుంది!

**న్యూఢిల్లీ, జూన్ 21:** దేశంలో గడచిన 11 ఏళ్లలో ప్రజలు చూసింది కేవలం ఒక న్యూస్ రీల్ మాత్రమేనని, అసలైన సినిమా ఇంకా మొదలు కాలేదని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ ఏ బాధ్యతలు అప్పగించినా వాటిని సమర్థవంతంగా నిర్వర్తించడానికి తాను సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. కేంద్ర ఓడరేవులు,హైవే శాఖలమంత్రి నితిన్ గడ్కరీ తన భవిష్యత్ ప్రణాళికలు, పార్టీలో తన స్థానం గురించి పంచుకున్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో తన పాత్రపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటివరకు మీరు చూసింది కేవలం న్యూస్ రీల్ మాత్రమే. అసలైన సినిమా ఇంకా ప్రారంభం కాలేదు.

కార్యకర్తలు ఏం చేయాలి, వారికి ఎలాంటి బాధ్యతలు అప్పగించాలి అనే విషయాలను పార్టీ నిర్ణయిస్తుంది. పార్టీ నాకు ఏ బాధ్యత అప్పగించినా దాన్ని చిత్తశుద్ధితో నెరవేరుస్తానని గడ్కరీ తెలిపారు. ఇటీవల తాను రోడ్ల నిర్మాణ పనుల కంటే వ్యవసాయం, ఇతర సామాజిక సేవా కార్యక్రమాలపై ఎక్కువగా దృష్టి సారిస్తున్నట్లు గడ్కరీ తెలిపారు. గత 11 ఏళ్ల మోదీ పాలన గురించి ప్రస్తావిస్తూ, విదర్భ ప్రాంతంలో రైతుల ఆత్మహత్యలను నివారించేందుకు కృషి చేయాలన్నదే తన ప్రధాన ఆకాంక్ష అని గడ్కరీ అన్నారు. దేశంలో తలసరి ఆదాయం విషయంలో ప్రపంచంలోని తొలి పది దేశాల్లో భారత్ ఎందుకు లేదని అడిగిన ప్రశ్నకు సమాధానమిచ్చారు. దేశ జనాభానే దీనికి ప్రధాన కారణమని జనాభా నియంత్రణను భాషాపరమైన లేదా మతపరమైన సమస్యగా చూడకూడదు. దాన్ని ఒక ఆర్థిక సమస్యగా పరిగణించాలి. దేశంలో ఎంతో అభివృద్ధి జరుగుతున్నప్పటికీ, జనాభా పెరుగుదల వల్ల ఆ ఫలాలు అందరికీ పూర్తిస్థాయిలో అందడం లేదని ఆయన విశ్లేషించారు. గత రెండు పర్యాయాల్లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అనేక రంగాల్లో గొప్ప విజయాలు సాధించిందని గడ్కరీ ఈ సందర్భంగా గుర్తుచేశారు. దేశ ప్రగతికి దోహదపడిన అనేక ముఖ్య నిర్ణయాలు, పథకాలను ఆయన ప్రస్తావించారు.

# విద్యుత్ ఉద్యోగులకు డిఎ ప్రకటన

### భవిష్యత్తు సవాళ్లకు సిద్ధంకండి

### డిప్యూటీ సిఎం విక్రమార్క

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** విద్యుత్ రంగంలో భవిష్యత్‌లో ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా అధిగమించేందుకు సిద్ధం కావాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. ఇదే సమయంలో విద్యుత్‌లో తెలంగాణ దేశానికి దిక్సూచి కావాలని ఆకాంక్షించారు. హైదరాబాద్‌లో శనివారం విద్యుత్ ఉద్యోగులకు డి ఎ ప్రకటించిన అనంతరం ప్రసంగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు డిమాండ్‌కు రెట్టింపు విద్యుత్ ఉత్పత్తికి ఇప్పటినుంచే రాష్ట్ర ప్రభుత్వం అంచనాలు సిద్ధం చేసుకుని ముందుకు పోతుందని తెలిపారు. పెంచిన డిఎ ఈ సంవత్సరం జనవరి నుంచి అమల్లోకి వస్తుందని చెప్పారు. ఉద్యోగుల సంక్షేమమే తమ ప్రధాన ధ్యేయమని స్పష్టం చేశారు. ఇందులో భాగంగా విద్యుత్ ఉద్యోగులు, పెన్షనర్లకు 1.944 శాతానికి డిఎ పెంచి ఇవ్వాలని నిర్ణయించామన్నారు. ఈ నిర్ణయం ఫలితంగా రాష్ట్రంలోని 71,417 మంది ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. ఇది ఉద్యోగులు, పెన్షనర్లతో పాటు, ఆర్టిజన్స్‌కు కూడా వర్తిస్తుందని తేల్చిచెప్పారు. పెంచిన డీఎతో విద్యుత్ సంస్థలపై ప్రతి నెల 11.193 కోట్ల రూపాయల భారం పడుతుందని తెలిపారు. 2023 మారిలో 15 వేల మెగావాట్ల పీక్ డిమాండ్ రాగా, ఈ ఏడాది మార్చిలో అది 17162 మెగావాట్ల పీక్ డిమాండ్‌కు పెరిగిందని వివరించారు. గత ప్రభుత్వ కాలంతో పోలిస్తే అదనంగా 2000 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ వచ్చింది. రాబోయే రోజుల్లో విద్యుత్ డిమాండ్ తీవ్రంగా పెరగనుందని అంచనా వేస్తున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో 2029-30 నాటికి 26299 మెగావాట్ల విద్యుత్ డిమాండ్ ఏర్పడనుందని, 2034-35 నాటికి 33773 మెగావాట్లకు చేరుకుంటుందని కేంద్రం నివేదిక ఇచ్చిందన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తదుపరి న్యూ గ్రీన్ ఎనర్జీ పాలసీ-2025 తీసుకువచ్చి 2029-30 నాటికి 20000 మెగావాట్ల గ్రీన్ పవర్ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌కో సిఎండి కృష్ణ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిజిక్స్ వాలాతో ఇంటర్ బోర్డు ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలి

### ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాత వార్త:** ఫిజిక్స్ వాలాతో ఇంటర్ బోర్డు చేసుకున్న ఒప్పం దాన్ని వెనక్కి తీసుకోవాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్‌ఎఫ్‌ఐ) తెలంగాణ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. విద్యా ర్థులకు ప్రభుత్వమే నాణ్యమైన ఉచిత కోచింగ్ ఇప్పించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్ రజనీ కాంత్, రాష్ట్ర కార్యదర్శి టి నాగరాజు డిమాండ్ చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లోని విద్యార్థిని, విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా జెఈఈ, నీట్, క్లాట్ కోచింగ్ ఇవ్వాలనీ నిర్ణయించటం హర్షించదగ్గ విషయమన్నారు. కానీ ఈ కోచింగ్‌ను 'ఫిజిక్స్ వాలా' తో తెలం గాణ అచివర్స్-2025 కోసం చేసిన ఒప్పందాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వమే ఉచిత కోచింగ్‌ను అందించే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'ఫిజిక్స్ వాలా' వంటి సంస్థలతో కాకుండా.. ప్రత్వమే ఉచితంగా నాణ్యమైన కోచింగ్ ఇప్పించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
At: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
OA No. 214 OF 2025
BETWEEN:
M/s. Yes Bank Ltd. ....APPLICANT
Vs
Mr. Gaddameedi Bharath Goud ....Defendant
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
Mr. Gaddameedi Bharath Goud,
S/o.Mr. Ramesh Goud Gaddameedi 16 6 120 8 2, Osman Pura, Chader Ghat, Hyderabad, Telangana-500024. ....Defendant
Please take the summons in the above O.A.No. 214 OF 2025 filed by the Applicant for Recovery of Rs. 27,13,175.50/- (Rupees Twenty Seven Lakhs Thirteen Thousand One Hundred Seventy Five And Fifty Paise Only) against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telugu daily newspaper and posted the matter to 23/07/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 23/07/2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 17th of June, 2025.
(By order of the Court)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
At: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
O.A. No. 215 OF 2025
BETWEEN:
M/s. Yes Bank Ltd. ....APPLICANT
Vs
Mr. Kasula Karunakar Goud ....Defendant
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
Mr. Kasula Karunakar Goud, H.No.1 1 A, Shamirpet Mandal, Thumkunta P.O. Nisa, Hakimpet Dist, Rangareddi, Hyderabad, Telangana-500078. ....Defendant
Please take the summons in the above O.A.No. 215 OF 2025 filed by the Applicant for Recovery of Rs.39,52,915.51/- (Rupees Thirty Nine Lakhs Fifty Two Thousand Nine Hundred Fifteen And Fifty One Paise Only) against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telugu daily newspaper and posted the matter to 23/07/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 23/07/2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 17th of June, 2025.
(By order of the Court)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad

BEFORE THE HON'BLE DEBTS RECOVERY TRIBUNAL -II
At: Triveni Complex, 1st Floor, Abids, Hyderabad
O.A. No. 255 OF 2025
BETWEEN:
M/s. Yes Bank Ltd. ....APPLICANT
Vs
M/s. Sri Nidhi Carbonic Gases ....Defendant
SUMMONS BY WAY OF PAPER PUBLICATION
To,
M/s. Sri Nidhi Carbonic Gases,
Represented by its Proprietor, Mr.Kakaraparthy V V S Murty, 130 and 162, Sy. No.170, Dhulapally Rd, IDA Jeedimetla, Malkajgiri Phase V, Hyderabad-500055. Defendant
Please take the summons in the above O.A.No. 255 OF 2025 filed by the Applicant for Recovery of Rs. 1,56,25,391.89/- (Rupees One Crore Fifty Six Lakh Twenty Five Thousand Three Hundred Ninety One And Eighty Nine Paise Only) against you. The Hon'ble Tribunal ordered summons to you by way of paper publication in "VAARTHA" Telugu Newspaper edition daily newspaper and posted the matter to 23/07/2025.
In accordance with sub-section (4) of section 19 of the Act, you, the defendants are directed as under;
(i) To show cause within thirty days of the service of summons as to why relief prayed for should not be granted; (ii) To disclose particulars of properties or assets other than properties and assets specified by the applicant under serial number 3A of the original application; (iii) You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the original application, pending hearing and disposal of the application for attachment of properties; (iv) You shall not transfer by way of sale, lease or otherwise, except in the ordinary course of his business any of the assets over which security interest in created and / or other assets and properties specified or disclosed under serial number 3A of the original application without the prior approval of the Tribunal; (v) You shall be liable to account for the sale proceeds realized by sale of secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with the bank or financial institutions holding security interest over such assets.
You are hereby required to show cause on 23/07/2025 at 10.30 a.m. at Debts Recovery Tribunal - II, 1st Floor, Triveni Complex, Abids, Hyderabad - 500001, in person or by an Advocate duly instructed as to why the relief prayed for should not be granted.
Take Notice that in case of default the Application will be heard and determined in your absence.
Given under my hand and seal of this Tribunal on this day 17th of June, 2025.
(By order of the Court)
Sd/- Registrar
Debts Recovery Tribunal-II, Hyderabad

### నీటిపారుదల శాఖ ఇఇ నూనె శ్రీధర్ వద్ద

# రూ.250 కోట్ల అక్రమాస్తులు

### పలువురికి బినామీగా వున్నట్లు భావిస్తున్న ఎసిబి కొనసాగుతున్న కస్టడీ విచారణ

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** ఆదాయానికి మించిన అక్రమాస్తుల కేసులో అరెస్టయిన నీటి పారుదల శాఖ ఎగ్జిక్యూటీవ్ ఇంజనీర్ నూనె శ్రీధర్ వద్ద 250 కోట్ల రూపాయల అక్రమా స్తులు వున్నట్లు ఎసిబి అధికారులు గుర్తించినట్లు తెలిసింది. నీటి పారుదల శాఖలో అవినీతి అధికారులుగా ముద్రపడ్డ పలువు రు సీనియర్లతో పాటు ఇంకొందరు రాజకీయ నేతలకు శ్రీధర్ బినామీగా వ్యవహరించినట్లు ఎసిబి గుర్తించిందని సమాచారం.

ఎసిబి కోర్టు ఆదేశాల మేరకు శ్రీధ ర్‌ను ఎసిబి అధికారులు వరుసగా రెండవ రోజు కూడా కస్టడీలోకి తీసుకుని విచారించారు. బంజారాహిల్స్ లోని ఎసిబి ప్రధాన కార్యాలయంలో ఈ విచారణ జ రిగింది. నీటి పారుదల శాఖలో ఇంజనీర్ల సంఘానికి అధ్యక్షుడుగా కూడా వున్న శ్రీధర్‌పై చాలా కాలంగా అవినీతి ఆరోపణలు వున్నాయి. వీటిపై నిర్ధారణ అ యిన తరువాత ఎసిబి అధికారులు ఇటీవల ఆయన ఇంటితో పాటు కార్యాలయంపై దాడులు చేయడం తెలిసిందే. ఆయన బంధువులు, సన్నిహితుల ఇళ్లలోనూ దాడులు జరిగాయి.

ఈ సందర్భంగా పదుల కోట్ల రూపాయల నగదు, నగలు, స్థిర, చరాస్తులను ఎసిబి అధికారులు జప్తు చేయడం విదితమే. శ్రీధర్ గోల్‌మాల్ వ్యవహారాలపై లోతుగా విచారించేందుకు ఐదు రోజుల కస్టడీ విచారణ కొనసాగుతోంది. ఈ విచారణలో శ్రీధర్ పెద్దగా నోరు మెదపడం లేదని తెలిసింది. అయి తే ఆయన వద్ద లభించిన అక్రమాస్తులు, పత్రాల ఆధారంగా ఎసిబి అధికారులు రెండవ రోజు కూడా ప్రశ్నించి కీలక సమాచారం రాబట్టినట్లు తెలిసింది. దీని ఆధారంగా శ్రీధర్ అక్రమాస్తుల విలువ 250 కోట్ల రూపాయలుగా ఎసిబి అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. కాగా శ్రీధర్ విచారణ మంగళ వారం వరకు కొనసాగనుంది.

# వెలిశాలలో మావోయిస్టు నేత గాజర్ల రవి అంత్యక్రియలు

### భారీగా తరలివచ్చిన జనం..

### హాజరైన మానవ హక్కుల సంఘం నేతలు

**జమ్మికుంట (హుజురాబాద్ ఆర్సీ), ప్రభాతవార్త:** అణగారిన ప్రజల అభ్యున్నతి కోసం పోరుబాటలో ఒకే కుటుంబంలోని నలుగురిలో ముగ్గురు అన్నదమ్ములు తుపాకి చేతపట్టి 40 యేళ్లపాటు విప్లవోద్యమంలో పోరు సలిపిన గాజర్ల సారయ్య అలియాస్ అజాద్, 15యేళ్ల క్రితమే ఎన్‌కౌంటర్‌లో మృతి చెందగా, ఆయన మరో సొదరుడు గాజర్ల రవి అలియాస్ గణేష్ అలియాస్ ఉదయ్ ఈ నెల 18న ఎఒబి (ఆంధ్ర-ఒడిశా బార్డర్) దండకారణ్యంలో జరిగిన ఎన్ కౌంటర్‌లో మృతి చెందారు. ఆయనతోపాటు ఎపిలోని విశాఖకు చెందిన అరుణ అలియాస్ వెంకటలక్ష్మి, చత్తీస్‌గఢ్‌కు చెందిన మరో నేత అంజు కూడా మృత్యువాత పడ్డారు. రెండు రోజులపాటు అక్కడి పోలీస్ యంత్రాంగం ఆ ముగ్గురు నేతలపై ఉన్న కేసులు, పూర్వపరాలు పరిశీలించి గురువారం రాత్రి రాజమండ్రిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి గాజర్ల రవి కుటుంబీకులకు ఆయన మృతదేహాన్ని అప్పగించారు. శుక్రవారం ఉదయానికల్లా జయశంకర్ భూపాలపల్లి చిట్యాల మండలం వెలిశాల గ్రామానికి రవి మృతదేహం రావడంతో, అప్పటికే గ్రామానికి చేరుకున్న వేలాది మంది జనం మృతి చెందిన నేతకు ఘనంగా నివాళులు అర్పించారు. భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్య నారాయణరావు, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్ కుమార్, విరసం నేత పాణి, అరుణోదయ కళా మండలి అధ్యక్షు రాలు విమలక్క, ప్రజాసంఘాల నేత గాదె ఈన్నయ్య, మావోయిస్టు మాజీనేత అమర్, జమ్మికుంట మార్కెట్ కమిటీ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం, దళిత సంఘాల నేత మొలంగూరి ప్రభాకర్ హాజరై నివాళులు అర్పించి, పాడే మోశారు. మధ్యాహ్నం రెండు గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర సాయంత్రం 6 గంటలకు ముగిసింది. అశోక్ దగ్గరుండి అన్న గణేష్ అంతిమ దహన సంస్కారాలు నిర్వహించారు. ఆపరేషన్ కగార్ ఆపండి.. శాంతి చర్చలు జరపండి అని ఈ నెల 20న తెలుగు రాష్ట్రాల్లో బంద్‌కు మావోయిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ అధికార ప్రతినిధి జగన్ పిలుపునిచ్చారు. ఈలోపే 18న ఎవోబి ఎన్‌కౌంటర్‌లో గాజర్ల రవి, అరుణ, అంజు మృత్యువాత పడడం గమనార్హం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శాంతి చర్చలు జరపాలని, కొంతకాలం కాల్పుల విరమణ ఆపాలని ప్రజలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.


గాజర్ల రవి మృతదేహానికి నివాళులు అర్పిస్తున్న మార్కెట్ చైర్మన్ పుల్లూరి స్వప్న సదానందం


BEFORE THE DEBTS RECOVERY TRIBUNAL -1
3rd Floor, Triveni Complex, Abids, Hyderabad-500 001
O.A.No.268 of 2023
Between
State Bank of India, SARB-II, Chikkadapally, Hyderabad.
Represented by its Chief Manager ... APPLICANT
And
M/s. Novelty Reddy and Reddy Motors Private Limited & Others ... DEFENDANTS
SUMMONS
To
Smt. Surya Kumari Indukuri, W/o Late I. Ramakrishnamraju, Major, R/o MIG-II, 120, APHB Colony, Bhimavaram - 534 101, Andhra Pradesh State. .... DEFENDANT No.13
Take summons/notice that the Applicant has instituted the above application under Section 19 of the Recovery of Debts & Bankruptcy Act,1993 against the above named Defendants for recovery of a sum of Rs. 99,38,367/- (Rupees Ninety Nine Lakhs Thirty Eight Thousands Three Hundred Sixty Seven Only) together with current and future interest, costs and for other reliefs.
Therefore, you are hereby directed to appear before this Tribunal in person or through an Advocate or duly authorized agent, in support of your defense to show cause on 07-07-2025 at 10.30 AM, as to why reliefs prayed for should not be granted. Take notice that in case of default the above O.A. No.268/2023 will be heard and determined in your absence.
( By the order of the Hon'ble Tribunal)
REGISTRAR,
DEBTS RECOVERY TRIBUNAL-1
Third Floor, Triveni Complex, Abids, Hyderabad- 500 001

తెలంగాణకు అన్యాయం చేయబోమని, తప్పనిసరిగా రాష్ట్ర ప్రయోజనాలను కాపాడతామని జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పష్టం చేసినప్పటికి బనకచర్ల విషయంలో ఆంధ్రప్రదేశ్‌ను తట్టిలేపింది తెలంగాణ పాలకులే అనే విషయం మాత్రం మరవొద్దు. బనకచర్ల పాపం కెసిఆర్‌దే అని ముఖ్యమంత్రి రేవంత్ ఆరోపిస్తే, కాంగ్రెస్ తట్టిలేపిందని హరీశ్‌రావు ఆరోపిస్తున్నారు. పరస్పర అవగాహనతో కాంగ్రెస్, బిఆర్ఎస్ ఉందని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శిస్తున్నారు. తెలంగాణలో 1.50 కోట్ల ఎకరాలకు నీరందించేలా గోదావరిలో 1,000 టిఎంసిలు, కృష్ణాలో 500 టిఎంసిలు మొత్తం 1,500 టీఎంసీలు ఉపయోగించుకోవడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిరభ్యంతర పత్రం ఇచ్చి, దానికి కేంద్రం కూడా ఆమోదం తెలిపితే, ఏపీ బనకచర్ల సహా ఏ ప్రాజెక్టులు నిర్మించుకున్నా తెలంగాణకు అభ్యంతరం లేదని కేంద్రమంత్రికి తెలంగాణ పాలకులు తెలిపారు. పోలవరం బనకచర్ల లింక్ ద్వారా కాకుండా ఇచ్చంపల్లి నాగార్జునసాగర్ అనుసంధానం ద్వారా పెన్నా పరీవాహక ప్రాంతానికి ఏపీ సర్కారు నీరు తీసుకెళ్లాలనుకుంటే దానిపై చర్చించడానికి మేం సిద్ధం అని తెలంగాణ పాలకులు జలశక్తి మంత్రి వద్ద తెలిపారు. త్వరలో ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం ఏర్పాటు చేస్తామని కేంద్రజలశక్తి మంత్రి హామి ఇచ్చారు. బిఆర్ఎస్ నీటివాటాలో తగ్గేదేలే అంటోంది. గోదావరిలో 1,950 టీఎంసీలు, కృష్ణాలోనూ 763 టీఎంసీలు వాటా కోరుతోంది. 'గోదావరిలో కావాల్సినంత నీరుంది ఏటా 3వేల టీఎంసీలు సముద్రంలోకి పోతోంది. రెండు రాష్ట్రాలూ శక్తి మేర వాడుకోవచ్చు. ఎవరికీ నష్టం లేదు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఎన్ని ప్రాజెక్టులు కట్టి ఉపయోగించుకున్నా మహా అయితే చెరో 200 టీఎంసీలే. మిగిలినదంతా సముద్రంలోకి పోయేదే కదా" అని ఆంధ్రద్రేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అంటున్నారు.

# బనకచర్ల దారిలో గోదా'వరీ'!

**భాగ్యనగర్ భాస్కర్ కుమార్**

'ఉప్పొంగే నదుల జీవజలాలు ఉప్పు సముద్రం పాలు' అంటూ1971లో పవిత్ర బంధం సినిమాలో గాంధీపుట్టిన దేశమా అనే పాటలో గీతరచయిత ఆరుద్ర ఆవేదన చెందారు. ప్రాజెక్టులు రాజకీయ పార్టీలకు ఎన్నికల ఆర్థికవనరులుగా ఉపయోగపడుతాయని మన నేతలకు జ్ఞానోదయమయ్యే వరకు 'నీరు' రాజకీయ వస్తువుగా మారడంతో ఇప్పుడు ప్రాజెక్టులు కట్టుకోని పరిస్థితి దాపురించింది. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు తెలంగాణ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల మధ్యఅగ్గిరాజేసింది. తెలంగాణలో మూడు ప్రధాన రాజకీయ పార్టీలు కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పోలవరం బనకచర్ల ప్రాజెక్టు చుట్టే తమ రాజకీయ విన్యాసాలు చేస్తూ ప్రజలను సమస్యల నుంచి పక్కదారి పట్టిస్తున్నారు. తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌పార్టీ పోలవరం బనకచర్ల ప్రాజెక్టుపై అఖిల పక్ష సమావేశం నిర్వహించి తన ప్రత్యర్థులైన బిజెపిని, బిఆర్ఎస్‌ను ఇరుకునపెట్టే ప్రయత్నం చేసింది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గోదావరి జలాలు పెన్నాకు తరలించేందుకు ప్రతిపాదించిన ప్రాజెక్టు పాపం కెసిఆర్‌దే అంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిందించారు. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి దొంగతనంగా పోయి కేంద్రజలశక్తి మంత్రిని కలిసాడని అఖిలపక్షం సమావేశానికి రాలేదని నిందించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చంద్రబాబుకు దాసోహమై రాజీపడి పచ్చజెండా ఊపారని తెలంగాణలోని ప్రధాన ప్రతిపక్షంనాయకుడు తన్నీరు హరీశ్‌రావు ఆరోపించారు. బిజెపి,కాంగ్రెస్ రెండు చంద్రబాబును కొమ్ముకాస్తు తెలంగాణ ప్రయోజనాలు పణంగా పెడుతున్నారని బిఆర్ఎస్ ఆపోస్తుంది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రం పోలవరం బనకచర్ల ప్రాజెక్టు ప్రీఫీజుబిలిటి రిపోర్టును కేంద్ర ఆర్థిక అదనపు కార్యదర్శికి సజ్జన్‌యాదవ్‌కు, కేంద్రజలశక్తి మంత్రిత్వశాఖ జాయింట్ కమీషనర్ అమిత్‌కుమార్‌ఝాలకు తన ఉన్నత స్థాయి అధికారులతో అందజేయించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డిలు కేంద్రజలశక్తి మంత్రి సిఆర్ పాటిల్‌ను కలిసి 1980గోదావరి ట్రిబ్యునల్ అవార్డును ఉల్లంఘించి ఎపెక్స్ కమిటీ అనుమతి లేకుండా కడుతున్న ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కోరారు. కేంద్ర జలశక్తి మంత్రి సిఆర్‌పాటిల్ ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశం ఏర్పాటు చేస్తామని తెలంగాణ ప్రభుత్వాధినేతలకు హామి ఇచ్చింది. మరోవైపు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు "బనకచర్లపై పోరాటం ఎందుకు?ప్రాజెక్టులు కట్టి నీరు తీసుకోండి.. ఎవరొద్దన్నారు? మేం కట్టుకోవద్దన్నామా? దీనిపై రెండు రాష్ట్రాల వారూ ఢిల్లీ పోతాం.. కూర్చుని మాట్లాడతాం అని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. 'గోదావరిలో నీటిని



తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ఉపయోగించుకుంటున్నాయి. నాకు తెలిసినంతవరకు విభజన చట్టంలో ఉన్న పోలవరం తప్ప.. మిగిలినవన్నీ అనుమతి రాని ప్రాజెక్టులే. వాటికి చట్టబద్ధతపై కేంద్రంతో మాట్లాడుకుందాం" అంటూ రాజనీతిజ్ఞతను ప్రదర్శిస్తున్నారు. ఇలాంటి సమయంలో తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల ప్రతిపాదన చంద్రబాబు ముందు పెట్టి ఉభయ కుశలోపరి అనుకుంటే సమస్యతీరుతుంది. జాతీయ నదుల అనుసంధానంలోనూ కీలక భూమిక వహించే పోలవరం బనకచర్ల అనుసంధాన పథకం రాయలసీమకు గేట్‌వే మాత్రమే పరిమితం చేయకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలకు వరప్రదాయినిగా ఉపయోగించుకొనే అవకాశం ఉంది. పోలవరం బనకచర్ల ప్రాజెక్టు నిర్మాణంకు రూ.81,900 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదిస్తున్నారు. కానీ అంతకంటే తక్కువ వ్యయంతో అంటే కేవలం రూ.25వేల కోట్లు ఖర్చుచేస్తేచాలు పోలవరం నుంచి శ్రీశైలంకు నీటిని తరలించడం ద్వారా కృష్ణాబేసిన్‌లోని ఉభయరాష్ట్రాల అవసరాలు తీర్చడమే కాకుండా పెన్నాబేసిన్, కావేరి బేసిన్‌లకు నీటిని తీసుకొని పోయేందుకు మార్గం సుగమం అవుతోంది. పోలవరం నుంచి శ్రీశైలంకు గోదావరి నీటిని రివర్స్ పంపింగ్ ద్వారా ఎత్తిపోయడం ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు మేలుజరుగుతుందని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్షులు శ్యాంప్రసాద్‌రెడ్డి, కార్యదర్శులు వెంకటేశం ఒక ప్రకటనలో తెలిపారు. పోలవరం నుంచి గోదవరి వరద జలాలు రోజుకు 3నుంచి 4 టిఎంసిలు పులిచింతల, నాగార్జునసాగర్ టేయిల్‌పాండ్, ఎస్ఎస్‌పి జలా శయాలను ఉపయోగించుకొని శ్రీశైలం వరకు రివర్స్ పంపింగ్ ద్వారా తరలించి ఉభయ తెలుగురాష్ట్రాల నీటి అవసరాలను తీర్చుకోవచ్చని వారు తెలిపారు. బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం కర్ణాటక రాష్ట్రం అలమట్టి లాల్‌బహదూర్ డ్యామ్ 5మీటర్ల ఎఫ్ఆర్ఎల్ ఎత్తును పెంచుకోవడాని, 125 టిఎంసిలు అదనంగా నిల్వచేసుకోవడానికి అవకాశం ఇచ్చింది. ఆలమట్టి ఎత్తుపెంచితే 125 టిఎంసిల మేరకు కృష్ణానదిలో నీటి వరద తగ్గిపోయే ప్రమాదం ఉంది. జూరాల, శ్రీశైలం, నాగార్జున సాగర్‌కు తగ్గే కృష్ణానది వరద జలాలను ప్రత్యామ్నయంగా గోదావరి జలాలు సప్లమెంటరీ ఫీడింగ్‌గా ఉపయోగించుకోవడానికి వీలవుతోందని తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సూచనపై ఇరు రాష్ట్రాల పాలకులు సమాలోచనలు చేయాల్సి ఉంది. ఏలాంటి భూసేకరణ చేపట్టకుండా నాగార్జున సాగర్‌కు, శ్రీశైలం కు నీటిని ఎత్తిపోసే అవకాశం ఉందని పేర్కొన్నారు. నాగర్జున సాగర్, శ్రీశైలంలో రివర్స్ టర్బన్స్ కూడా ఇప్పటికే ఉపయోగిస్తున్నారు. 2019 నుంచి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి తో తెలంగాణ ముఖ్యమంత్రి ప్రగతి భవన్‌లో గోదావరి జలాలు ఉభయరాష్ట్రాలు శ్రీశైలం వరకు తీసుకొచ్చి అన్ని బేసిన్‌లకు వాడుకొందామని అనేక సమావేశాలలో చర్చించారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా పనిచేసిన జగన్ రెండు టిఎంసిలు పోలవరం నుంచి బనకచర్ల ద్వారా ఎత్తిపోసుకుంటామని రివర్స్ పంపింగ్ ప్రతిపాదన కు సమ్మతి తెలుపకుండా తిరస్కరించారు. ప్రస్తుత సిఎం చంద్రబాబు కూడా అదే ప్రతిపాదనతో ముందుకుపోతున్నారు. ఈపథకాన్ని హైబ్రిడ్ యాన్యుటీ మోడల్ (హెచ్ఏ ఎం)అంటే పబ్లిక్ ప్రైవేట్ పార్ట్‌నర్‌షిప్ (పీపీపీ) విధానంలో నిర్మించతలపెట్టారు. 3లక్షల హెక్టార్ల ఆయకట్టు స్థిరీకరణ, కొత్తగా 9.14 లక్షలహెక్టార్ల ఆయకట్టుకు సాగునీరు, 80లక్షల మందికి తాగునీరు, పారిశ్రామికావసరాలకు 20టీఎంసీలు, 200 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంగా నిర్ణయిం చారు. ఇందుకోసం రోజుకు రెండు టీఎంసీల చొప్పున 100రోజుల పాటు 200 టీఎంసీల గోదావరి వరదజలాలను ఈప్రాజెక్టుకుతరలిస్తారు. పెన్నాబేసిన్‌కు నీటిని తరలించే బనకచర్ల పథకం మూడు దశల్లో చేపడుతారు. పోలవరం-బనకచర్ల మొదటి దశ కింద గోదావరి జలాలను పోలవరం డ్యాం నుంచి కుడిప్రధాన కాలువద్వారా ప్రకాశంబ్యారేజీకి మళ్లిస్తారు. బొల్లా పల్లి రిజర్వాయర్లోకి ఎత్తిపోయడంతో రెండో దశ మొదలవు తోంది. పోలవరంబనకచర్ల ప్రాజెక్టుకు వెన్నెముక బొల్లాపల్లి రిజర్వాయరు వ్యవహరిస్తుంది. దీని సామర్థ్యం 173టీఎంసీలు. రెండోదశలో ప్రకాశం బ్యారేజీ ఫోర్‌షోర్ నుంచి ఆరు దశల్లో ఈ రిజర్వాయరులోకి నీటిని ఎత్తిపోస్తారు. దీనికి మరో ప్రత్యామ్నాయం 1.2 కిలోమీటర్ల పొడవున టన్నెల్‌ను నిర్మించడం. మొదటి ప్రణాళికతోనే సాంకేతికంగా, ఆర్థికంగా లబ్ధి చేకూరుతుంది. దీని అమలుకు కేవలం 15 గ్రామాలకు సహాయ, పునరావాసం కల్పిస్తే సరిపోతుంది. పైగా జాతీయస్థాయిలో నిర్మించే రిజర్వాయర్లకు ఒక టీఎంసీకి సగటున రూ.100కోట్ల నుంచి 200కోట్లు వ్యయమవుతుంటే, బొల్లాపల్లి రిజర్వాయరుకు టీఎంసీకి సగటున రూ.30 కోట్లు మాత్రమే ఖర్చవుతుంది. పైగా దీని ద్వారా 230 మెగావాట్ల జలవిద్యుదుత్పత్తి కూడా జరుగుతుంది. ఈ రిజర్వాయరు నిర్మాణానికి రూ.35,760కోట్ల వ్యయమవుతుందని అంచనా. మూడు ఎత్తిపోతలతో మూడోదశ ఉంటుంది. మొత్తంగామూడు దశల్లో ప్రాజెక్టు నిర్మాణానికి రూ.81,900 కోట్లు వ్యయమవుతాయి. తెలంగాణ విశ్రాంతఇంజినీర్లు ప్రతిపాదన కేవలం 25 వేలకోట్లతోనే పూర్తవుతోంది. ఉభయ రాష్ట్రాలలోని కోట్లాది మందికి తాగునీరు మూడుకోట్ల ఎకరాల సాగుభూమికి స్థిరీకరణ ఏర్పడే అవకాశం కూడాఉంది. ఎపిప్రభుత్వం ఈ దిశగా ఆలోచిస్తే తెలుగు రాష్ట్రాల మధ్యస్నేహబంధం పెరుగుతుంది. ●

మహారాష్ట్ర

చదువుకొనే పిల్లలు ఏ భాషను నేర్చుకోవాలి? ఏ వయసులో నేర్చుకోవాలి?అనే ప్రశ్నలకు సమాధానాలు స్వాతంత్రం వచ్చిన ఏడున్నర దశాబ్దాలకు కూడా ఇంకా వివాదాస్పదం కావడమే ఆశ్చర్యం కలిగిస్తుంది. కేంద్ర ప్రభుత్వాలు ఇప్పటికి అనేకమార్లు విద్యావిధానాల్లో మార్పులు చేసినా వాటిలో ఏదీ సంతృప్తికరంగా అమలుగాకపోవడమే వాటిలోని లొసుగులను తేటతెల్లం చేస్తోంది. ఈ పరిస్థితిలో మహారాష్ట్ర ప్రభుత్వం తరచుగా విద్యావిధానంలో మార్పులు చేస్తూ ప్రజలను మరింత గందరగోళంలోకి నెట్టివేయడమేగాక, పిల్లల భవిష్యత్తుతో ఆటలాడుకుంటున్నదనే విమర్శలు వినిపిస్తున్నాయి. ముఖ్యమంత్రి ఫడ్నవిస్ గతవారం రాష్ట్ర విద్యావిధానంలో మార్పులుచేస్తూ జారీ చేసిన ఉత్తర్వులే అందుకు ఉదాహరణ. ఒకటి నుంచి ఐదవ తరగతి వరకు హిందీని తప్పనిసరి చేస్తూ ఫడ్నవిస్ ప్రభుత్వం గతంలో నిర్ణయం తీసుకొన్నప్పటి నుంచి మహారాష్ట్రలో ఆందోళనలు మొదలయ్యాయి. మహారాష్ట్ర నవ నిర్మాణ సేన అధ్యక్షుడు రాజ్ ఠాకరే, శివసేన అధినేత ఉద్ధవ్ ఠాకరే హిందీ నిర్బంధ అమలుకు వ్యతిరేకంగా పెద్దఎత్తునే ఆందోళనలు చేపట్టారు. ప్రభుత్వంలోని కూటమి పార్టీలలో దానిపై రాజకీయంగా చీలికలు వచ్చేట్లుగా కనిపించడంతో ఫడ్నవిస్ ఎట్టకేలకు దిగివచ్చి ప్రభుత్వ ఉత్తర్వులలోని 'తప్పనిసరి' అనే మాటను తొలగిస్తూ, మరికొన్ని నిబంధనలు చేర్చారు. దాని ప్రకారం విద్యార్థులు మూడో భాషగా హిందీకి బదులు మరో భారతీయ భాషనుఎంచుకోవచ్చు. అయితే ఆ భాషను నేర్చుకోవాలనుకొనే విద్యార్థులు తరగతిలో కనీసం 20 మంది ఉండాలట. అంతకు తక్కువ ఉంటే వారికి ఆన్‌లైన్‌లో ఆ భాషను బోధిస్తారట. లేకుంటే హిందీని నేర్చుకోవచ్చు. పైకి ఇది వినడానికి బాగానే ఉన్నట్లనిపించినా దానిలో చిన్న తిరకాసు కూడావినిపిస్తోంది. హిందీగాక మరో భాష నేర్చుకోవాలనుకునే వారు తరగతిలో కనీసం20మంది ఉండాలనడం సహేతుకమా?అని విపక్షాలే గాక తల్లిదండ్రులు కూడా ప్రశ్నిస్తున్నారు. అంటే హిందీని బలవంతంగా రుద్దడానికే ప్రభుత్వం ఈచర్య తీసుకొంటున్నదనుకోవచ్చు. నిర్బంధ హిందీని నేరుగా ప్రకటించకుండా ప్రభుత్వం దొడ్డిదారిన ఇలా హిందీ

# రెండా..మూడా?

**ఎ.వి.వి ప్రసాద్**

వాడకాన్ని ప్రోత్సహిస్తున్నదనీ, తద్వారా 'వన్ నేషన్ వన్ లాంగ్వేజ్' అనే ప్రతిపాదనకు బలం చేకూర్చినట్లవుతున్నదనీ విమర్శిస్తున్నారు. ఒక విధంగా ప్రభుత్వం ఆలోచన హిందీకి అనుకూలంగా ఉన్నట్లే భావించాలి. దక్షిణాది రాష్ట్రాల్లో తమిళనాడు, కర్ణాటక హిందీని పూర్తిగా వ్యతిరేకిస్తుండగా, ఎపి,తెలంగాణలో పాక్షికంగా అమలు చేస్తున్నారు. మాతృ భాషకు అదనంగా ఇంగ్లీషు తప్పనిసరనీ మూడోభాషగా ఇష్టం వచ్చిన భారతీయ భాషను నేర్చుకోవచ్చునని కొత్త విద్యావిధానం (ఎన్ఇపి 2020)లో చెబుతున్నా ఆ మూడో భాషగా హిందీని అమలు చేయడానికే ఎన్డీయేపాలనలోని రాష్ట్రాలు ఆసక్తిని చూపుతున్నాయి. ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నచోట కూడా



ఫడ్నవిస్

ముఖ్యంగా తమిళనాడులో ఎక్కువ వ్యతిరేకత కనిపిస్తోంది. మహారాష్ట్రలో త్రిభాషా విధానం అమలుచేస్తూ హిందీని మూడోభాషగా నిర్బంధం చేయడంతో పెద్దఎత్తున వ్యతిరేకత వ్యక్తమవుతోంది. దానితో నిబంధనల్లో మార్పు చేసినా కొత్త 'క్లాజ్' లు చేర్చడంతో ఇప్పుడు అది కూడా ఆందోళనలకు దారితీస్తోంది. గతవారం ఫడ్నవిస్ ప్రభుత్వం నిబంధనల సవరణ ప్రకటించగానే తల్లిదండ్రులు, రాజ్‌ఠాకరే భారీగానే నిరసనలు వ్యక్తంచేశారు. పైపెచ్చు ఒకటవ తరగతి నుంచి త్రిభాషా విధానం అమలు చేయాలని కూడా ఫడ్నవిస్ ప్రభుత్వం నిర్ణయించింది. ప్రాథమిక స్థాయి నుంచి మూడో భాషచదవాలనే నిబంధన విధిం చడం దేశంలో ఒక్క మహారాష్ట్రలోనే కనిపిస్తోంది. మిగిలిన రాష్ట్రాల్లో కొన్నిచోట్ల 5వ తరగతి నుంచి, కొన్నిచోట్ల ఏడు, ఎనిమిది తరగతుల నుంచి అమలు చేస్తున్నారు. ఐదవ తరగతి దాటితే విద్యార్థులకు అర్థం చేసుకునే పరిస్థితి వస్తుంది గనుక అక్కడినుంచి వారికి మూడో భాషను నేర్పినా ఫలితం ఉంటుంది. మాతృ భాషతో పాటు ఇంగ్లీషు నేర్చుకోవడమే ప్రాథమిక స్థాయిలో కష్టమనీ, మూడోభాషను కూడా నేర్చుకోవాలనడం విద్యార్థులను తీవ్రఒత్తిడికి గురి చేస్తుందనీ దానివల్ల మరిన్నిఅనర్థాలు సంభవిస్తాయనీ తల్లిదండ్రులు, నిపుణులు అంటున్నారు. ప్రాథమిక స్థాయి నుంచే మూడో భాషగా హిందీని రుద్దితే విద్యార్థులు స్థానిక మరాఠా సంస్కృతికి, భాషకు దూరమవుతారనీ, దానివల్ల రాష్ట్ర భవిష్యత్తు అంధకారం లోకి వెళ్తుందనీ అంటున్నారు. ఈ అభిప్రాయం సమర్థనీయమే అనిచెప్పాలి. మాతృ భాష, మాతృసంస్కృతికి విఘాతం కలిగించే ఏ విషయమైనా వ్యతిరేకించవలసిందే. లేకుంటే దీర్ఘకాలంలో సమాజం చాలా నష్టాలను చవిచూడవలసి వస్తుంది. శివసేన, ఎంఎన్ఎస్ వంటిపార్టీలు మరాఠా పరిరక్షణకు మద్దతు పలుకుతూ ఆందోళన కార్యక్రమాలు ప్రకటించడంతో, తరువాత ఎప్పుడైనా ప్రభుత్వం పునరాలోచన చేస్తేఈలోగా కాలయాపన జరిగి విద్యార్థులు మరిన్ని సమస్యలు ఎదుర్కొనవలసి వస్తుంది. సంబంధిత పాఠ్యపుస్తకాలు అందుబాటులో లేకపోవడంతో ఏభాష తీసుకోవాలో తెలియక అయోమయంలో పడుతున్న విద్యార్థులు కూడా ఉన్నారు. ముఖ్యంగా ప్రాథమిక స్థాయి నుంచి మూడోభాషను నేర్చుకోవాలనే విధానాన్ని మార్చుకొనకపోతే బాలలభవి ష్యత్తు చిక్కుల్లో పడుతుందనే చెప్పాలి. కొన్ని తరగతుల తర్వాత మళ్లీమూడో భాషను మార్చుకోవలసి వస్తే వారు ఏ భాషను సంతృప్తికరంగా నేర్చుకోలేని పరిస్థితి ఏర్పడుతుంది. విద్యాసంవత్సరం ఇప్పుడే మొదలైంది కనుక ఎక్కువ కాల యాపన చేయకుండా ఫడ్నవిస్ ప్రభుత్వం సరైన నిర్ణయంతీసుకోవడం అవసరం. త్రిభాషా విధానం అనుసరించినా దానిని ప్రాథమిక స్థాయి నుంచి అమలు చేయకపోవడమే మంచిది. కనీసం ఐదారు తరగతుల దాకా ద్విభాష తోనే సరిపెడితే విద్యార్థుల్లో వికాసం సంతృప్తికరంగా సాగుతుంది. ●

థాయిలాండ్

ఆగ్నేయాసియాలోని ఒక చిన్న దేశంలో పిన్నవయసులోనే అత్యున్నత పదవిని అధిష్టించిన థాయిలాండ్ ప్రధానమంత్రిని ఇప్పుడు పదవీగండం చుట్టుముడుతోంది. అదికూడా ఒక చిన్న ఫోన్‌కాల్ కావడం, పొరుగుననే అంతంతమాత్రం సంబంధాలున్న దేశ మాజీ ప్రధానితో జరిపిన సంభాషణలు లీక్‌కావడం మొత్తం అంతర్గత ముసలానికి దారితీసింది. థాయిలాండ్‌లో అనువంశిక పాలనగా వస్తున్న ప్రస్తుత పిన్నవయసు 38ఏళ్ల ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర పదవీసంక్షోభం ఎదుర్కొంటున్నారు. పొరుగుననే ఉన్న కాంబోడియా దేశ మాజీప్రధాని హున్‌సేన్‌తో జరిపిన సంభాషణలు లీక్ అయ్యాయి. ఇవి ఎవరు లీక్‌చేసారు. ఏ లక్ష్యంతో చేసారనేది పక్కనపెడితే ఈఫోన్‌సంభాషణలో షినవత్ర తనదేశ ఆర్మీ కమాండర్ తనకు ప్రత్యర్థిగా మారుతున్నాడని ఆవలి వ్యక్తితో చెప్పిన మాటలు థాయి ప్రజల్లోనే అసహనం పెంచుతున్నాయి. తన తండ్రి సమకాలికుడు అయిన హున్‌సేన్‌ను 'అంకుల్' అని ఎంతోప్రేమగా పిలిచిన షినవత్రకు ఇప్పుడు ఈమాజీప్రధాని పదవీగండం తెచ్చిపెట్టాడు. నిజానికి పొరుగుననేఉన్న కంబోడియాతో థాయిలాండ్‌కు సంబంధాలు అంతంతమాత్రంగానే ఉన్నాయి. 2023 వరకూ అక్కడ ప్రధానిగా ఉన్న హున్‌సేన్ తర్వాత తన కుమారుడు హున్ మానెట్‌కు బాధ్యతలు అప్పగించారు. పదవిలో లేకపోయినా కంబోడియా రాజకీయాలను ఇప్పటికీ హున్‌సేన్ ప్రభావితం చేయగలడు. ఆయనతోనే ఇప్పుడు థాయ్‌ప్రధాని షినవత్ర చేసిన ఫోన్‌సంభాషణ లీక్ అయిఆమెకు పదవీగండం తెచ్చిపెట్టింది. పైగా ఈఫోన్‌సంభాషణ తానే రికార్డు చేసానని, 17నిమిషాలకాల్‌ను ఫేస్‌బుక్‌లో పోస్టుచేసి మరీ చెప్పిన కంబోడియా మాజీప్రధాని పారదర్శకత కోసమే ఇలాచేసినట్లు ఎలాంటి పొరపొచ్చాలు ఉండకూడదన్న భావనతోనే పోస్టుచేసానని చెప్పడం, ఆపై ఈసంభాషణలన్నీ కూడా సుమారు 80 మందితో పంచుకున్నట్లు కూడా వెల్లడించడంతో థాయిప్రజల ఆగ్రహావేశాలు కట్టలు తెంచుకున్నాయి. సరిహద్దు వివాదాలతో సతమతం అవుతూ ఒక సైనికుడి మరణానికి కారణం అయినప్పటినుంచి రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్నాయి. సరిహద్దులు మూసివేసారు. ఇప్పుడు తన సంభాషణల్లో సరిహద్దుల ఆంక్షలు తొలగింపు కూడా ప్రస్తావనకు వచ్చింది. అయితే ఆర్మీ కమాండర్ దీన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. థాయిలాండ్ రాజరిక రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు సైన్యం దేశ భద్రత, రక్షణకు కట్టుబడి పనిచేస్తుందని, థాయిలాండ్ ప్రజల సంక్షేమంకోసం పనిచేస్తుందని ప్రకటించారు. అంతేకాకుండా షినవత్ర వ్యాఖ్యలు కూడా తీవ్రంగా తప్పుపట్టారు. దేశ సైన్యాధ్యక్షుడిని 'ప్రత్యర్థి' అని సంబోధించడంపై ప్రభుత్వంలోకూడా నిరసనలు మిన్నంటాయి. వాస్తవానికి సంకీర్ణ కూటమి ప్రభుత్వాన్ని షినవత్ర నడుపుతున్నారు. ప్రధాన పార్టీఅయిన భూమ్ జై థాయ్‌పార్టీ కూటమినుంచి వైదొలుగుతున్నట్లు ప్రకటించింది. దీనితో పార్లమెంటులో షినవత్ర మైనార్టీలో పడిపోయారు.

# షినవత్రకు 'అంకుల్' సెగలు!


**గన్ని మోహన్**



షినవత్ర

ఇదే అదనుగా ప్రతిపక్షాలు వెంటనే పదవినుంచి దిగిపోవాలని, లేదా రాజీనామాచేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహించాలని పట్టుబడుతున్నారు. పార్లమెంటు భవనం ముందు ప్లకార్డులు, థాయి జెండాలను చేతబూని నిరసన ప్రదర్శనలకు సైతం దిగారు. ఈ యువ ప్రధానికి ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించుకోవడంతోపాటు పదవిని కాపాడుకోవడం, ప్రభుత్వాన్ని పూర్తికాలం కొనసాగించడం ఏకైక లక్ష్యంగా మారింది. మైనార్టీనుంచి గట్టెక్కడం అంటే షినవత్రకు కత్తిమీద సాములాంటిదే. మరోపక్క దేశ ప్రజల్లో మళ్లీ సైనిక తిరుగుబాటు వచ్చి మిలిటరీ రాజ్యం వస్తుందేమోనన్న భయాందోళనలు పెరిగాయి. వాస్తవానికి షినవత్ర తండ్రి థక్సిన్ షినవత్రను 2006లో తిరుగుబాటుతో దించేసారు. అలాగే తర్వాత వచ్చిన థక్సిన్ సోదరి యింగ్లక్ షినవత్రా 2011లోప్రధాని బాధ్యతలు స్వీకరిస్తే ఆమెను కూడా 2014లో సైన్యం తిరుగుబాటుతో ప్రభుత్వాన్ని కూల్చివేసింది. ఇప్పుడు మళ్లీ ఆ పరిస్థితి వస్తుందన్న భయాలు థాయ్‌ప్రజల్లో పెరిగిపోతున్నాయి. ప్రధాన పార్టీ భూమ్‌జాయ్‌తే వైదొలగడంతో పదిపార్టీల సంకీర్ణ ప్రభుత్వం 255 సీట్లతో ఉంది. 500సీట్లసభలో మెజార్టీ కంటే స్వల్పంగా మాత్రమే ఎక్కువ ఉంది. పీపుల్స్ పార్టీనేత నత్తఫాంగ్ రుయెంగ్‌పన్యావుట్ అయితే ఏకంగా పార్లమెంటును రద్దుచేసి కొత్తగా ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్‌చేసారు. లీక్ అయిన ఫోన్‌కాల్ ఆమె పరిపాలన తీరును తేటతెల్లంచేస్తోందని, థాయ్ రహస్యాలను పొరుగు దేశానికి చేరవేసారని ఆరోపించారు. షినవత్రా తండ్రి హయాంనుంచి కూడా కంబోడియాతో మంచి సంబంధాలే ఉన్నాయి. థక్సిన్‌తో కంబోడియా ప్రధాని హున్‌సేన్ సుదీర్ఘమైత్రిని కొనసాగించారు. వీరిద్దరినీ కూడా రెండుదేశాలప్రజలు 'గాడ్ బ్రదర్స్' అని చెప్పుకుంటారు. ఒకదశలో థక్సిన్‌ను కంబోడియా ప్రభుత్వ సలహాదారుగా కూడా నియమించారు. అయితే థక్సిన్ కొద్దిరోజులకే ఆ పదవికి రాజీనామాచేసారు. ఇక ప్రస్తుత సంక్షోభం నుంచి బయటపడేందుకు కాంబోడియా రాయబారికి థాయ్ విదేశాంగశాఖ నిరసన తెలుపుతూ లేఖను పంపించింది. మీ దేశ చర్యలు ఆమోదయోగ్యంకాదని, దౌత్య మర్యాదలు ఉల్లంఘించారని, మీపై పొరుగుదేశానికి ఉన్న విశ్వాసాన్ని వమ్ముచేయడమేనని చెపుతూ ఇరు దేశాల మైత్రీశైలిని దెబ్బతీస్తుందని హెచ్చరించింది. ప్రతిపక్షాల పార్లమెంటు రద్దుడిమాండ్ సానుకూలం కాకపోతే షినవత్రపై అభిశంసన తీర్మానం కూడా ప్రవేశపెడతామని హెచ్చరించాయి. కొన్ని పార్టీలు, ప్రజాసంఘాలయితే దర్యాప్తు సంస్థలకు ఫిర్యాదులు కూడాచేసారు. ఏది ఎలా ఉన్నా తన కుటుంబంలోని పెద్దల సహకారంతో మళ్లీ ఆమె ఈ గండం నుంచి బయటపడతారా అన్నది సందేహమే. ఎందుకంటే ఎప్పటినుంచో తిరుగుబాటుకోసం సైన్యం కాచుకుని ఉన్న తరుణంలో ఈ యువప్రధాని ఎలాసవాళ్లను అధిగమిస్తారనేది ప్రజలకు అంతుబట్టకుండాఉంది. ●

# అక్రమ లైంగిక సంబంధాలే అమానవీయ హత్యలకు కారణమా?



డాక్టర్ నీలం సంపత్

డబుల్ ఇంజన్ సర్కార్ కొలువు తీరిన మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రాజా రఘు వంశీ ఎగువ మధ్య తరగతి వ్యాపార కుటుంబానికి చెందిన ఓ అందమైన యువకుడు. ఓ నెల రోజుల క్రితమే తోటి వ్యాపార కుటుంబానికే చెందిన అందమైన యువతి సోనమ్‌తో పెద్దలు కుదిర్చిన వివాహం. జంటను ఏకంచేస్తూ అంగరంగ వైభవంగా పూర్తయిన వివాహ వేడుక తదనంతరం ఆధునిక నాగరికతలో భాగంగా నూతన వధూవరుల హనీమూన్ ట్రిప్ ఖరారు. టూరిస్ట్ ప్రదేశాలకు నెలవైన మేఘాలయలో నూతన దాంపత్య జీవితాన్ని ప్రారంభించాలని హనీమూన్‌కు వెళ్లడం జరిగింది. ఐతే తామొకటి తలిస్తే దైవమొకటి తలచినట్లు రాజా రఘువంశీ ప్రమాదవశాత్తూ లోయలో పడి మరణించినాడనే వార్త ఆయనకు తోడుగా వున్న నవ వధువైన సోనమ్ గుండెలవిసేలా చేసిన రోదన ద్వారా రెండు కుటుంబాల సభ్యులకు చేరడం వారిని దుఃఖ సాగరంలో ముంచివేయడం గమనార్హం. ఆ ఘోర దుర్ఘటనపై పోలీసులు చేసిన పరిశోధనలో రాజా రఘు వంశీది ప్రమాద వశాత్తూ జరిగిన మరణం కాదు. తన చీకటి స్నేహితుడైన రాజ్ కుష్వాహ తోడ్పాటుతో హైర్ డ్ కిల్లర్స్ చేత నవ వధువైన సోనమ్ చేయించిన అత్యంత కిరాతకమైన హత్య అని పోలీసులు చేసిన అభియోగం. ఆ కుటుంబ సభ్యులతో పాటు దేశ ప్రజలను నిశ్చేష్టులను చేసింది. సోనమ్‌తో పాటు, ఆమె బాయ్ ఫ్రెండ్ నీ, హత్యలో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్న నిందితులను ఆయుధాలతోసహా పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్న నేపథ్యంలో హనీమూన్‌లో భాగంగా ఆ నవ దంపతులు చేస్తున్న పర్యటనలో అస్సాం లోని గౌహతిలో మొదటిసారి, మేఘాలయలో మరోసారి హత్యకు ప్రయత్నించి విఫలమై చివరకు మూడోసారి రఘు వంశీని హత్య చేయించి దానిని ప్రమాదంగా చిత్రీకరించిందని పోలీసుల కథనం. అదే నిజమైతే హనీమూన్ పర్యటనలో తన భర్తయైన రఘు వంశీని ఎలాంటి అనుమానం రాకుండ ఎలా నమ్మించగలిగిందనేది మిలియన్ డాలర్ల ప్రశ్నేగదా? క్రైమ్ థిల్లర్‌ని మరిపించే ఈ అమానవీయ హత్యారోపణలో ఆమె నటనకు ఆస్కార్ అవార్డు కూడా దిగదుడుపేనని చెప్పక తప్పదు. ఈ తరహా నేర ఉదంతాలలో ఇది మొదటిదీ కాదు, చివరిదీ కాకపోవచ్చు! ఆధునిక సమాజంలో గత ఆరేడు సంవత్సరాల కాలం నుండి ఈ తరహా ఘోర నేరాలు పెచ్చుమీరుతున్న వైనంతో ప్రపంచంలోనే అత్యంత పవిత్రమైనదీ, పటిష్టమైనదిగా భావించే భారతీయ వివాహ వ్యవస్థ కఠిన పరీక్షను ఎదుర్కొంటున్నదనే కఠోర సత్యాన్ని జీర్ణించుకోక తప్పదు. స్త్రీ, పురుషుల మధ్యఅనైతిక, వివాహేతర సంబంధాల నేపథ్యంలో జీవిత భాగస్వాముల లోనే ఒకరు మరొకరిని అత్యంత కిరాతకంగా హత్య చేయిస్తున్నారనే ఆరోపణలతో పెళ్లంటేనే యువత గజగజలాడే పరిస్థితి వస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. ఇష్టం లేకపోతే లేదా వైవాహిక బంధాన్ని కొనసాగించడం కష్టమైతే విడాకులు తీసుకోవచ్చు. అంతేకాని హత్య చేయడమేమిటి? ఐతే ఇలాంటి హేయమైన హత్యలకు కారణాలను శోధించినప్పుడు కేవలం తమ తీవ్రమైన లైంగిక వాంఛలను తృప్తి పరచుకోవడానికే నేరస్తులు ఈ తరహా నేరాలకు పాల్పడుతున్నారు అనుకోవడం సబబు కాదేమోననిపిస్తుంది. ఎందుకంటే కొన్ని సందర్భాల్లో ఆర్థిక ప్రయోజనాల కోసం, ఆస్తి కోసం, ప్రభుత్వ ఉద్యోగాల ఆశతో పాటు వేధింపుల నుండి విముక్తి కోసం కూడా ఈ తరహా హత్యల పరంపర కొనసాగుతోంది. మొన్నటికి మొన్న ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో సౌరవ్ రాజ్‌పుత్ అనే నేవీ అధికారిని ఆయన భార్య ముస్కాన్ ఆమె ప్రియుడు సాహిల్‌తో కలిసి అత్యంత కిరాతకంగా హత్యచేసి ఆయన డెడ్ బాడీని ముక్కలు ముక్కలుగా నరికి డ్రమ్ములో పెట్టి సీల్ చేసిందనే పోలీసుల అభియోగం, మరో హేయమైన ఘటనలో హైదరాబాద్‌కి చెందిన వ్యాపారి రమేశ్‌ను అతని భార్య నీహారిక తన భర్త ద్వారా పరిచయమైన వ్యక్తితో వివాహేతర సంబంధానికి



అలవాటై భర్తని కడతేరిస్తే వచ్చే ఆస్తితో ప్రియుడితో ఆనందంగా జీవించవచ్చు అనే భావనతో ప్రియుడితో కలిసి భర్తను కారులో భువనగిరి తీసుకెళ్ళి అక్కడే హత్యచేసి శవాన్ని ఊటీకి తీసుకెళ్ళి అక్కడ కాఫీతోటలో దహనం చేసిందనే అభియోగంతో పోలీసుల దర్యాప్తు. మరో ఘటనలో వరంగల్ జిల్లా భట్‌పల్లికి చెందిన సుమంత్ రెడ్డి తన భార్య ఫ్లోరా ఫిట్‌గా వుండాలనే భావనతో శారీరక వ్యాయామం కోసం జిమ్‌లో చేర్పిస్తే ఫిట్‌నెస్ ట్రైనర్ శామ్యూల్‌తో వివాహేతర సంబంధాన్ని నెరపుతూ ఆయన తోడ్పాటుతో భర్తని హత్య చేయించిందనే ప్రాసిక్యూషన్ ఆరోపణ, విభ్రాంతిని కలిగించింది. మరో ఘటనలో రజిత అనే ముగ్గురు బిడ్డల తల్లి పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో కలిసిన తన పాత ప్రేమికుడు శివకుమార్‌తో పెంచుకున్న అక్రమ సంబంధంతో వారి ప్రేమకు అడ్డుతగులుతారనే భయంతో భర్త, ముగ్గురు పిల్లలపై విషప్రయోగం చేసింది. అందులో అమాయకులైన ముగ్గురు పిల్లలు చనిపోగా భర్త తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడ్డారంటూ పోలీసుశాఖ కేసు నమోదు. కామారెడ్డి మాచా రెడ్డిలో రేణుక అనే వివాహిత పూజారి మహేష్‌తో అక్రమ లైంగిక సంబంధాన్ని శాశ్వతం చేసుకోవడంతోపాటు తన భర్త మున్సిపల్ ఉద్యోగాన్ని డిపెండెంట్‌గా కారుణ్య నియామకంలో పొందవచ్చనే దుర్మార్గపు ఆలోచనతో పదిహేను లక్షల రూపాయలసుపారీ ఇచ్చి తన భర్తను హత్య చేయించిందనే అభియోగాలతో కొనసాగుతున్న పోలీసుల దర్యాప్తు. తనతో అక్రమ సంబంధాన్ని కొనసాగిస్తున్న ఓ పూజారిని వివాహిత తనను పెళ్ళి చేసుకోమని కోరినందుకు ఆయన ఆమెను హత్య చేసి పొక్లెయిన్ సహాయంతో పాతిపెట్టిందనే అభియోగాలతో పోలీసులు నమోదు చేసిన కేసులు సభ్య సమాజాన్ని దిగ్భ్రాంతికి గురి చేసేవే. ఇలా ఒకటా రెండా రాష్ట్రంలో దేశంలో ఎక్కడచూసినా వివాహేతర లైంగిక సంబంధాలే క్రూరమైన హత్యలకు ఊపిరులూదుతున్నాయనే ప్రాసిక్యూషన్ కథనాలు సభ్య సమాజానికి గుండెలవిసేలా చేస్తున్నాయని చెప్పకతప్పదు. వందల,వేల సంవత్సరాలుగా ప్రపంచ వివాహ వ్యవస్థకే తలమానికంగా కొనసాగుతున్న భారతీయ వివాహ వ్యవస్థ దాంపత్య జీవనానికి పరిపూర్ణతను ప్రసాదిస్తూ భార్యాభర్తల మధ్య శాశ్వత శారీరక సంబంధంతోపాటు ఓ అనిర్వచనీయమైన మానసిక భావోద్వేగబంధాన్నిసృష్టిస్తూ ఒకరు మరొకరి ప్రాణాలను తీయడం కాదు. ఒకరుమరొకరి కోసం తమ ప్రాణాలను త్యాగంచేసేలా ప్రోత్సహిస్తూభారత దేశంలో వివాహానికి ఎక్స్‌పైరీ డేట్ లేదనే సత్యాన్నిఋజువు చేస్తూ మరణం తర్వాత కూడా వారి బంధాన్ని సజీవంగా కొనసాగిస్తున్న వైనం ఇక మరిచి పోవాల్సిన గతంగా మారనుందేమోననే భావన సర్వత్ర వెల్లువెత్తుతోంది. ఇంటర్ నెట్‌లో నియంత్రించలేక పోతున్న అశ్లీల వీడియోలు, వెబ్‌సిరీస్, నెట్ ఫ్లిక్స్, ఓ.టి.టి వేదికల ద్వారా ప్రసారమోతున్న క్రైమ్ సీరియల్స్, అశ్లీలతను పెంచిపోషిస్తున్న కొన్ని రియాలిటీ షోలు, పబ్‌లూ, బార్లలో మద్యాన్ని దాటి మత్తు పదార్థాల పంపిణీ తోడ్పాటుతో పెట్రేగిపోతున్న అశ్లీల నృత్యాలు, విశృంఖల జీవన శైలి మనుషులలో జంతు ప్రవృత్తిని పెంచి పోషిస్తున్న వైనం ఆందోళన కలిగిస్తోంది. మరోవైపు సమాజంలో పెచ్చుమీరుతున్న పాశ్చాత్య నాగరికత ఉధృతి పవిత్రమైన భారతీయ వివాహ వ్యవస్థకు ప్రత్యామ్నాయంగా పోటీపడుతున్న కట్టుబాట్లకందని సహజీవన సంస్కృతితో పాటు హోమో కల్చర్‌వైపు కొంత మంది మొగ్గుచూపుతుండడం, వాటితో పాటు వివాహేతర సంబంధాలు సైతం అనైతికమైనవే తప్ప చట్టం దృష్టిలో శిక్షార్హమైన నేరాలు కావంటున్న ఉన్నత న్యాయస్థానాల వైఖరిలాంటి విపరీత ధోరణులు మనుషులలో భయాన్ని తగ్గించి వారిలో పశు ప్రవృత్తిని ప్రేరేపిస్తున్నాయేమోనని మనోవిజ్ఞానవేత్తల నిశ్చితాభిప్రాయం. ఈ సంక్లిష్టమైన సామాజిక సమస్యపై సామాజికవేత్తలు లోతైన అధ్యయనంతో సరైన పరిష్కారాన్ని చూపెట్టాల్సిన అవసరమెంతైనా వుంది. సమాజ గతిని మారుస్తూ ఓ ఆదర్శ సమాజ సృష్టికి చుక్కానిగా వ్యవహరించే పత్రికలూ ప్రసార సాధనాలు సైతం కుటుంబవ్యవస్థకు వెన్నెముకలాంటి భార్యాభర్తల బంధంపాలిట క్యాన్సర్‌గా పరిణమిస్తున్న వివాహేతర లైంగికసంబంధాల హత్యలపై నిపుణులతో విశ్లేషణాత్మక వ్యాసాలతో, టి.విల్లో చర్చాగోష్టులను నిర్వహిస్తూ ఈతరహా అనాగరిక, అమానవీయ హత్యాకాండను నివారించాల్సిన బాధ్యతను నిర్వర్తించేవిధంగా ప్రభుత్వాలను ప్రోత్సహిస్తూ, పౌరసమాజంలో స్ఫూర్తినిరగిలించాలి. ●

# ట్రంప్‌కు నోబెల్! నామినేట్ చేసిన పాక్

**వాషింగ్టన్, జూన్ 21:**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌నకు నోబెల్ శాంతిపురస్కారం ప్రకటించాలంటూ దాయాది దేశం పాకిస్థాన్ నామినేట్ చేసింది. ఇటీవలే పాక్ ఆర్మీచీఫ్ మునీర్ అమెరికాలో పర్యటించడం, విశిష్ట అతిథిగా ట్రంప్ విందును స్వీకరించడం వంటి సంఘటనలు జరిగిన వెనువెంటనే పాకిస్థాన్ ప్రభుత్వం ఆయనను ఈ పురస్కారానికి నామినేట్ చేసింది. భారత్-పాకిస్థాన్ మధ్య ఇటీవల తలెత్తిన ఘర్షణల సమయంలో ట్రంప్ దౌత్య పరంగా జోక్యం చేసుకుని కీలకంగా వ్యవహ రించారని, ఆయన నాయకత్వానికి గుర్తుగా ఈ నిర్ణయం తీసుకున్నట్టు పాకిస్థాన్ ప్రభుత్వం ఎక్స్ ఖాతాలో అధికారికంగా ప్రకటించింది. ఈ నామినేషన్ ప్రకటన వెలువడటానికి కొన్ని రోజుల ముందే పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ అసిమ్ మునీర్ వైట్‌హౌస్‌లో డొనాల్డ్ ట్రంప్‌తో సమావేశమయ్యారు. అయితే, వారి మధ్య జరిగిన సంభాషణల వివరాలు అధికారికంగా వెల్లడికాలేదు. ఇటీవలే 'ఫీల్డ్ మార్షల్' హోదా పొందిన అసిమ్ మునీర్ గతంలోనే ట్రంప్‌కు నోబెల్ బహుమతి ఇవ్వాలని వాదించారు. ఇరుదేశాల మధ్య అణుయుద్ధం సంభవించకుండా ట్రంప్ నిరోధించారని ఆయన ప్రశంసించారు. ఆర్మీచీఫ్ అసిమ్ మునీర్‌కు వైట్ హౌస్ నుంచి అందిన ఆహ్వానాన్ని పాకిస్థాన్ అధికారులు ఒక పెద్ద దౌత్యవిజయంగా పరిగణిస్తున్నారు. అయితే ట్రంప్ మాత్రం నిర్వేదం వ్యక్తం చేసారు. అయినా నాలాంటి వారికి నోబెల్ బహుమతి ఎందుకిస్తారులే అంటూ తన నిర్వేదాన్ని వ్యక్తం చేస్తూ చేసిన వ్యాఖ్యలు నెట్టింట వైరల్ అయ్యాయి. భారత్-పాకిస్థాన్ ఉద్రిక్తతల సమయంలో, అలాగే కాంగో, రువాండా సంక్షోభం వంటి పలు అంతర్జాతీయ ఘర్షణల పరిష్కారంలో తాను కీలక దౌత్య ప్రయత్నాలు చేశానని, ఈ కృషికి గాను తనకు ఇప్పటికే నాలుగైదు సార్లు నోబెల్ శాంతి బహుమతి లభించి ఉండాల్సిందని ఆయన అన్నారు. రువాండా విషయంలో నాకు నోబెల్ బహుమతి ఇవ్వాలి. మీరు గమనిస్తే కాంగో, లేదా సెర్బియా, కొసావో ఇలా చాలా దేశాలగురించి చెప్పొచ్చు' అని ట్రంప్ అన్నారు. అన్నింటికన్నా ముఖ్యమైనది భారత్ పాకిస్థాన్. నాకు నాలుగైదు సార్లు ఈ బహుమతి వచ్చి ఉండాల్సిందని ఆయన పునరుద్ఘాటించారు. అంతకుముందు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌ను 2026 సంవత్సరానికి గాను నోబెల్‌శాంతి బహుమతికి పాకిస్థాన్ అధికా రికంగా నామినేట్ చేసింది. ట్రంప్ తన తాజా వ్యాఖ్యల్లో డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, రువాండా మధ్య శత్రుత్వాలను అంతం చేసే దిశగా సోమవారం ఒకశాంతి ఒప్పందాన్ని సూచించారు. అయితే, ఈ ఒప్పందం వివరాలు ఇంకా అస్పష్టంగానే ఉన్నాయి.

అయినా నాలాంటి వారికి ఎందుకిస్తారంటూ ట్రంప్ నిర్వేదం





## మేకిన్ ఇండియాతో చైనాకే లాభాలు..!

### లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ

**న్యూఢిల్లీ,జూన్ 21:** ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన మేక్ ఇన్ ఇండియా కార్యక్రమం ఆశించిన ఫలితాలు ఇవ్వలేదని, ఇది పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, లోక్ సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. ఈ పథకం ద్వారా మన దేశం కంటే చైనానే అధికంగా లాభపడుతోందని ఆయన ఆరోపించారు. తయారీ మనదైతే లాభాలుచైనాకు అందిస్తున్నామని రాహుల్ విమర్శించారు. దేశీయంగా తయారీ రంగం కుంటుపడటంతో నిరుద్యోగం కూడా భారీగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల ఢిల్లీలోని ప్రముఖ ఎలక్ట్రానిక్స్ మార్కెట్ అయిన నెహ్రూ ప్లేస్‌ను రాహుల్ గాంధీ సందర్శించారు. అక్కడ పనిచేస్తున్న ఇద్దరు టెక్నీషియన్లతో ఆయన ముచ్చటించారు. ఈ సంభాషణకు సంబంధించిన వీడియోను తన 'ఎక్స్' ఖాతాలో పంచుకున్న రాహుల్, ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాలపై తన అసంతృప్తిని వెళ్లగక్కారు. "మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంతో దేశంలో ఫ్యాక్టరీ రంగం ఊహించని విధంగా అభివృద్ధి చెందుతుందని కేంద్ర ప్రభుత్వం చెప్పింది. మరి అలాంటప్పుడు తయారీ రంగం ఎందుకు రికార్డు స్థాయిలో కనిష్ఠానికి పడిపోయింది? యువతలో నిరుద్యోగిత రేటు ఎందుకు ఇంతగా పెరిగింది? చైనా నుంచి దిగుమతులు రెట్టింపు ఎందుకయ్యాయి?" అంటూ రాహుల్ గాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీ కేవలం నినాదాలు ఇవ్వడంలోనే నిష్ణాతులని, సమస్యలకు పరిష్కారాలు చూపడంలో కాదని ఆయన ఎద్దేవా చేశారు. "2014 నుంచి చూస్తే, మన ఆర్థిక వ్యవస్థలో తయారీ రంగం వాటా 14 శాతానికి తగ్గిపోయింది. నిజం చెప్పాలంటే, మనం వస్తువులను ఇక్కడ కేవలం అసెంబ్లింగ్ చేస్తున్నాం, దిగుమతి చేసుకుంటున్నాం తప్పితే, వాటిని పూర్తిస్థాయిలో తయారుచేయడం లేదు. దీనివల్ల, ఆ వస్తువులను తయారుచేస్తున్న చైనా లాభాల పంట పండించుకుంటోందని రాహుల్ విశ్లేషించారు. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహకాలను కూడా ప్రభుత్వం క్రమంగా వెనక్కి తీసుకుంటోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుత పరిస్థితుల్లో దేశ తయారీ రంగంలో సంస్కరణలు అత్యవసరమని అభిప్రాయపడ్డారు. మనం ఇతరులకు కేవలం మార్కెట్‌గా మిగిలిపోకూడదు. మన వస్తువులను మనమే ఇక్కడ ఉత్పత్తి చేసుకోవాలి, ఇక్కడే కొనుగోళ్లు జరపాలి. ఇప్పటికే చాలా సమయం గడిచిపోయింది. ఈ విషయంపై ప్రభుత్వం తక్షణమే నిర్ణయం తీసుకోవాలని రాహుల్ గాంధీ తన పోస్టులో పేర్కొన్నారు.

## ఇరాన్-ఇజ్రాయెల్ వార్‌పై భారత్ మౌనం దేనికి?

### కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీనేత సోనియా ధ్వజం



**న్యూఢిల్లీ,జూన్ 21:** ఇజ్రాయెల్, ఇరాన్ దేశాల మధ్య నెలకొన్న తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు, యుద్ధ వాతావరణంపై భారత ప్రభుత్వం మౌన వైఖరిని అనుసరిస్తున్నదని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు సోనియా గాంధీ విమర్శించారు. ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దౌత్యపరమైన వైఫల్యంగా కనిపిస్తోందని ఆమె అన్నారు. ఇది భారత దేశం యొక్క నైతిక, వ్యూహాత్మక సంప్రదాయాలకు విరుద్ధంగా ఉందని ఆమె పేర్కొన్నారు. టెహ్రాన్‌పై టెల్ అవీవ్ చేస్తున్న దాడులను సోనియా గాంధీ తీవ్రంగా ఖండించారు. ఇవి చట్టవిరుద్ధమైన చర్యలని, సార్వభౌమాధికారంపై జరిగిన దాడిగా ఆమె అభివర్ణించారు. ఇజ్రాయెల్ చర్యల వల్ల ప్రాంతీయంగానే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. ఈ తరహా ఘర్షణలు అస్థిరతను మరింత పెంచి, కొత్త వివాదాలకు దారితీస్తాయని ఆమె హెచ్చరించారు. ఇరాన్, అమెరికా దేశాల మధ్య అణు ఒప్పందంపై చర్చలు జరుగుతున్న సమయంలో టెల్ అవీవ్, టెహ్రాన్‌లోని అణు కేంద్రాలపై దాడులు చేయడం సమర్థనీయం కాదని సోనియా గాంధీ అన్నారు. గాజాలో ఇజ్రాయెల్ సృష్టిస్తున్న మారణహోమంలో 55,000 మందికి పైగా పాలస్తీనియన్లు ప్రాణాలు కోల్పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గాజా ప్రాంతం కరవు కోరల్లో చిక్కుకుని, ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గాజాలో జరిగిన విధ్వంసం వంటి పరిస్థితులు ఇరాన్‌లో పునరావృతం కాకుండా చూడాలని, భారత ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలని ఆమె విజ్ఞప్తి చేశారు. భారతదేశానికి ఇరాన్, ఇజ్రాయెల్‌తో సుదీర్ఘకాలంగా దౌత్య సంబంధాలు ఉన్నాయని సోనియా గాంధీ గుర్తు చేశారు. ఇటీవలి న్యూఢిల్లీ, టెల్ అవీవ్ మధ్య రక్షణ, వాణిజ్యం, నిఘా రంగాల్లో సహకారం పెరిగినప్పటికీ, టెహ్రాన్‌తో భారత్‌కు చారిత్రక,నాగరిక, వ్యూహాత్మక బంధాలు కొనసాగుతున్నాయని ఆమె స్పష్టం చేశారు. పశ్చిమాసియాలో ఉద్రిక్త తలను తగ్గించడానికి, యుద్ధ వాతావరణాన్నినివారించడానికి భారత ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఆమె కోరారు. ఈ నేపథ్యంలో, ఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యా లయంలో ఇరాన్ దౌత్యవేత్త మొహమ్మద్ జావాద్ హుస్సేనీ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ఇజ్రాయెల్ దురాక్రమణను భారత్‌తో సహా ప్రపంచదేశాలు ఖండించాలని ఆయన కోరారు. ఇజ్రాయెల్ అంతర్జాతీయ చట్టాలను ఉల్లంఘిస్తూ తమ దేశంలోని కీలకప్రాంతాలను ధ్వంసం చేస్తోందని హుస్సేనీ ఆరోపించారు.

## ఇజ్రాయెల్‌కు అంత సామర్థ్యం లేదు

### యుఎస్ అధ్యక్షుడు ట్రంప్ కీలక వ్యాఖ్యలు

**వాషింగ్టన్, జూన్ 21:** ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య పరస్పర దాడులు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ టెల్‌అవీవ్‌ను ఉద్దేశిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తమ సాయం లేకుండా ఫోర్డ్‌లోని భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం ఇజ్రాయెల్‌కు లేదన్నారు. శుక్రవారం (స్థానిక కాలమానం ప్రకారం) న్యూజెర్సీలో విలేకరులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటివరకు జరిపిన దాడుల్లో గణనీయమైన ప్రయోజనాలు సాధించిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, అమెరికా సాయం లేకుండా ఇరాన్‌కు చెందిన ఫోర్డ్ భూగర్భ అణుకేంద్రాన్ని నాశనం చేసే సామర్థ్యం టెల్‌అవీవ్‌కు లేదన్నారు. ఒకవేళ వారు దాడులు చేసినా అది పెద్ద ప్రభావం చూపదన్నారు. వారికి ఆ సామర్థ్యం లేదన్నారు. ఈ సందర్భంగా తాను దౌత్యానికి కట్టుబడి ఉన్నానని చెప్పిన ఆయన సైనిక కార్యకలాపాలను ఆపేయాలని ఇజ్రాయెల్‌ను ఒప్పించడం ప్రస్తుతానికి అసంభవమన్నారు. ఎవరైనా గెలుస్తుంటే ఇలాంటి అభ్యర్థనలు చేయడం కష్టమని తాను భావిస్తున్నట్లు తెలిపారు. ఈ క్రమంలో యుద్ధంలో టెల్‌అవీవ్ అద్భుతమైన దాడులు చేస్తుండగా టెహ్రాన్‌వి పేలవంగా ఉన్నాయన్నారు. ఇదిలా ఉండగా ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య మధ్యవర్తిత్వం వహించడానికి యూరోపియన్ దేశాలు చేస్తున్న ప్రయత్నాలను ట్రంప్ తోసిపుచ్చారు. వారు సాయం చేయలేరని వ్యాఖ్యానించారు. ఇరాన్ యూరప్‌తో కాకుండా అమెరికాతో చర్చలు జరపాలనుకుంటున్నారని వెల్లడించారు.



## హెచ్‌ఐవి నియంత్రణకు అద్భుత ఔషధం..

### యెజ్టుగో లెనకాపవిర్‌కు యుఎస్‌ఎఫ్‌డిఎ ఆమోదం

**న్యూయార్కు,జూన్ 21:** హెచ్‌ఐవీ మహమ్మారిపై దశాబ్దాలుగా సాగుతున్న పోరాటంలో అద్భుత ఘట్టం ఆవిష్కృతమయింది. ఆఫ్రికా ఖండాల నుంచి దిగుమతి అయిన ఈ హెచ్‌ఐవి వైరస్‌ను కట్టడిచేయడానికి ప్రపంచదేశాలు ఇప్పటికీ సతమతం అవుతూనే ఉన్నాయి. అగ్రరాజ్యాలను సైతం గడగడలాడించిన ఈ వైరస్‌ను సమూలంగా నిర్మూలించగలిగే అద్భుత టీకాను గిలీడ్ కంపెనీ ఆవిష్కరించింది. ప్రయోగాల్లోకూడా సంతృప్తికరమైన ఫలితాలు లభించడంతో ఎఫ్‌డిఎ ఒకే చెప్పింది. హెచ్‌ఐవీని సమర్థవంతంగా నిరోధించగల సరికొత్త దీర్ఘకాలిక ఔషధం యెజ్టుగో బ్రాండ్ ఔషధం లెనకాపవిర్‌కు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ఎఫ్డీఏ ఆమోదం తెలిపింది. ఏడాదికి కేవలం రెండు ఇంజెక్షన్లు తీసుకోవడం ద్వారా హెచ్‌ఐవీ నుంచి దాదాపు పూర్తిస్థాయిలో రక్షణ పొందవచ్చని తెలడం ప్రపంచవ్యాప్తంగా ఆశలు రేకెత్తిస్తోంది. ప్రస్తుతం హెచ్‌ఐవీ నివారణకు ప్రీఎక్స్‌పోజర్ ప్రొఫైలాక్సిస్ ప్రెప్‌గా పిలిచే మందులు దశాబ్దాలుగా అందుబాటులో ఉన్నప్పటికీ, రోజూ మాత్రలు వేసుకోవాల్సి రావడం చాలా మందికి ఇబ్బందికరంగా మారింది. అయితే, క్రమశిక్షణ లోపం వల్లే వాటి ప్రభావం పరిమితంగా ఉంటోంది. ఇప్పుడు యెజ్టుగో టీకాను బ్రేక్ త్రూగా భావించవచ్చు. ఈ ఔషధంపై గిలీడ్ కంపెనీ రెండుసార్లు నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్ లోనూ మంచి ఫలితాలు వచ్చాయి. ఒకదాంట్లో వందకు 100 శాతం ఫలితాలు రాగా, రెండోదాంట్లో 99.9 శాతం ఫలితాలు కనిపించాయి. అయితే, ఇంజెక్షన్ తీసుకున్న ప్రదేశంలో నొప్పి, తలనొప్పి, వికారం వంటి కొన్ని సైడ్ ఎఫెక్ట్స్ కనిపించినట్లు నివేదికలు తెలిపాయి. అందరికీ అందుబాటులోకి వస్తుందా అన్న సందేహాలు వ్యక్తం అవుతున్నాయి. లెనకాపవిర్ టీకా అద్భుతమైన ఫలితాలు సాధించినప్పటికీ ఈ ఔషధం ధర ఎక్కువగా ఉండొచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గతంలో, ప్రతి రెండు నెలలకు ఒకసారి ఇంజెక్షన్ ద్వారా తీసుకునే 'కాబోటెగ్రావిర్' అనే మరో హెచ్‌ఐవీ నివారణ మందు వార్షిక ఖర్చు పదివేల డాలర్లలో ఉండటంతో ప్రపంచవ్యాప్తంగా పెద్దగా ప్రభావం చూపలేకపోయింది. ఇప్పుడీ లెనకాపవిర్ ప్రస్తుత ధర సంవత్సరానికి 39,000 డాలర్లుగా ఉంది. అయితే, నివారణ కోసం వాడినప్పుడు ఈ ధర తగ్గుతుందని భావిస్తున్నారు.




## 'దాయాది గొంతు ఎండాల్సిందే'

### పాక్‌కు వెళ్లాల్సిన నీళ్లను రాజస్థాన్‌కు మళ్లిస్తాం.. కేంద్ర హోంమంత్రి అమిత్ షా!



**న్యూఢిల్లీ, జూన్21:** సింధూ నదీ జలాల ఒప్పందాన్ని పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పునరుద్ఘాటించారు. ఈ ఒప్పందం నిబంధనలను పాకిస్తాన్ ఉల్లంఘించిందని ఆయన మండిపడ్డారు. ఇన్నాళ్లూ దాయాది అన్యాయంగా నీళ్లు అందుకుందని, ఇకపై నీటికొరతతో అల్లాడిపోవాల్సిందేనని దుయ్యబట్టారు. ఓ జాతీయ మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో అమిత్ షా ఈ ఒప్పందం నిలిపివేత గురించి ప్రస్తావించారు. 'అంతర్జాతీయ ఒప్పందాలను ఏకపక్షంగా రద్దుచేయలేం. కానీ, సింధూ నదీజలాల ఒప్పందాన్ని నిలిపివేసే హక్కు భారత్‌కు ఉంది. అదే చేశాం. ఈ ఒప్పందం పీఠికలో రెండు దేశాలు శాంతి, పురోగతి సాధించాలనే విషయాన్ని పొందుపరిచారు. కానీ ఒకసారి దీన్ని ఉల్లంఘిస్తే రక్షించడానికి ఇంకేమీ ఉండదు' అని కేంద్ర మంత్రి గుర్తుచేశారు. 'భారత్‌కు హక్కుగా లభించిన నీటిని సమర్థంగా వినియోగిస్తాం. కెనాల్‌ను నిర్మించి పాకిస్తాన్‌కు వెళ్లే నీటిని రాజస్థాన్‌కు మళ్లిస్తాం. ఇన్నాళ్లూ పాక్ అన్యాయంగా నీటిని అందుకుంది. ఇకపై ఆ దేశం గొంతు ఎండాల్సిందే' అని అమిత్ షా దుయ్యబట్టారు. 1960ల్లో భారత్, పాక్ మధ్య సింధూ నదీ జలాల ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అయితే, పహల్గాంలో పర్యాలకుపై ఉగ్రదాడి నేపథ్యంలో దీని అమలును భారత్ నిలిపివేసింది. ఇది దాయాదికి కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. ఈ ఒప్పందం నిలిపివేత పాకిస్తాన్‌ను ఎండబెట్టే అవకాశాలున్నాయి. ఆ దేశంలో నీటి సరఫరా అత్యధికంగా సింధూ జలాలపైనే ఆధారపడింది. అక్కడ వ్యవసాయానికి వాడే నీటిలో 80 శాతం ఈ ఒప్పందం కింద లభించేదే. పాకిస్తాన్ జీడిపిలో 25 శాతం ఈ నదుల నుంచే లభిస్తోందంటే భారత నిర్ణయం ఆ దేశాన్ని భవిష్యత్తులో ఎలా ప్రభావితం చేయనుందో అర్థం చేసుకోవచ్చు! ఈ సందర్భంగా నియోజకవర్గాల పునర్విభజన, చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు తదితర అంశాలపై అమిత్ షా స్పందించారు. 'నియోజకవర్గాల పునర్విభజనపై ఫిర్యాదు చేసేందుకు ఎవరి వద్దా ఎలాంటి కారణాలు లేవు. అన్ని అంశాలను సమతుల్యంగా పరిగణలోకి తీసుకునే దాన్ని చేపట్టబోతున్నాం. ఎవరూ అసంతృప్తికి గురికారు. 2026లో తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలు ఉన్నందునే డిఎంకెఈ అంశాన్ని వ్యతిరేకిస్తోంది'. అని హోంమంత్రి అన్నారు. ఇక, 2029లో జరిగే లోక్‌సభ ఎన్నికలు మహిళా రిజర్వేషన్లతోనే నిర్వహిస్తామని తెలిపారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లుకు పార్లమెంట్ ఆమోదం తెలిపిన సంగతి తెలిసిందే.

## చీటింగ్ కేసులో మహారాష్ట్ర ఐపిఎస్ అధికారి భర్త అరెస్ట్

**ముంబయి,జూన్ 21:** మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారిణి భర్త మరో భారీ ఆర్థిక మోసం కేసులో అరెస్ట్ అయ్యారు. ఇదివరకే ఒక చీటింగ్ కేసులో అరెస్టయిన ఆయన, తాజాగా రూ.7.42కోట్ల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు రావడంతో ముంబై ఆర్థిక నేరాల విభాగం (ఈఓడబ్ల్యూ) పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మహారాష్ట్ర కేడర్‌కు చెందిన ఐపీఎస్ అధికారిణి రష్మీ కరాండికర్ భర్త పురుషోత్తం చవాన్‌పై పలు ఆర్థిక నేరాలకు సంబంధించిన ఆరోపణలు ఉన్నాయి. గుజరాత్‌లోని సూరత్‌కు చెందిన ఒక వ్యాపారితో పాటు మరి కొందరిని ఆయన రూ.7.42 కోట్ల మేర మోసగించినట్లు పోలీసులు గుర్తించారు. ప్రభుత్వ కోటా కింద తక్కువ ధరలకే ప్లాట్లు ఇప్పిస్తానని నమ్మబలికి వారి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేసినట్టు తెలుస్తోంది. అంతేకాకుండా, మహారాష్ట్ర పోలీస్ అకాడమీకి టీషర్టులు సరఫరా చేసే కాంట్రాక్టును సదరు వ్యాపారవేత్తకు ఇప్పించేందుకు తాను సహాయం చేస్తానని కూడా చవాన్ హామీ ఇచ్చారని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంపై అందిన ఫిర్యాదు మేరకు అధికారులు లోతుగా దర్యాప్తు చేపట్టారు. ప్రస్తుతం జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న చవాన్‌ను, తాజా రూ.7.42 కోట్లమోసం కేసుకు సంబంధించి విచారణ నిమిత్తంపోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.

## ఎయిరిండియాలోనే ప్రయాణం చేస్తా..

### కేంద్ర విమానయాన మాజీ మంత్రి ప్రఫుల్‌పటేల్



**ముంబయి,జూన్ 21:** అహ్మదాబాద్‌లో ఇటీవల ఎయిర్ ఇండియా విమానం కూలిన ఘటనపై విమానయానశాఖ మాజీ మంత్రి ఎన్సీపీ ఎంపీ ప్రఫుల్ పటేల్ తాను ఆ ఎయిర్‌వేస్‌లో ప్రయాణించేందుకు సిద్ధమేనని ప్రకటించారు. ఎయిర్ ఇండియా బోయింగ్ 787 డ్రీమ్‌లైనర్ విమానంలో ప్రయాణించేందుకు తాను సిద్ధమని, ఇప్పుడంటే ఇప్పుడు ప్రయాణిస్తానని పేర్కొన్నారు. ఎయిర్ ఇండియాకు పటిష్టమైన సాంకేతిక పునాది ఉందని, దేశ విమానయాన నియంత్రణవ్యవస్థబలంగా ఉందని పేర్కొన్నారు. విమానయాన సంస్థలు, విమాన యాన నియంత్రణ సంస్థ (డీజీసీఏ) నుంచి మెరుగైన సమాచార మార్పిడి అవసరమని, ఖాళీగా ఉన్న అన్ని ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని ప్రఫుల్ పటేల్ సూచించారు. విమాన ప్రయాణం విషయంలోనూ ఆయన మరికొన్ని వ్యాఖ్యలు చేశారు. విమాన ప్రయాణం అనేది 99.9 శాతం సురక్షితం అనేదేమీ ఉండదని, అయితే 100 శాతం సురక్షితం లేదంటే సున్నా మాత్రమేనని స్పష్టం చేశారు. అహ్మదాబాద్ ప్రమాద స్థలాన్ని అమెరికాకు చెందిన నేషనల్ ట్రాన్స్‌పోర్టేషన్ సేఫ్టీ బోర్డ్ (ఎన్టీఎస్‌బీ) బృందం, విమాన తయారీ సంస్థ బోయింగ్, ఇంజిన్ల తయారీ సంస్థ జీఈ ప్రతినిధులు, అలాగే భారతీయ విమాన ప్రమాద దర్యాప్తు బ్యూరో (ఏఏఐబీ) అధికారులు తక్షణమే సందర్శించారని, కాబట్టి దర్యాప్తు వేగం సంతృప్తికరంగా ఉందని పటేల్ తెలిపారు. 2004 నుంచి 2011 వరకు పౌర విమానయాన శాఖ మంత్రిగా పనిచేసిన తన అనుభవం ప్రకారం ఈ దర్యాప్తు మూడు నెలల్లో పూర్తికావచ్చని,అయితే అన్ని కోణాల్లోనూ పరిశీలించాల్సి ఉన్నందున మరింత సమయం పట్టే అవకాశం కూడా ఉందని అభిప్రాయపడ్డారు.

## ఇరాన్‌లో భూకంపం.. అణు పరీక్షలే కారణమా?


### తోసిపుచ్చిన భూకంప శాస్త్రవేత్తలు



**టెహ్రాన్, జూన్ 21:** ఇజ్రాయెల్ దాడులతో తీవ్ర ఒత్తిడి ఎదుర్కొంటున్న ఇరాన్‌లో భూకంపం సంభవించింది. సెమ్నాన్ ప్రాంతంలో 5.2 తీవ్రతతో ఇది చోటుచేసుకోగా 10 కి.మీ. లోతులో భూకంప కేంద్రం ఉన్నట్లు గుర్తించారు. అయితే, టెల్‌అవీవ్‌తో ఉద్రిక్తతల వేళ టెహ్రాన్ రహస్యంగా అణు పరీక్షలు నిర్వహించి ఉండవచ్చని, భూకంపానికి ఇది కారణం కావచ్చే అనుమానాలు మొదలయ్యాయి. అంతరిక్ష, క్షిపణి కాంప్లెక్స్ ఉన్న నగరానికి సమీపంలోనే భూకంపం సంభవించడం ఈ ఊహాగానాలకు మరింత ఊతమిచ్చింది. ఇరాన్‌లోని సెమ్నాన్ ప్రావిన్సులోనే అంతరిక్ష కేంద్రం, మిస్సైల్ కాంప్లెక్స్‌లు ఉన్నాయి. అక్కడి రక్షణ శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్నాయి. వీటికి సమీపంలోనే తాజాగా భూకంపం చోటుచేసుకుంది. బలమైన ప్రకంపనలు ఉత్తర ఇరాన్‌లో అనేక ప్రాంతాలను తాకినట్లు సమాచారం. అయితే, దీని కారణంగా ఎటువంటి ప్రాణనష్టం జరగలేదని, నష్టతీవ్రత తక్కువగానే ఉందని ఇరాన్ న్యూస్ ఏజెన్సీ ఎఆర్ఎన్ఎ వెల్లడించింది. ప్రపంచంలో భూకంప ముప్పు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఇరాన్ కూడా ఒకటి. అరేబియన్, యురేషియన్ టెక్టోనిక్ ప్లేట్లు కలిసే ఆల్పైన్-హిమాలయన్ సెస్మిక్ బెల్టు వెంబడి ఉండటమే ఇందుకు కారణం. యేడాదికి దాదాపు 2 వేలకుపైగా భూకంపాలు నమోదవుతుంటాయి. వీటిలో 5 కంటే ఎక్కువ తీవ్రతతో వచ్చేవి 15 నుంచి 16వరకు ఉంటాయని గణాంకాలు చెబుతున్నాయి. మొత్తంగా 2006-2015 మధ్యకాలంగా ఇక్కడ 96వేల సంభవించినట్లు అంచనా. అణ్వాయుధ కార్యక్రమాలు చేపట్టే సమయంలో భూగర్భ పేలుళ్లు తీవ్ర ప్రకంపనలకు కారణమవుతుంటాయి. పేలుడు సంభవించే ప్రాంతంలో టెక్టోనిక్ ప్లేట్లపై ఒత్తిడి పెరగడం ఇందుకు కారణంగా నిపుణులు చెబుతుంటారు. అయితే, పేలుడు వల్ల ఇవి సంభవించాయా? లేక సాధారణ ప్రకంపనలా అనే విషయాన్ని తరంగాలను అధ్యయనం చేయడం ద్వారా స్పష్టంగా తెలుసుకోవచ్చు. తాజాగా వచ్చిన అణు పరీక్షల వాదనను భూకంప శాస్త్రవేత్తలు తోసిపుచ్చారు. పది కిలోమీటర్ల లోతులో అణుపరీక్షలు నిర్వహించరని, భౌగోళికంగా అది అసాధ్యమని కొందరు నిపుణులు చెప్పినట్లు ఇరాన్ మీడియా కథనాలు పేర్కొన్నాయి.

## రష్యా సైనికుడి అడుగు పడితే.. ఆ ప్రాంతం మాదే!

### ఉక్రెయిన్‌కు పుతిన్ హెచ్చరిక



**మాస్కో, జూన్ 21:** రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య ఉద్రిక్తతలు కొనసాగుతూనే ఉన్నాయి. తాజాగా మాస్కో బలగాలు సుమీ ప్రాంతంలోని బఫర్ జోన్‌లోకి చొచ్చుకుపోతున్నాయి. ఈ పరిణామాల వేళ రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. తన దృష్టిలో ఉక్రెయిన్ అంతా తమదేనని అన్నారు. ఈ సందర్భంగా కీవ్‌కు గట్టి హెచ్చరికలు చేశారు. 'సరిహద్దు వెంబడి సెక్యూరిటీ జోన్‌ను ఏర్పాటు చేయాలనుకుంటున్నాం. సరిహద్దుల వెంట నిరంతరం షెల్లింగ్‌కు పాల్పడుతూ వారు (ఉక్రెయిన్) మాకు మరింత ముప్పు సృష్టిస్తున్నారు. సుమీ ప్రాంతంలో 10 కి.మీ. లోపలికి రష్యా బలగాలు వెళ్లాయి. ఈ ప్రాంతాన్ని అధీనంలోకి తీసుకోవడం మా లక్ష్యం కాదు. అయితే, పరిస్థితి తీవ్రంగా మారితే.. దాన్ని స్వాధీనం చేసుకొనే అవకాశం లేకపోలేదు' అని పుతిన్ అన్నారు. సుదీర్ఘకాలంగా రష్యన్లు, ఉక్రెయిన్లు ఒకటే. దీన్నిబట్టి చూస్తే ఉక్రెయిన్ మొత్తం మాదే. అయినప్పటికీ కీవ్ సార్వభౌమత్వాన్ని గుర్తించేందుకు మేం సిద్ధంగా ఉన్నాం. ఉక్రెయిన్ లొంగిపోవాలని మేం కోరుకోవట్లేదు. కానీ, క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను వారు అంగీకరించాలి. మాస్కో భౌగోళిక ప్రయోజనాలను గుర్తుంచుకోవాలి. నాటోలో చేరాలన్న ఆశను ఆ దేశం వదులుకోవాలి. ఈ సైనిక చర్య మీ పరిస్థితిని మరింత దిగజారుస్తుంది. అది మరింత తీవ్రంగా మారకముందే చర్చలకు రావాలి. మాతో ఒప్పందం చేసుకోవాలి. రష్యా సైనికుడు ఎక్కడ అడుగుపెడితే.. ఆ ప్రాంతం మాదే అవుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి' అని పుతిన్ హెచ్చరించారు.

## 'జెడియు టికెట్లూ అమిత్‌షానే ఇస్తారు!': ఆర్జేడి నేత తేజస్వి యాదవ్



**పాట్నా, జూన్ 21:** బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సమయం సమీపిస్తున్న వేళ అధికార, ప్రతిపక్షాలు ప్రచార వ్యూహాల్లో బిజీగా ఉన్నాయి. ఈ క్రమంలోనే ఆర్జేడినేత, మాజీ డిప్యూటీ సిఎం తేజస్వీ యాదవ్ ప్రధాని నరేంద్రమోడీ ప్రచారాన్ని ఉద్దేశిస్తూ తీవ్ర ఆరోపణలు చేశారు. ప్రధాని ఇప్పటివరకు బీహార్‌లో తన ప్రచారాల కోసం రూ.20 వేల కోట్లు ఖర్చు చేశారని ఆరోపించారు. 'సిఎం నితీశ్‌కుమార్ పరిస్థితి బిజెపికి వరంగా మారింది.

రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జెడియు టికెట్లు కూడా కేంద్రమంత్రి అమిత్‌షానే కేటాయిస్తారు? అని వ్యాఖ్యానించారు. కాగా, ఈ యేడాది చివరలో రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి.

## 73 యేళ్ల వయసులో గవర్నర్ రవి 51 పుషప్స్

### యోగాడే రోజున ఆశ్చర్యపరిచిన తమిళనాడు గవర్నర్



**చెన్నై,జూన్ 21:**అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శారీరక దృఢత్వానికి వయసు ఏమాత్రం అడ్డంకి కాదని తమిళనాడు గవర్నర్ రవీంద్ర నారాయణ రవి నిరూపించారు. 73 ఏళ్ల వయసులో ఆయన ఏకబిగిన 51 పుషప్స్ తీసి అందరినీ సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. గవర్నర్ కసరత్తుల తాలూకు వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. పదకొండవ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని తమిళనాడు ప్రభుత్వం మధురైలోని వెలమ్మాల్ విద్యా సంస్థలో ప్రత్యేక యోగా కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ ఆర్ఎన్ రవి, తన ఫిట్‌నెస్‌తో అక్కడున్న వారిని మంత్రముగ్ధులను చేశారు. ఏమాత్రం అలసట లేకుండా వరుసగా 51 పుషప్స్ పూర్తి చేశారు. ఆయన ఉత్సాహంగా పుషప్స్ చేస్తుండగా, అక్కడున్నవారంతా చప్పట్లతో అభినందించారు. మాజీ ఐపీఎస్ అధికారి అయిన రవి, తన శిక్షణ కాలం నాటి క్రమశిక్షణను గుర్తుచేస్తూ ప్రతి యోగాసనాన్ని ఎంతో కచ్చితత్వంతో వేసి చూపించారు. రాష్ట్ర ప్రథమ పౌరుడిగా ఉండటమే కాకుండా, ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పించడంలోనూ తాను ముందుంటానని ఆయన తన చర్యల ద్వారా స్పష్టం చేశారు. ఈ వీడియో చూసిన నెటిజన్లు గవర్నర్ ఫిట్‌నెస్‌కు ఫిదా అవుతున్నారు. వామ్మో, 73 ఏళ్ల వయసులో ఇంత ఫిట్‌గా ఉన్నారేంటి అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. మరికొందరు మీది మామూలు బాడీ కాదు సార్ అంటూ ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. వయసు కేవలం ఒక అంకె మాత్రమేనని గవర్నర్ నిరూపించారని పలువురు కామెంట్స్ చేస్తున్నారు. కాగా, బీహార్‌కు చెందిన రవి ఫిజిక్స్‌లో మాస్టర్స్ చదివారు. అనంతరం సివిల్స్‌కు సన్నద్ధమైన ఆయన 1976లో కేరళ కేడర్‌కు ఐపీఎస్‌గా ఎంపికయ్యారు. 2021లో రవీంద్ర తమిళనాడు గవర్నర్‌గా నియమితులయ్యారు.

# పదేళ్లుగా భ్రష్టుపట్టిన రెవెన్యూ వ్యవస్థ ప్రక్షాళన

## రాష్ట్రంలో ముగిసిన రెవెన్యూ సదస్సులు

**మూడు విడతల్లో 10వేలు నిర్వహణ..**

**8.58 లక్షల దరఖాస్తులు స్వీకరణ**

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 21:** దశాబ్దకాలం పాటు బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన రెవెన్యూ వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్వరాష్ట్రంలో ఏళ్ల తరబడి తెలంగాణ ప్రజానీకం ఎదుర్కొన్న భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలన్న ఆశయంతో తీసుకువచ్చిన భూభారతి చట్టాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. రెవెన్యూ వ్యవస్థలో భూ భారతికి ముందు భూ భారతి తర్వాత స్పష్టమైన మార్పు కనిపిస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రెవెన్యూ సదస్సులు ముగిసిన నేపథ్యంలో మంత్రి శనివారం అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆనాటి ప్రభుత్వం ఎంతో గొప్పగా 2020లో తీసుకువచ్చిన ఆర్వోఆర్ చట్టాన్ని తిరగరాసి పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తూ రైతులు కష్టాలు తీర్చడమే ధ్యేయంగా భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామన్నారు. పదేళ్లలో రైతులు పడ్డ కష్టాలు బాధలు వారు ఏవిధమైన సమస్యలను ఎదుర్కొన్నారో చెప్పడానికి ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులే ఇందుకు ప్రత్యక్ష నిదర్శనమన్నారు. మూడు దశల్లో దాదాపు 10లక్షలకు పైగా భూ సమస్యలకు సంబంధించిన దరఖాస్తులు వచ్చాయన్నారు. ఏప్రిల్ 14వ తేదీన భూభారతి చట్టాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఆవిష్కరించుకున్నామని, ఆరోజు నుంచే రెవెన్యూ వ్యవస్థలో నూతన శకం ప్రారంభమైందన్నారు.

ఈ చట్టాన్ని దశల వారీగా అమలులోకి తీసుకొచ్చామని, మొదటి దశలో ఏప్రిల్ 17 నుంచి 30వ తేదీ వరకు 4మండలాల్లో నిర్వహించిన 72 రెవెన్యూ సదస్సుల్లో 12వేల దరఖాస్తులు, తర్వాత రెండవ దశలో మే 5వ తేదీ నుంచి 28 మండలాల్లో నిర్వహించిన 414 సదస్సుల్లో 46వేల దరఖాస్తులు రాగా సాదాబైనామాల అంశం మినహా సుమారు 60 శాతంపైగా సమస్యలకు పరిష్కారం చూపించామన్నారు.

ఈనెల 3వ తేదీ నుంచి 20వ తేదీ వరకు 561 మండలాల్లో 10,239 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను నిర్వహించామని ఈ సదస్సుల్లో భూ సమస్యలకు సంబంధించి 8 లక్షల దరఖాస్తులు వచ్చాయని మొత్తంగా మూడు విడతల్లో 593 మండలాల్లో 10,725 రెవెన్యూ సదస్సులు నిర్వహించామని, ఇందులో 8.58 లక్షల దరఖాస్తులు వచ్చాయని వివరించారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 67వేలు, భద్రాద్రి కొత్తగూడెం 61వేలు, వరంగల్ 54 వేలు, జయశంకర్ భూపాలపల్లి 48వేలు, నల్గొండ 42 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. రెవెన్యూ సదస్సులకు ముందురోజే ఆయా గ్రామాల్లో రైతులకు ఉచితంగా దరఖాస్తులను ఇచ్చామని, ఎమ్మార్వో ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. రెవెన్యూ అధికారులే ప్రజల వద్దకు వచ్చి ఎలాంటి రుసుము లేకుండా దరఖాస్తులను స్వీకరించారని, స్వీకరించిన వాటికి రశీదులను అందజేశామని పేర్కొన్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ఇప్పటివరకు 3.27 లక్షల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని, మిగిలిన వాటిని కూడా త్వరితగతిన నమోదు చేయాలని అధికారులకు సూచించారు.

## బూర్గంపాడులో గిరిజన మహిళపై దాడిని ఖండించిన కెటిఆర్

**ఇది ముఖ్యమంత్రి పాలన తీరుకు నిదర్శనమని విమర్శ**

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 21:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిధిలోని బూర్గంపాడు మండలంలో గిరిజన మహిళపై జరిగిన దాడి అత్యంత అమానుషమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ఈ దురదృష్టకర సంఘటన రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనా విధానానికి, పరిపాలన తీరుకు అద్దం పడుతోందని ఆయన విమర్శించారు. ఇటువంటి వ్యక్తి ముఖ్యమంత్రిగా కొనసాగితే రాష్ట్రంలో రాజ్యాంగం, చట్టబద్ధమైన పాలన ఎలా అమలవుతుంది? అని సూటిగా ప్రశ్నించారు. రాష్ట్రంలో మహిళల భద్రత, గిరిజనుల హక్కుల పరిరక్షణ ప్రశ్నార్థకంగా మారిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే సమయంలో కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం పైనా కేటీఆర్ విమర్శలు సంధించారు. "రాహుల్ గాంధీ దేశ ప్రజలకు ఇస్తున్న హామీ ఇదేనా? ప్రియాంక గాంధీ దేశంలోని మహిళలకు ఇలాంటి గౌరవాన్నే కోరుకుంటున్నారా? కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే ప్రస్తావించే సమానత్వం అంటే ఇదేనా?" అంటూ ఆయన వరుస ప్రశ్నలు వేశారు. బూర్గంపాడు ఘటన కాంగ్రెస్ పార్టీ నిజస్వరూపాన్ని బయటపెట్టిందని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి బాధితురాలికి న్యాయం చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## కౌశిక్‌రెడ్డిది బ్లాక్‌మెయిల్ చరిత్ర

**బెదరింపు వసూళ్లలో కౌశిక్‌ను అరెస్టుచేస్తే కెటిఆర్, హరీశ్ ఖండించడమేంటి?**

**ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్**

**హైదరాబాద్,జూన్ 21,ప్రభాతవార్త:** కౌశిక్ రెడ్డి ది బ్లాక్ మెయిల్ చరిత్ర, ఉద్యోగాలు ఇప్పిస్తానని, వ్యాపారాలు చేసుకొనేటోవద్ద బెదిరించి పైసలు వసూలు చేయడం ఆయన నైజం అంటూ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ అన్నారు. శనివారం గాంధీ భవన్‌లో ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ మాట్లాడుతూ హుజురాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి అరెస్టను కెటిఆర్ హరీష్ రావ్ ఖండిస్తున్నందుకు సిగ్గుండాలని విమర్శించారు. పైసల దందాలో




కౌశిక్ రెడ్డి అరెస్ట్ అయ్యారని అలాంటి ఒక్క దొంగ కి కెటిఆర్,హరీష్‌రావులు సపోర్ట్ చేస్తున్నారని ఆపాదించారు.ప్రజా సమస్యల పై కౌశిక్ రెడ్డి ఏమైనా ఉద్యమం చేసాడా అని ఆయన ప్రశ్నించారు క్రషర్ వాళ్లను పైసల కోసం వాళ్ళని బ్లాక్ మెయిల్ చేస్తే అరెస్ట్ చేశారు.క్రషర్ వాళ్ళు కేస్ పెట్టిన తరువాత గుండెడు గ్రామ ప్రజలకు రూ.10 లక్షల చెక్ గుడి కోసం ఇచ్చాడని వెంకట్ వివరించారు.ఫోన్ ట్యాపింగ్ లో ఎట్లా అయితే దొంగలను బయట దేశాలకు పంపినట్టు, కౌశిక్‌రెడ్డిని కూడా దేశం దాటించాలని కెటిఆర్ చూసారని ఆయన విమర్శించారు.బ్లాక్ మెయిలర్ మా ఎమ్మెల్యే నా అని హుజూరాబాద్ నియోజక వర్గ ప్రజలు బాధ పడుతున్నారని ఆవేదన చెందారు. కేటీఆర్,హరీష్ రావులు మీరు దొంగలకు సపోర్ట్ చేయకండి అని హితవు చెప్పారు. మీరు చేసిన దొంగతనాలు బయట పడతా యని బావబామ్మర్ధులు బనకచర్ల విషయంలో ముందు మాట్లాడు తున్నారని ఎద్దేవా చేశారు. బనకచర్ల విషయంలో జగన్ తో లోపాయకర ఒప్పందాలు చేసుకుంది మీరు కాదా అని ప్రశ్నించారు. బావ బామ్మర్దులకు దమ్ము ధైర్యం ఉంటే బనకచర్ల విషయం లో ప్రమాణం చేయాలని ఎమ్మెల్సీ వెంకట్ సవాల్ విసిరారు.వాసాల మర్రిలో ఆగమ్మకు ఇల్లు ఇస్తామని చెప్పి ఇళ్ల కట్టలేదని గుర్తుచేశారు. కల్వకుంట్ల కవిత మీ నాన్న పేపర్ టైగర్, ఆగమ్మ కు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిం ది కాంగ్రెస్ ప్రభుత్వమని అన్నారు.

## సామాజిక న్యాయం కాంగ్రెస్‌తో సాధ్యం

**పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్**

**హైదరాబాదాద్, జూన్ 21, ప్రభాతవార్త:** సామాజిక న్యాయం కాంగ్రెస్‌పార్టీతోనే సాధ్యమని దీనికి ప్రబల ఉదాహరణ అడ్లూరి లక్ష్మణ్ వంటి అణగారిన వర్గాల బిడ్డ మంత్రి పదవి రావడమే అని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు.రాష్ట్ర సచివాలయంలో ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమ శాఖా మంత్రిగా అడ్లూరి లక్షణ్ కుమార్ బాధ్యతలు తీసుకొనే కార్యక్రమానికి ఆయన హాజరైనారు. అడ్లూరికి టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ శాలువా కప్పి,పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేను కానీ అడ్లూరి కానీ విద్యార్థి దశ నుంచి కాంగ్రెస్ పార్టీ రాజకీయ అనుబంధపార్టీలలో కొనసాగి అంచలంచెలుగా ఎదిగామని అన్నారు.కాంగ్రెస్ కార్యకర్తలు అంకిత భావంతో ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలని ఆయన కోరారు. ప్రజలతో మమేకం అయ్యేనాయకుడు అడ్లూరి లక్ష్మణ్ అని ఆయన రాజకీయ విధానంను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.

## మహంకాళీ డిఐ, ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెన్షన్

**హైదరాబాద్ (బేగంపేట) జూన్ 21, ప్రభాతవార్త:** మహంకాళీ పోలీసుస్టేషన్‌లో డిఐతో పాటు ఇద్దరు కానిస్టేబుల్స్‌ను హైదరాబాద్ సీపీ సస్పెండ్ చేసారు. అందిన సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి.గడచిన నెల 31వ తేదీన జనరల్‌బజార్‌లో బంగారం వ్యాపారి వ్యాపార నిమిత్తం నగదు ఉన్న బ్యాగులను తీసికెళ్తుండగా కానిస్టేబుల్స్ శ్యామ్‌రాజ్, మహేష్ ఇది హవాలా డబ్బు అంటూ వ్యాపారిని బెదిరించి పట్టుకున్నారు. ఇదే విషయాన్ని వారు డిఐ వై.కె ప్రసాద్‌కు తెలియజేసారు. ఇది హవాలా డబ్బు కాదని,తాను వ్యాపార నిమి త్తం తీసుకుని వెళ్తున్నా నంటూ వ్యాపారి చెప్పినా కానిస్టేబుల్స్ వినకుండా డిఐ ప్రసాద్‌కు చెప్పడం, డబ్బును వదిలి వేయాలంటే తమకు 6లక్షల రూపాయలు ఇవ్వాలంటూ వ్యాపారితో డీల్ కుదుర్చుకున్నారు.ఈ క్రమంలో ఒప్పందం మేరకు వ్యాపారి నుంచి వారు అడిగిన 6లక్షల రూపాయలను నేరుగా వారు బ్యాంకు అకౌంట్‌లో వేయించుకున్నారు.ఈ విషయాన్ని సదరు వ్యాపారి పోలీసు ఉన్న తాధికారులకు ఫిర్యాదు చేయడంతో నగర పోలీసు కమీషనర్ ఈ విషయంపై విచారణ జరిపి వారిపై వచ్చిన ఆరోపణలు నిజమని తేలడంతో డిఐ వై.కే.ప్రసాద్‌తోపాటు కానిస్టేబుల్స్ శ్యామ్‌రాజ్, మహేష్‌ను సస్పెండ్ చేసారు.

## కెబిఆర్ పార్కుకు జయశంకర్ పార్కుగా నామకరణం చేయండి

**తెలంగాణలో పార్కులకు అమరవీరుల పేర్లు పెట్టాలి**

**బ్రహ్మానందరెడ్డి విగ్రహం పెకిలించి జయశంకర్ విగ్రహం పెడుతాం: ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తెలంగాణ తొలి ఉద్యమంలో 369 మంది ఉద్యమకారులను పిట్టల్లా కాల్చి చంపిన కాసు బ్రహ్మానందరెడ్డి స్మారకంతో ఏర్పాటు చేసిన కెబిఆర్ పార్క్ పేరు వెంటనే తొలగించి తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టాలని ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. శనివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ నాయ కులతో కలిసి కెబి ఆర్ పార్కు సమీపం లో నిరసనకు దిగా రు. ఈ సందర్భం గా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ తెలంగాణలో ఆంధ్ర ప్రాంతం వారి పేరుతో ఉన్న పార్కు పేరును తొలగించి తెలంగాణ అమరవీరుల పేర్లు పెట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఒకవేళ కాంగ్రెస్ ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టకపోతే ఆ పని మేమే చేస్తామని డిమాండ్ చేశారు.

తెలంగాణలో బిసి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కాసు బ్రహ్మానందరెడ్డి విగ్రహాన్ని జెసిబితో పెకిలించి అవతల పడేస్తామని వార్నింగ్ ఇచ్చారు. ఆ తర్వాత ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహం పెడతామని స్పష్టం చేశారు. తెలం గాణలో ముఖ్యంగా హైదరాబాదులో సీమాంధ్ర ప్రాంతానికి చెందిన నాయ కుల స్మారకంతో ఉన్న అన్ని పార్కులకు తెలంగాణ ఉద్యమకారుల పేర్లు పెట్టాలని మల్లన్న డిమాండ్ చేశారు. హాస్పిటల్స్, హోటల్స్, ఏరియాల పేర్లు, ట్యాంక్‌బండ్ నక్లెస్‌రోడ్డుపై ఉన్న అనేక ఆంధ్ర వలసవాదుల స్మారక చిహ్నాలకు తెలంగాణ యోధుల పేర్లు పెడుతూ గెజిట్ విడుల చేయాలని తెలంగాణ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న సూచించారు.

## కృత్రిమ మేధతో మానవరహిత వ్యవసాయం!

**ప్రొ. జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అధునాతన ప్రయోగశాల త్వరలో ప్రారంభం**




సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు

**హైదరాబాద్ అత్తాపూర్ జూన్ 21, ప్రభాతవార్త:** వ్యవసాయ రంగం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ( ఎస్‌బీఐ) ఫౌండేషన్ వారి సహకారంతో ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవ సాయ విశ్వవిద్యాలయం త్వరలో ప్రారంభించనున్న ఆరిసా (ఏఐ, రోబోటిక్స్, ఇఓటి ఫర్ స్మార్ట్ అగ్రికల్చర్) ల్యాబ్ అత్యవసరమైనదని రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి ఎం. రఘునందన్ రావు అభిప్రాయ పడ్డారు. దేశంలోనే మొట్ట మొదటిసారిగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఇలాంటి సృజనాత్మకమైన ఆలోచన చేసి కృత్రిమ మేధస్సుతో కూడిన ప్రయోగశాలను నెలకొల్పుతున్నందుకు విశ్వవిద్యాలయం ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య ను మరియు ఇతర సిబ్బందిని ఆయన అభినందించారు. పి జె టి ఏ యూ లోని సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ ఆవరణలో ఎల్‌బీఐ సహకారంతో పిజెటిఏయూ అగ్రిహబ్ ఏర్పాటు చేయనున్న (ఏఐ, రోబోటిక్స్, ఇఓటి ఫర్ స్మార్ట్ అగ్రికల్చర్) ప్రయోగశాల ప్రీ లాంచ్ కార్యక్రమంలో రఘునందన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ ఆరిసా ల్యాబ్‌లో వ్యవసాయ విద్యను అభ్యసించే విద్యార్థులతో పాటు, ఇతర సాంకేతిక కోర్సులను అభ్యసించే విద్యార్థులని విస్తృతంగా భాగ స్వాములను చేయాలని సూచించారు. అదే విధంగా విశ్వవిద్యాలయం చేపడుతున్న పరిశోధన, విద్య మరియు విస్తరణ కార్యక్రమాల రికార్డులను డిజిటలైజేషన్ చేయాలని వ్యవసాయ విశ్వ విద్యాల యానికి ఆయ న సూచించారు. రానున్న 20 ఏళ్లలో వ్యవసాయం చేసే వారి సంఖ్య గణనీయంగా తగ్గిపో తుందని తద్వారా ఆహార భద్రతకు పెనుముప్పు వాటిల్లే ప్రమాదం ఉందని ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకుల పతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య అన్నారు. ప్రస్తుతం వ్యవసాయ రంగం రెండు సమస్య లతో కొట్టు మిట్టా డుతుందని అందులో మొదటిది అతివేగంగా మారుతున్న వాతావరణ పరిస్థితుల వలన వచ్చే మార్పు మరియు రెండవది వ్యవసాయ రంగంపై యువత మక్కువ చూపకపోవడం ద్వారా వ్యవసాయ రంగం నుంచి నానాటికి బయటికి రావటం. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తులో వ్యవసాయ రంగం సుస్థిరంగా ఉండాలంటే మానవ రహిత వ్యవసాయమే శరణ్యమని ఈ సందర్భంగా తెలియజేశారు. దీనికోసం కృత్రిమ మేధస్సుతో కూడిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసి రైతాంగానికి అందించినప్పుడే వ్యవసాయ రంగం సుస్థిరంగా ఉంటుందని అన్నారు. సందర్భంగా ఎస్బిఐ చైర్మన్ శ్రీ చల్లా శ్రీనివాసులుచెట్టి ఈ ప్రయోగశాల ఏర్పాటుకు సహకారం అందజేసి నందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు, అగ్రి హబ్, సెంటర్ ఫర్ డిజిటల్ అగ్రికల్చర్ అధికారులు పాల్గొన్నారు.

## టి.నాబ్‌లో ఘనంగా మొదలైన డ్రగ్ అవేర్‌నెస్ వారోత్సవాలు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** తెలంగాణలో మాదకద్రవ్యాలను పూర్తిగా నిరోధించేందుకు ఉద్దేశించిన డ్రగ్ అవేర్‌నెస్ వీక్ కమాండ్ కంట్రోల్‌లోని తెలం గాణ యాంటి నార్కోటిక్ బ్యూరో (టి.నాబ్) వద్ద శనివారం ఘనంగా మొదలయ్యింది. వారం రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాన్ని డిజిపి జితేందర్ లాంఛ నంగా ప్రారంభించారు. జంట నగరాలు, శివార్లలోని 15 పాఠశాలలకు చెందిన రెండు వేల మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో డిజిపి జితేందర్ మాట్లాడుతూ తెలంగాణలో డ్రగ్స్ మహమ్మారి లేకుండా చేసేందుకు టి.నాబ్ విశేష కృషి చేస్తున్నట్లు కొనియాడారు. మాదకద్రవ్యాల వల్ల యువత జీవితాలను నాశనం చేసుకోకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై వుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో మాదకద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖతో పాటు ఇతర సర్కారీ విభాగాలు అహర్నిషలు కృషి చేస్తున్నాయని, దీని ఫలితంగానే పదుల సంఖ్యలో డ్రగ్స్ స్మగ్లర్లు పట్టుబడు తున్నారని తెలిపారు. విద్యా ర్థులను మాదకద్రవ్యాలకు దూరంగా వుంచాల్సిన బాధ్యత తల్లిదండ్రులతో పాటు అధ్యాపకులపై వుందని ఆయన అన్నారు. ప్రతీ విద్యాసంస్థలో యాంటి డ్రగ్ కమిటీ వుండాలని, ఈ కమిటీ తరచూ సమావేశమవుతో డ్రగ్స్ కట్టడికి కఠినంగా వ్యవ హరించాలని డిజిపి కోరారు. మాదకద్రవ్యాలకు సంబంధించి ఎవరి వద్ద ఎలాంటి సమాచారం వున్నా వెం టనే 8712667111కు లేదా 1908కు ఫోన్ చేయాలని డిజిపి కోరారు. అంతకు ముందు విద్యార్థులంతా మాదకద్రవ్యాలకు వ్యతి రేకంగా ప్లకార్డులతోపాటు బ్యానర్లు పట్టు కుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో టి.నాబ్ డైరక్టర్ సందీప్ శాండిల్యా, సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైర క్టర్ శిఖా గోయల్, నగర అదనపు పోలీసు కమిషనర్ (శాంతి భద్రతలు) విక్రం సింగ్ మాన్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, కమాండ్ కంట్రోల్ డైరక్టర్ కమ లాసన్ రెడ్డి, టి.నాబ్ డిఐజి అభిషేక్ మొహంతి, సిటీజాయింట్ పోలీసు కమిషనర్ పరిమళహన్నా నూతన్ తదితరులు పాల్గొన్నారు.

## మాటలే పెట్టుబడి.. ఆ తర్వాత నిలువునా మోసం



ఇఒడబ్ల్యు కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న బాధితులు

**రూ. 500 కోట్లు దండుకున్న రియల్ ఎస్టేట్ కంపెనీ**

**పోలీసులకు బాధితుల ఫిర్యాదు**

**హైదరాబాద్ (సైబరాబాద్ ప్రతినిధి), జూన్ 21, ప్రభాతవార్త:** ప్రతి ఒక్కరూ తమ కుటుంబ అవసరాల కోసం రూపాయి..రూపాయి కూడబెట్టుకుంటారు. ఆ విధంగా పొదుపు చేసిన నగదును ఎవరో వచ్చి తన్నుకుపోయినట్టు ఘరానా మోసగాళ్ల వలలో పడి ప్రజలు మోసపోతున్నారు. మాటలే వారికి పెట్టుబడి అత్యాశే రాబడి. హైదరాబాద్ నగరంలో తాజాగా ఎవి ఇన్‌ఫ్రాకాన్ అనే రియల్ ఎస్టేట్ కంపెనీ వందలాది మంది బాధితుల నుండి కోట్లాది రూపా యలు వసూళ్లు చేసి బిచానా ఎత్తేసింది.

**కమిషనరేట్‌లోని ఇఒడబ్ల్యు కార్యాలయంలో బాధితులు ఫిర్యాదు**

సైబరాబాద్ కమిషనరేట్‌లోని ఈఓడబ్ల్యూ కార్యాలయంలో మోసపోయిన బాధితులు శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ విజయవాడకు చెందిన గోగుల లక్ష్మీ ్మ విజయ్ కుమార్ అనే వ్యక్తి ఎవి ఇన్‌ఫ్రాకాన్ పేరుతో మాదాపూర్‌లో ఓ రియలేస్టేట్ కంపెనీ ప్రారంభించి పెట్టుబడి పెడితే బై బ్యాక్ పాలసీ ద్వారా 18 నెలల్లోనే ఒకటికి రెండింతలు డబ్బులు తిరిగి చెల్లిస్తామని, అందుకు సంబంధించిన భూమి రిజిస్ట్రేషన్ చేయిస్తామని నమ్మ బలికారు.

అది నిజమేనని నమ్మిన అమాయక ప్రజలు రూ.10 లక్షల నుండి మొదలు కోట్లాది రూపాయలు పెట్టుబడులు పెట్టారు. ముందు అనుకున్న ప్రకారం డబ్బులు చెల్లిస్తూ నమ్మకం కల్పించారు. దీంతో ఇన్ఫ్రా కాన్ రియలేస్టేట్ కంపెనీలో సుమారు 1000 మంది వరకు బాధితులు పెట్టుబడులు పెట్టారు. వీరి వద్ద నుండి గోగుల లక్ష్మీ ్మ విజయ్ కుమార్ సుమారు రూ.500 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసినట్లు బాధితులు ఆరోపించారు. లక్ష్మీ ్మవిజయ్‌కుమార్‌పై పోలీసులు చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు డిమాండ్ చేశారు.

**బ్లాంక్ చెక్కులు ఇచ్చి.. ఆఫీస్ క్లోజ్ చేసి..**

ఎవి ఇన్‌ఫ్రాకాన్ పేరుతో గోగుల లక్ష్మీ ్మ విజయ్‌కుమార్ ముందు మాదాపూర్ దుర్గంచెరువు వద్ద కార్యాలయం ఓపెన్ చేసిన అతను అనంతరం కావూరి హిల్స్‌కు మార్చాడని, తమకు డబ్బులు చెల్లించలేక తాజాగా కార్యాలయాన్ని ఎత్తివేసినట్లు బాధితులు తెలిపారు. డబ్బులు అడిగిన వారికి బ్లాంక్ చెక్కులు ఇచ్చారని, అవి బ్యాంకులో వేసినా చెల్లక పోవడంతో చెక్ బౌన్స్ కేసులు వేశామని బాధితులు చెబుతున్నారు. తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు అంటూ మోసాలకు పాల్పడిన ఎవి ఇన్‌ఫ్రాకాన్ చైర్మన్ గోగుల లక్ష్మీ ్మవిజయ్‌కుమార్ భారీఎత్తున ఏజెంట్లను నియమించుకున్నట్లు బాధితులు తెలిపారు.

## మైనింగ్ నిర్వహణలో పారదర్శకత పాటించాలి

**మంత్రి వివేక్ వెంకటస్వామి**

**మైనింగ్ శాఖపై ఉన్నతాధికారులతో సమీక్ష**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** మైనింగ్ నిర్వహణలో పూర్తిపారదర్శకత పాటించాలని మంత్రి వివేక్ వెంకటస్వామి అధికారులను ఆదేశించారు. శనివారం మైనింగ్ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సచివాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ అంశాలపై అధికారులతో సుదీర్ఘంగా సమీక్ష జరిపారు. మైనింగ్ ద్వారా ప్రభుత్వ ఆదాయం పెరగడంతో పాటు ప్రజలకు నష్టం కలగకుండా చూడాలన్నారు. మైనింగ్ శాఖలో ఉన్న ప్రస్తుత పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మైనింగ్ అనుమతులు, కార్మికుల సంక్షేమం గురించి అధికారులతో చర్చించారు. ఆదాయం పెంపు భద్రతా చర్యలతో పాటు ఇతర అంశాల గురించి అధికారుల నుంచి పూర్తి వివరాలు అడిగి తెలుసుకున్నారు సమీక్ష సందర్భంగా మంత్రి మాట్లాడుతూ కార్మికుల హక్కులు కాపాడటం, పర్యావరణ పరిరక్షణ కోసం ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉన్నట్లు తెలిపారు. వివిధ అంశాలపై అధికారులకు తగిన సూచనలు చేసిన మంత్రి, సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## బనకచర్ల కంటే ముందు హంద్రీనీవా, వంశధారలను పూర్తి చేయాలి

**తెలుగు రాష్ట్రాల సిఎంలు సమస్యను పరిష్కరించుకోవాలి**

**సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రెండు తెలుగు రాష్ట్రాల్లో హాట్‌టాపిక్‌గా మారిన బనకచర్ల ప్రాజెక్టుపై సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ స్పందించారు. బనకచర్ల ప్రాజెక్టు కంటే ముందు హంద్రీనీవా, వంశధార లాంటి ప్రాజెక్టులను పూర్తి చేయాలన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రులు కూర్చొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. రెండు రాష్ట్రాలకు ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ప్రాజెక్టులను కట్టుకుంటే మంచిదని ఇరు రాష్ట్రాల సీఎంలకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనను స్వాగతిస్తున్నట్టు నారాయణ శనివారం విడుదల చేసిన వీడియో ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రంతో చర్చించి సమస్యను పరిష్కరించుకుంటామని రేవంత్ రెడ్డి అన్నారని.. వెనకబడిన ప్రాంతాలకు నీరు అందేవిధంగా ప్రభుత్వాలు కృషి చేయాలని నారాయణ అన్నారు. ప్రాజెక్టుల నిర్మాణం కోసం కేంద్రం సహాయం తీసుకోవాలని.. కానీ కొంతమంది ప్రాంతీయ ధోరణితో రెచ్చగొట్టే ప్రయత్నాలు చేస్తున్నారని నారాయణ మండిపడ్డారు. రాష్ట్రాలు రెండుగా విడిపోయినంత మాత్రాన.. తెలుగు వాళ్లు తెలుగు వాళ్ల శత్రువులు కాదన్నారు. ఎవరికి నష్టం లేని పద్ధతిలో పరిష్కారం చేసుకుంటే మంచిదని నారాయణ రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు.

## దాసోజు శ్రవణ్ రాజకీయ అజ్ఞాని

**బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కుమార్‌పై బిఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ వ్యాఖ్యలను ఖండిస్తున్నామని బిజెపి అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్ అన్నారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దాసోజు శ్రవణ్ రాజకీయ అజ్ఞాని అని, నిత్యం పార్టీలు మారుతూ ఏ రోటికాడ పాట ఆ రోటికాడ పాడే నైజం ఆయనది అన్నారు. దాసోజు పెద్ద ఐరన్ లెగ్ అన్నారు. ఆయన ఏ పార్టీలో ఉంటే ఆ పార్టీ అధికారంలోకి రానేరాదు. బిఆర్ఎస్‌లో ఉన్నప్పుడు ఆ పార్టీ అధికారంలోకి రాలేదు. అక్కడి నుండి కాంగ్రెస్‌లోకి అక్కడా అధికారం రాలేదు. ఆ తరువాత మళ్లీ అన్ని పార్టీలు మారి బిఆర్ఎస్ పంచన చేరితే చివరకు బిఆర్ఎస్ కూడా అధికారానికి దూరమైంది. ఇదీ దాసోజు హిస్టరీ అన్నారు. ఇలా ఎన్ని పార్టీల్లో తిరిగావో జనం కూడా లెక్క పెట్టలేకపోతున్నారని, అవకాశవాద రాజకీయం ఆయనది అన్నారు. ఎన్నికలకు ముందు బిఆర్ఎస్ వస్తుందేమోనుకుని నువ్వు మళ్లీ బిఆర్ఎస్‌కు వెళ్లాడని, బిఆర్ఎస్ నామరూపాల్లేకుండా పోయిందన్నారు. బనకచర్ల ప్రాజెక్టు గురించి ప్రెస్ మీట్ పెట్టి నాలుగు ముక్కలు ఇంగ్లీషులో మాట్లాడితే ప్రజలంతా తమమీద నమ్మకం పెడతారని భావిస్తే అది చాలా హాస్యాస్పదం. బిఆర్ఎస్ పార్టీ పరిస్థితి ఎలా ఉందంటే, 17 ఎంపి స్థానాల్లో పోటీ చేసి 15లో డిపాజిట్ కోల్పోయారు. కెసిఆర్ మహారాష్ట్రకు 600 కార్లతో ప్రచారానికి వెళ్లారు. ఆఖరుకు అక్కడ బోల్తాపడ్డరు. బిఆర్ఎస్ విసిరే ఎంగిలి మెతుకుల కోసం బండి సంజయ్‌ని రేవంత్ రెడ్డే గెలిపించారని విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఇట్లాంటి పిచ్చి కామెంట్లు చేసి ప్రజల్లో జోకర్‌గా మిగిలి పోవద్దన్నారు. గ్రూప్ 1 అభ్యర్థుల ఆందోళన సమయంలో లిబర్టీ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరుద్యోగ యువకులు దాసోజు శ్రవణ్‌కు చేసిన సత్కారాన్ని ఒక్కసారి గుర్తు చేసుకుంటే మంచిదన్నారు.



దేవాదాయ ధర్మాదాయ శాఖలో జెఏసి ఆవిర్భావ సభలో పాల్గొన్న సంధ్యారాణి, ఎస్.ఆంజనారెడ్డి, విజయరామారావు, కె. రామాంజనేయులు తదితరులు

## దేవాదాయ ధర్మాదాయ శాఖలో జెఏసి ఆవిర్భావం

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖలో వివిధ హోదాల్లో పనిచేస్తున్న ఉప కమీషనర్లు, సహాయ కమీషనర్లు, హెడ్ ఆఫీస్ స్టాఫ్, మఫి సిల్ స్టాఫ్, కార్యనిర్వహణాధికారులు, దేవాలయ సిబ్బంది, ప్రధాన దేవాలయ ఏఈఓలు శనివారం కాచిగూడలోని తుల్జాభవన్లో రౌండ్‌టేబుల్ సమావేశమై దేవాదాయ ధర్మాదాయ శాఖ జేఏసీగా ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖలో వివిధ విభాగాల్లో ఉన్న సమస్యలను ఐక్యంగా పరిష్కరించేందుకు వీలుగా జేఏసీని ఏర్పాటు చేసినట్లు జేఏసీ ప్రతినిధులు తెలిపారు. వివిధ ప్రభుత్వ శాఖల నుండి ఉద్యోగులను దేవాదాయ ధర్మాదాయ శాఖకు డిప్యూటేషన్ పై కార్యనిర్వహణాధికారులుగా తీసుకురావడానికి ఇరిగే ప్రయత్నాలను ప్రభుత్వం వెంటనే ఉప సంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. దేవాదాయ శాఖలో సర్వీస్‌కు సంబంధించిన విషయాలను వెంటనే పరిష్కరించి అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా జీఏసీ స్టీరింగ్ కమిటీని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జేఏసీ ప్రతినిధులు సంధ్యారాణి, విజయ రామారావు, కె.రామాంజనేయులు, ఎస్.బాబుశంకర్, ఎం.పల్లవి, బి.రమణ, ఎ.నరేందర్, ఎస్.ఆంజనారెడ్డి, ఆర్.సుదర్శన్, వి.శ్రావణ్, బి.రంగారెడ్డి, జె.జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మరో పవర్ ప్లాంట్ నిర్మాణానికి శ్రీకారం

**సింగరేణి సిఎండి బలరామ్**

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్ (500 మెగావాట్ల సామర్థ్యం) నిర్మాణానికి చర్యలు చేపట్టినట్లు సింగరేణి సింగరేణి సిఎండి ఎన్ బలరామ్ వెల్లడించారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటనలో మూతపడిన మేడిపల్లి ఓపెన్ కాస్ట్ గని నీటి సంపు ఆధారంగా ప్లాంట్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇదే తొలి పీఎస్పీ ప్లాంట్‌గా అభివర్ణించారు. సింగరేణి విస్తరణ చర్యల్లో భాగంగా ఇప్పటికే థర్మల్ విద్యుత్, సోలార్ విద్యుత్ ప్లాంట్లను నెలకొల్పగా, ఇప్పుడు భిన్న విద్యుత్ ఉత్పాదన ప్లాంట్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. దీనికి సంబంధించిన ప్రాథమిక అధ్యయనాలు పూర్తిచేశామని, అయితే సంపూర్ణ ప్రాజెక్టు రిపోర్ట్ రూపొందించడానికి వ్యాప్కోస్ అనే ప్రభుత్వ రంగ సంస్థకు బాధ్యతలను అప్పగించినట్లు వివరించారు. ఈ తరహా ప్రాజెక్టు ఇప్పటి వరకు రాష్ట్రంలో ఎవరూ చేపట్టలేదన్నారు.

# ఎస్సీ, ఎస్టీ సంక్షేమ మంత్రిగా లక్ష్మణ్ బాధ్యతల స్వీకరణ



## పౌష్టికాహార లోపం తలెత్తకుండా దంతాలతో రక్షణ

### గాంధీభవన్‌లో ఉచిత వైద్యపరీక్షలు

### పిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** దంతాల ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకోవాలని మనిషిలో పౌష్టికాహారలోపం తలెత్తకుండా దంతాలు కాపాడుతాయని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అన్నారు. శనివారం గాంధీ భవన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత దంత వైద్యపరీక్షలు ఆయన లాంఛనంగా ప్రారంభించారు. టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ ఆధునిక ఆహారపు అలవాట్ల కారణంగా దంతాలకు అనేక వ్యాధులు వస్తున్నాయని అన్నారు. దంతసంరక్షణకు అందరం శ్రద్ధతీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి ఉపాధ్యక్షులు కుమార్‌రావ్, ట్రస్ట్ మెంబర్ సూర్య నాయక్ తదితరులు పాల్గొన్నారు.

**యోగతో శారీరక, మానసిక ఆరోగ్యం**

యోగ సాధనతో శారీరక, మానసిక ఆరోగ్యంకు దోహదపడి మానసిక సమతుల్యత కలుగుతోందని టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2025 సందర్భంగా రాష్ట్ర ప్రజలందరికీ హృదయపూర్వక శుభాకాంక్షలు చెప్పారు.. భారతీయ సాంప్రదాయ ప్రాచీన వారసత్వంలో యోగాకు ప్రత్యేక స్థానం ఉందని ప్రకటనలో పేర్కొన్నారు. యోగసాధన చిన్నప్పటి నుంచి చేయాలని దీనితో క్రీడాస్ఫూరి పెరుగుతోందిన మానసికంగా ధృఢత్వం కూడా వస్తుంని ఆయన అన్నారు..



## ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలగాలి

### ఎస్‌హెచ్‌ఒల భేటీలో డిజిపి జితేందర్

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** పోలీసు స్టేషన్లకు వచ్చే ప్రజలతో పోలీసులు స్నేహంగా మెలగాలని, వారి సమస్యలు పరిష్కరించేందుకు తమవంతుగా కృషి చేయాలని డిజిపి అన్నారు. పోలీసులంటే ప్రజలకు గౌరవం పెరిగేలా చూడాలని డిజిపి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా డిజిపి కార్యాలయంలో ఎంపిక చేసిన కొందరు ఎస్‌హెచ్‌ఒలతో శనివారం జరిగిన భేటీలో డిజిపి మాట్లాడుతూ అనేక దేశాల్లో పోలీసులు ప్రజలను మిత్రులుగా చూసేవిధంగా మసలు కోవాలని కోరా రు. డిజిపి కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో డిజిపి మాట్లాడుతూ అభివృద్ధి చెందిన దేశాలలో పోల్చుకుంటే భారత్‌లో పోలీసులంటే ఇప్పటికీ భయం వుందనే భావన వుందని, విదేశాల్లో దీనికి విరుద్ధంగా వుండడంతో పాటు అక్కడి పోలీసులను ప్రజలు ఎంతో గౌరవిస్తారని, ఇలాంటి పద్ధతి మనదేశంలోనూ రావాలని అన్నారు. న్యాయం కోసం పోలీసు స్టేషన్లకు వచ్చే వారితో పోలీసులు సహృదయంతో మెలగాలని, ఇలా చేయడం వల్ల ప్రజల మనస్సులను గెలుచుకునే అవకాశం వుంటుందని ఆయన తెలిపారు. ఏదో కారణంగా పోలీసులు విధుల్లో పక్షపాత దోరణితో వ్యవహరిస్తే దాని ప్రభావం మొత్తం పోలీసు శాఖపై పడుతుందని ఆయన అన్నారు. పోలీసులు ఎట్టి పరిస్థితుల్లోనూ పక్షపాత దోరణికి దూరంగా వుండాలని ఆయన కోరారు. రాష్ట్రంలో దాదాపు 80 శాతం మంది ఎస్‌హెచ్‌ఒలకు శిక్షణ పూర్తి చేయడం జరిగిందని డిజిపి తెలిపారు. కార్యక్రమంలో శాంతి భద్రతల అదనపు డిజి మహేష్ భగవత్‌తో పాటు ఏఐజి రమణకుమార్, డిఎస్‌పి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు కాగా అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా శనివారం ఉదయం డిజిపి కార్యాలయం లో యోగా కార్యక్రమం ఘనంగా జరిగింది. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని డిజిపి జితేందర్ ప్రారంభించారు.

## డయాలసిస్ రోగులకు నెలకు రూ.2,016 చొప్పున పింఛన్ మంజూరు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్21:** తెలంగాణలో డయాలసిస్ పేషెంట్లకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతగా నిలిచింది. కొత్తగా మొత్తం 4,021 మంది డయాలసిస్ రోగులకు నెలకు రూ.2,016 చొప్పున పింఛన్ మంజూరు చేస్తూ నిర్ణయం తీసుకుంది. ఇది గత ప్రభుత్వ పరిపాలనతో పోలిస్తే అధికంగా ఉంది. బీఆర్ఎస్ హయాంలో కేవలం 4,011 మంది డయాలసిస్ పేషెంట్లకే ఆసరా పింఛన్ అందగా, కొత్త ప్రభుత్వంలో ఒక్క నెలలోనే దాన్ని మించి లబ్ధిదారులు ఎంపిక కావడం గమనార్హం. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క చొరవతోనే నూతన లబ్ధిదారుల ఎంపిక జరిగింది.

ముఖ్యంగా డయాలసిస్ బాధితులు ఏ పనిచేయలేరు. ప్రతి నెల ఆసుపత్రిలో చికిత్స చేసుకోవాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో వారి కష్టాలను గుర్తించిన ప్రభుత్వం వారికి పింఛన్లు మంజూరు చేసింది. వీరితో పాటు త్వరలో హెచ్‌ఐవీ బాధితులకు కూడా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే దాదాపు 13,000 మంది హెచ్‌ఐవీ పేషెంట్లు తమకు పెన్షన్లు మంజూరు చేయాలంటూ దరఖాస్తు చేసుకున్నారు.

### దివ్యాంగులకు రూ.5 కోట్ల మంజూరు ఫైలుపై తొలి సంతకం

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త :** ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, దివ్యాంగుల సంక్షేమ శాఖ మంత్రిగా అడ్లూరి లక్ష్మణ్ బాధ్యతలు స్వీకరించారు. ఇవాళ ఉదయం సచివాలయంలో తనకు కేటాయించిన చాంబర్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ దివ్యాంగుల సంక్షేమానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. దివ్యాంగులకు స్వయం ఉపాధి యూనిట్ల ఏర్పాటు నిమిత్తం 5 కోట్ల రూపాయలు మంజూరు చేసే ఫైలుపై తొలి సంతకం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలో మొదటిసారిగా దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసి, సహాయక యూనిట్ల స్థాపనకు రివాల్వింగ్ ఫండ్‌గా 3.55 కోట్ల రూపాయలు మంజు చేశానన్నారు.

తద్వారా 2,367 సంఘాలు లబ్దిపొందుతాయన్నారు. ఓవర్‌సీస్ విద్యానిది కింద ఈ ఏడాది నుండి లబ్ధిపొందే ఎస్సీ విద్యార్థుల సంఖ్యను 500కు పెంచుతున్నట్లు వెల్లడించారు. అలాగే గిరిజన విద్యాలయాలకు సంబంధించి 79.61 కోట్ల రూపాయలతో మరమతు పనులకు అనుమతించినట్లు చెప్పారు. మినీ గురుకులాల నిర్వహణకు 17.18 కోట్ల రూపాయల చొప్పున అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. మేడారం జాతర మిగిలిన పనులకు 44.5 కోట్ల రూపాయలకు అనుమతి ఇచ్చినట్లు వివరించారు. అంతేకాకుండా కొత్తగూడలోని మొండ్రాయిగూడెంలో అంతర్గత రోడ్డు పనులు చేపడతామన్నారు. నీట్, జెఇఇలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు త్వరలో ప్రోత్సహాకాలు అందించనున్నట్లు తెలిపారు.

**విద్య, వసతి, పోషణల మెరుగుదల కోసం చర్యలు**

విద్యార్థి దశలోనే జీవితంపై ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సూచించారు. విద్యార్థుల విద్య, వసతి, పోషణ మెరుగుదల కోసం ఎటువంటి చర్యలు తీసుకోవడానికైనా వెనుకాడబోమని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రిగా శనివారం బాధ్యతలు స్వీకరించిన అడ్లూరి లక్ష్మణ్ వెంటనే గౌలిదొడ్డిలోని ఎస్సీ గురుకులాన్ని సందర్శించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ గురుకుల సొసైటీ కార్యదర్శి డాక్టర్ విఎస్ అలగు వర్షిణి, చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, వికలాంగుల సంస్థ చైర్మన్ వీరయ్య పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తుందని. ఇందుకోసం ఎన్ని నిధులైనా ఖర్చు చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం కట్టుబడి నిరంతరం పనిచేస్తుందని.. విద్య, వసతి, పోషణ అంశాలలో మరింత మెరుగుదల కోసం తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి విద్యార్థులకు హామీ ఇచ్చారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న అడ్లూరి లక్ష్మణ్, పక్కన డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌రావు

## భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ

### లండన్ అక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో కెటిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్21:** స్వతంత్ర భారత చరిత్రలోనే విజయవంతమైన స్టార్టప్ స్టేట్ తెలంగాణ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజల జీవితాలను మార్చాలన్న సంకల్పం ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే ఏం జరుగుతుందో తెలియడానికి తెలంగాణనే నిదర్శనం అని అన్నారు. లండన్ ఆక్స్‌ఫర్డ్ ఇండియా ఫోరమ్ సదస్సులో తెలంగాణ విజయ గాథను కేటీఆర్ వినిపించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. దశాబ్దాల పోరాటం తర్వాత 2014లో తెలంగాణ ఏర్పడింది. స్వతంత్ర భారతంలో అద్భుతమైన ఆర్థిక పురోగతి, ప్రగతిని చూపించిన రాష్ట్రం తెలంగాణ. అహింసాయుతంగా జరిగిన ఒక మహా అద్భుత పోరాటం తెలంగాణ ఉద్యమం అని చెప్పారు. తెలంగాణ విజయాన్ని కేవలం అంకెలతో మాత్రమే చెప్పుకుంటే సరిపోదు. ఆత్మగౌరవం, పట్టుదలకు ప్రతిరూపంగా చెప్పుకోవడంతో పాటు లక్షలాది మంది భారతీయులకు భవిష్యత్తుపై భరోసాను ఇచ్చిన విజయగాథ లాగా తెలంగాణను చూడాలి. సబ్బండ వర్ణాల భాగస్వామ్యంతో సాధించిన సమ్మిళిత వృద్ధిలాగా తెలంగాణ విజయాన్ని చెప్పుకోవచ్చు అని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఎత్తిపోతల పథకం కాళేశ్వరం తెలంగాణలో ఉంది. 2015 నుంచి 2019 మధ్య కాలంలో కేవలం నాలుగు సంవత్సరాల స్వల్ప కాలంలోనే కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేశామని చెప్పారు. అమెరికా అవతల హైదరాబాద్ లోనే అమెజాన్ అతిపెద్ద క్యాంపస్ ఉంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఇన్నోవేషన్ క్యాంపస్ టీ హబ్ హైదరాబాద్‌లో ఉందన్నారు. ప్రపంచంలోని మూడో వంతు వ్యాక్సిన్ ఉత్పత్తి తెలంగాణలో జరుగుతుంది. ప్రపంచంలోనే ఐదు అతి పెద్ద టెక్ దిగ్గజ కంపెనీలు హైదరాబాద్‌లోనే తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేశాయన్నారు. కేసీఆర్ హయాంలో ఫ్లోరోసిస్ పూర్తిగా నిర్మూలించబడిందని చెప్పారు. హైదరాబాద్ లాంటి నగరానికి నీటి సమస్యలు లేకుండా శాశ్వత పరిష్కారాన్ని కేసీఆర్ చూపించారని, అభివృద్ధి చెందిన ఆర్థిక వ్యవస్థకు ప్రతినిధిగా మీ భాగస్వామ్యం కోసం వచ్చానని చెప్పారు. మనం కలిసి అద్భుతాలు చేయవచ్చు. తెలంగాణకు అద్భుతమైన భవిష్యత్తు ఉందని నేను బలంగా నమ్ముతున్నాను. ఈ ప్రపంచానికి ఇండియానే భవిష్యత్తు. తెలంగాణ తన విజయ ప్రస్థానాన్ని కొనసాగిస్తూనే ఉంటుంది అని కేటీఆర్ పేర్కొన్నారు.

## నిర్మాణరంగ అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### కళ్లు తెరిచి చూస్తే వాస్తవాలు కనిపిస్తాయి: మంత్రి శ్రీధర్‌బాబు




**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం తగ్గిందంటూ కొందరూ కావాలనే పనిగట్టుకొని మా ప్రభుత్వంపై దుష్ప్రచారం చేస్తున్నారని, అలాంటి వారు ఒక్కసారి కళ్లు తెరిచి వాస్తవాలు తెలుసుకోవాలని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. శనివారం హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో టైమ్స్ హోమ్ హంట్ ప్రాపర్టీ ఎక్స్‌పో 2025ను మంత్రి లాంఛనంగా ప్రారంభించారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రియల్ ఎస్టేట్ ప్రొఫెషనల్ సర్వీసెస్ రంగంలో 15.4 శాతం వృద్ధి రేటు నమోదయ్యిందన్నారు. నిర్మాణ రంగం 11.97 శాతం వృద్ధి చెందిందిదని, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఈ రంగం రూ.80వేల కోట్లు సమకూర్చిందన్నారు. తెలంగాణ సర్వీసెస్ ఎకానమీలో ఈ రంగం వాటా 24.9 శాతం. ప్రస్తుతం రెరా దగ్గర 9744 రియల్ ఎస్టేట్ ప్రాజెక్ట్స్ రిజిస్టర్ అయ్యాయని, ఇవి గణాంకాలు కాదు మా హయాంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం నెమ్మదించిందటూ తప్పుడు ప్రచారం చేస్తున్న వారికి చెంప దెబ్బ అని వివరించారు. ఈ యేడాది ఫిబ్రవరిలో ఒక్క హైదరాబాద్ లోనే 5900 ఇళ్ల రిజిస్ట్రేషన్ జరిగిందన్నారు. మొత్తం రిజిస్ట్రేషన్లలో రూ.కోటి, అంత కంటే ఎక్కువ ధర గల ఇళ్ల వాటా 18 శాతంగా ఉందన్నారు. ఈ తరహా ఇళ్ల కొనుగోలులో వార్షిక వృద్ధి రేటు 58 శాతంగా నమోదు అయ్యిందని నైట్ ఫ్రాంక్ నివేదిక వెల్లడించిందని అని గుర్తు చేశారు. రాష్ట్రంలో అర్హులైన వారందరికీ దశల వారీగా ఇందిరమ్మ ఇళ్లు కేటాయిస్తామన్నారు.

## ఇక ప్రభుత్వ బడుల తనిఖీ

### స్కూళ్లలో విద్య నాణ్యత పెంపునకు ప్రత్యేక చర్యలు

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పాఠశాల విద్య శాఖ చర్యలు చేపట్టింది. ఇకపై రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల తనిఖీల ప్రక్రియను నిరంతరాయంగా నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా రాష్ట్రంలోని మొత్తం ఉపాధ్యాయుల్లో 2 శాతం మంది ఉపాధ్యాయులను పాఠశాలల తనిఖీల కోసం ఉపయోగించుకోవాలని నిర్ణయించింది. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో రోజు కనీసం 2 పాఠశాలలను, ఉన్నత పాఠశాలల్లో రోజుకి కనీసం ఒక్క పాఠశాలను అయినా తనిఖీ చేయాలని నిర్ణయించింది. ప్రభుత్వ పాఠశాలల్లో విద్య నాణ్యత పెంపుతోపాటు స్కూల్స్ పర్యవేక్షణను బలోపేతం చేయడం కోసం ఈ నిర్ణయం తీసుకున్నట్టు ఉత్తర్వులో పేర్కొంది. ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను పాఠశాల విద్య శాఖ శనివారం జారీ చేసింది. పాఠశాల విద్య శాఖ జారీ చేసిన ఆదేశాల ప్రకారం.. పాఠశాలల పర్యవేక్షణను బలోపేతం చేయాలని, విద్య నాణ్యతను మెరుగుపరచడం ప్రాధాన్యతగా పరిగణించాలని డిఈవోలను ఆదేశించింది. జవాబుదారీతనంతో పాటు క్రమం తప్పకుండా పర్యవేక్షణను కొనసాగించడానికి రాష్ట్రంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరినీ అన్ని జిల్లాల్లోని పాఠశాలల తనిఖీ, పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా నియమించాలని ఆదేశించబడింది. సమీక్ష కోసం తదుపరి నెల 5వ తేదీ నాటికి వారి తనిఖీ నివేదికలను ఉన్నత అధికారులకు సమర్పించాలి. ఇవన్నీ ఆన్‌లైన్‌లో చేయాలి. ప్రస్తుతం రాష్ట్రంలో 1:15 సగటు ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తిలో ఉన్నట్టు పేర్కొంది. తనిఖీ అధికారికి ప్రాథమిక పాఠశాల అయితే పిఎస్‌హెచ్‌ఎం లేకపోతే 10 సంవత్సరాల బోధనా అనుభవం ఉన్న ఎస్‌జిటి, ప్రాథమికోన్నత పాఠశాల అయితే 10 సంవత్స రాల బోధనా అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్, అలాగే ఉన్నత పాఠశాలలో కూడా 10 సంవత్సరాల బోధన అనుభవం ఉన్న స్కూల్ అసిస్టెంట్ అర్హులుగా మార్గదర్శకాల్లో పాఠశాల విద్య పేర్కొంది. మూడు నెలల్లో 100 స్కూళ్లను పరిశీలించాలి. 3 నెలల వ్యవధిలో 50 పాఠశాలలను తనిఖీలు చేయాల్సి ఉంటుంది. రాష్ట్రంలో కొనసాగుతున్న 16,381 ప్రాథమిక పాఠశాలలు, 3094 ప్రాథమికోన్నత పాఠశాలలు, 4671 ఉన్నత పాఠశాలలు కలిపి మొత్తం 24,146 స్కూల్స్ ఉన్నట్టు పాఠశాల విద్య శాఖ పేర్కొంది.

## తెలంగాణకు జలద్రోహం చేసిన మామా అల్లుడు

### రాయలసీమను రతనాల సీమ చేయడానికి జగన్‌కు నీటిపాఠాలు బోధించారు: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**హైదరాబాద్, జూన్ 21,ప్రభాతవార్త:** తెలంగాణకు మామ అల్లుడు కలిసి జలద్రోహం చేశారని ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్ విమర్శించారు. సిఎల్‌పి కార్యాలయంలో శనివారం విలేఖరులతో మాట్లాడుతూ బనకచర్ల పైన హరీష్ రావు బాగోతం బయటపడిందనే బుకాయింపు మాటలు మాట్లాడుతున్నాడని ఎద్దేవాచేశారు. మామ, అల్లుడు కలిసి తెలంగాణకు చేసిన జల ద్రోహాన్ని మా ముఖ్యమంత్రి బయటపెట్టారని వివరించారు. పదేళ్లు అధికారంలో ఉండి అడ్డగోలుగా వ్యవహరించిన కేసీఆర్, హరీష్ రావు ఇప్పుడు నీతి వ్యాఖ్యాలు వల్లిస్తున్నారని అన్నారు. తెలంగాణ సెంటిమెంట్ రగిలించడానికి బనకచర్ల అంశాన్ని ఉపయోగించుకునే నీచ ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బనకచర్ల ప్రాజెక్టు ను మా ప్రభుత్వం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని ఆయన ప్రకటించారు. ఇప్పటికే మా ముఖ్యమంత్రి, నీటిపారుదల శాఖ మంత్రి కేంద్రానికి ఫిర్యాదు చేశారని తెలిపారు. చర్చల ద్వారా పరిష్కారం కాకపోతే సుప్రీం కోర్టు కు కూడా వెళ్తామని శ్రీనివాస్ అన్నారు. తెలంగాణ రైతుల ప్రయోజనాల విషయంలో ఎవరితోనూ రాజీ పడమని కెసిఆర్, హరీష్ రావు గతంలో రాజీ పడ్డారని చెప్పారు. గోదావరి లో మిగులు జలాలు ఎవరు వాడుకున్నా మాకు అభ్యంతరం లేదని కెసిఆర్ ఆంధ్రప్రదేశ్ పాలకులకు బనకచర్ల ఆలోచన కల్పించారని ఆయన అన్నారు. 3000 టీఎంసీ ల నీళ్లు వృధా గా పోతున్నాయని కెసిఆర్ గతంలో పదే పదే చెప్పాడని అందుకే ఇప్పుడు ఆ మిగులు జలాల ఆధారంగానే ఆంధ్ర ప్రదేశ్ బనకచర్ల నిర్మిస్తోందని ఇది కెసిఆర్ పాపమే అని ఆయనఅన్నారు. కెసిఆర్, హరీష్ రావు ఇచ్చిన రూట్ మ్యాప్ తోనే ఆంధ్ర ప్రదేశ్ ముందుకు వెళ్తోందని అన్నారు. గతంలో జగన్ ను నాలుగు సార్లు ప్రగతి భవన్ కు పిలిచి కెసిఆర్ చర్చలు జరిపారు. కెసిఆర్ జగన్ కు నీటి పాఠాలు చెప్పాడు ఇద్దరు కలిసి రాయలసీమను రతనాల సీమ చేస్తానని చెప్పుకున్నారని గతాన్ని గుర్తుచేశారు. ఇప్పుడు చంద్రబాబు నాయుడుతో చర్చలు జరుపుతామంటే మాత్రం హరీష్ రావు తెగ ఎగిరిపడుతున్నాడు. చర్చలతో సమస్యలు పరిష్కరించుకుందాం అని చంద్రబాబు నాయుడు కూడా ఇప్పటికే మాట్లాడారు. అవసరమైతే ఢిల్లీ లో కూర్చుందామని ఆయన ప్రతిపాదించారని ఆదిశ్రీనివాస్ వివరించారు. దీని పైన మా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. తొమ్మిది రోజుల్లో 9 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతాల్లో వేస్తున్నామని తెలిపారు. సీజన్ కు ముందు పెట్టుబడి సాయం అందడంతో రైతులంతా సంతోషంగా ఉన్నారు.. .ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెలంగాణ రైతుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నామని అన్నారు.

## నాకు మంత్రి పదవి కావాలి

### ఎఐసిసి అధ్యక్షుడు ఖర్గేకు రామ్మోహన్‌రెడ్డి విన్నపం

**హైదరాబాద్, జూన్ 21, ప్రభాతవార్త:** 'కాంగ్రెస్ పార్టీకి వినయవిధేయతగా పనిచేస్తున్నాను నాకొక మంత్రి పదవి కావాలి అంటూ పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షుడు రామోహ్మన్‌రెడ్డి అభ్యర్థించారు. శనివారం ఢిల్లీలో అఖిలభారత కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేను పరిగి ఎమ్మెల్యే డిసిసి అధ్యక్షులు రామ్మోహన్ రెడ్డి కలిశారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు తనకు మంత్రి వర్గం లో అవకాశం కల్పించాలని కోరారు. మంత్రి పదవి పొందడానికి



తనకు ఉన్న అర్హతలు వివరిసూ ఖర్గేకు ఒక అభ్యర్థన లేఖ రామ్మోహన్ రెడ్డి అందించారు. తెలంగాణ ఏర్పడ్డ తర్వాత 2014, 2023 ఎన్నికల్లో 2 సార్లు తను విజయం సాధించానని ఆయన తెలిపారు. 2014 ఎన్నికల్లో గెలిచి ఇప్పుడు మళ్లీ గెలిచిన అందరికి మంత్రివర్గంలో అవకాశం వచ్చిందని ఆయన వివరించారు. తనకు కూడా అవకాశం ఇవ్వాలని విజ్ఞప్తి చేసారు.

## గాలిలోనే పేలిపోయిన హాట్ ఎయిర్‌బెలూన్

### 8 మంది మృతి, 13 మందికి గాయాలు

**బ్రాసిలియా,జూన్ 21:** బ్రెజిల్ గగనతలంలో ఘోరప్రమాదంజరిగింది. గాలిలో తేలుతున్న ఒక హాట్ ఎయిర్‌బెలూన్‌లో మంటలు చెలరేగి అమాంతం కిందపడిపోయింది ఈ ఘటనలో ఎనిమిది మంది మృతిచెందారు. మరో 13 మంది గాయపడ్డారు. బ్రెజిల్‌లోని శాంటా కేథరినాలో ఓ హాట్ ఎయిర్‌బెలన్ గగనవిహారంకోసం గాల్లోకి ఎగిరింది. అందులో పైలట్‌సహా 21 మందివరకూ ఉన్నారు. కాసేపటికే హాట్ ఎయిర్‌బెలూన్‌లో మంటలుచెలరేగాయి. చూస్తుండగానే మంటలు వ్యాపించి ఆ బెలూన్ మంటలు చెలరేగుతూ కిందకు పడిపోయింది. ఈ ఘటనలో ఎనిమిది మంది స్పాట్‌లోనే చనిపోయారు. మరో 13 మందికి గాయాలు కావడంతో వారిని సమీపంలోనిఆసుపత్రికి తరలించారు. ఎయిర్‌బెలూన్‌కాలిపోతున్న దృశ్యాలు నెట్టింట చక్కర్లు కొడుతున్నాయి. ఈప్రమాదంపై స్థానిక గవర్నర్ జోర్గిన్హోమెల్లో దిగ్భ్రాంతి వ్యక్తంచేసారు. సహాయకబృందాలు రంగంలోకి దిగి చర్యలు చేపట్టాయన్నారు. బ్రెజిల్‌లో గత ఆదివారంకూడా ఓ హాట్ ఎయిర్‌బెలూన్ కూలిపోయింది. ఈఘటనలో ఒకమహిళ మృతిచెందగా 11 మంది తీవ్రగాయాలపాలయ్యారు.

## చంద్రబాబు గురించి జలాలను పణంగా పెడితే ఊరుకునేది లేదు: దాసోజు శ్రవణ్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి,హైదరాబాద్,జూన్21:** సీఎం రేవంత్ రెడ్డి చిల్లర మాటలకు చిరునామామా మారారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ మండిపడ్డారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుతో పాటు బీఆర్ఎస్ నేతలపై నరనరాన విషం నింపుకుని రేవంత్‌రెడ్డి మాట్లాడుతున్నాడని ఆయన ధ్వజమెత్తారు. శనివారం తెలంగాణ భవన్‌లో దాసోజు శ్రవణ్ మీడియాతో మాట్లాడుతూ నరేంద్ర మోదీని నొప్పించకుండా.. చంద్రబాబును మెప్పించాలి అనే ధోరణితో రేవంత్ రెడ్డి వ్యవహరిస్తున్నారు. మిడిమిడి జ్ఞానంతో మిడతలా ఎగిసిపడుతున్నాడని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రజల గురించి రేవంత్ రెడ్డికి పట్టదా..? అని ప్రశ్నించారు. చంద్రబాబుకు రేవంత్ రుణపడి ఉండాలి తప్పు లేదు. కొడం గల్‌లోనో, నీ ఫార్మ్ హౌజ్‌లో చంద్రబాబు గుడి కట్టుకో తప్పులేదు. చంద్ర బాబు గురించి గోదావరి, కృష్ణా జలాలను ఫణంగా పెడితే మాత్రం ఊరుకునేది లేదని హెచ్చరించారు.

# కురుక్షేత్రలో ఘనంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవం

### బాబా రామ్‌దేవ్ మార్గదర్శకత్వంలో పెద్దఎత్తున యోగా కార్యక్రమం

### పాల్గొన్న హార్యానా సిఎం నయాబ్‌సింగ్ సైని, గవర్నర్ బండారు దత్తాత్రేయ



**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 21:** ఈ సంవత్సరం అంతర్జాతీయ యోగా దినోత్సవం థీమ్ 'ఒక భూమి, ఒక ఆరోగ్యం' పూజ్య స్వామి రామ్‌దేవ్ జీ మహారాజ్ మార్గదర్శకత్వంలో, 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని హర్యానాలోని కురుక్షేత్రలో పతంజలి యోగపీఠ్, హర్యానా యోగా కమిషన్, ఆయుష్ విభాగం సంయుక్తంగా శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా, స్వామి రామ్‌దేవ్ జీ మహారాజ్, ఆచార్య బాలకృష్ణ జీ మహారాజ్. హర్యానా ముఖ్యమంత్రి నయాబ్ సింగ్ సైని, గవర్నర్ బండారు దత్తాత్రేయ అభ్యాసకులకు యోగాభ్యాసం నిర్వహించారు. దీనితో పాటు, పతంజలి యోగా సమితి ద్వారా దేశంలోని 650 జిల్లాల్లో కామన్ యోగా ప్రోటోకాల్ కింద ఉచిత యోగా శిక్షణ ఇచ్చారు. పవిత్ర భూమి కురుక్షేత్రంలో 1 లక్ష మందికి పైగా యోగా అభ్యాసకులు కలిసి యోగా సాధన చేయడం ద్వారా కొత్త రికార్డు సృష్టించారు. హరిద్వార్‌లోని పతంజలి వెల్నెస్, పతంజలి యోగపీఠ్ భారీ ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో, యోగా, షట్కర్మ విభాగం అధిపతి డాక్టర్ సచిన్ త్యాగి మార్గదర్శకత్వంలో కామన్ యోగా ప్రోటోకాల్ కింద యోగా సెషన్ ప్రారంభించబడింది. ప్రార్థన తర్వాత, సెషన్ మెడ, మోకాలు, భుజాలకు సూక్ష్మ వ్యాయామాలతో ప్రారంభమైంది. దీని తర్వాత, నిలబడి చేయవలసిన ఆసనాలలో తడసనాన్ని అభ్యసిస్తున్నప్పుడు, డాక్టర్ త్యాగి తడసన పిల్లల ఎత్తును పెంచుతుందని, వెన్నెముకను బలంగా ఉంచుతుందని, మొత్తం శరీరానికి స్థిరత్వాన్ని అందిస్తుందని చెప్పారు. వృక్షాసనం నాడీకండరాల సమన్వయాన్ని మెరుగుపరుస్తుంది, శారీరక సమతుల్యత చురుకుదనాన్ని పెంచుతుంది, కాలి కండరాలను బలపరుస్తుంది. ఆ తర్వాత పాధస్థాసం, అర్ధచక్రాసనం, త్రికోణాసనం సాధన చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వాటి సాధనతో పాటు వివరించారు. కూర్చొని చేయాల్సిన ఆసనాల్లో భద్రాసనం, వజ్రాసనం, అర్ధ ఉష్ట్రాసనం, శశకాసనం, ఉత్తన్ మండూకాసనం, వక్రాసనం వంటివి అభ్యసించారు. కడుపునిండా పడుకుని చేయాల్సిన ఆసనాలలో మకరాసనం, భుజంగాసనం, శలభాసనం సాధన చేశారు. వీపుపై వేయాల్సిన ఆసనాల్లో సేతుబంధాసనం, ఉత్తానప దాసనం, అర్ధహలాసనం, పవనముక్తాసనం సాధన చేశారు. వెన్నునొప్పి, వెన్ను సంబంధిత వ్యాధుల్లో అర్ధ ఉష్ట్రాసనం, మకరాసనం, సేతుబంధాసనం, అర్ధ మత్స్యాసనం, పశ్చిమోత్తనాసనం వంటివి మేలు చేస్తాయని డాక్టర్ త్యాగి తెలిపారు. దీని తరువాత, ప్రాణాయామం, కపలాభతి, భ్రమరి, భస్త్రిక, అనులోమవిలోమ ప్రాణాయామం క్రమంలో చేశారు. ధ్యాన సెషన్ తర్వాత, హాజరైన అన్ని యోగా అభ్యాసకులను క్రమం తప్పకుండా యోగా చేస్తానని ప్రతిజ్ఞ చేయించారు. యోగా సెషన్ శాంతి పాఠ్తో ముగిసింది. కార్యక్రమాన్ని విజయవంతంగా సమన్వయం చేస్తూ, పతంజలి వెల్నెస్ సర్వీస్ హెడ్ స్వామి బజరంగ్‌దేవ్ మాట్లాడుతూ యోగా అనేది ఒక సాటిలేని జ్ఞానం అని అన్నారు. యోగా అనేది కేవలం ఒక వ్యాయామం మాత్రమే కాదు, మొత్తం ఆరోగ్యానికి అనువైన జీవనశైలి. ప్రస్తుత కాలంలో, కాలుష్యం కారణంగా, గాలి, నీరు కూడా కలుషితమయ్యాయి, అటువంటి పరిస్థితిలో, యోగా ఆరోగ్యకరమైన ఆనందకరమైన జీవితానికి కీలకం. నాభి మొత్తం శరీరానికి కేంద్రంగా ఉన్నట్లే, పతంజలి యోగపీఠం ఈ మొత్తం ప్రపంచంలో యోగా ఏకైక ప్రపంచ కేంద్రమని పేర్కొన్నారు.. మతం, మతం, కులం, సమాజానికి అతీతంగా మత సామరస్యాన్ని స్థాపించడంలో యోగాకు పెద్ద పాత్ర ఉందని ఆయన అన్నారు. యోగా అన్ని మతాలను వర్గాలను కలుపుతుంది. ఈ సందర్భంగా, చీఫ్ జనరల్ మేనేజర్ (ట్రస్ట్) బ్రిగేడియర్ (రిటైర్డ్) టి.సి. మల్హోత్రా, పతంజలి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ డాక్టర్ మయాంక్ అగర్వాల్, రిజిస్ట్రార్ అలోక్ కుమార్ సింగ్, మానవ వనరుల అధిపతి తరుణ్ రాజ్పుత్, పతంజలి విశ్వవిద్యాలయం పరీక్షల కంట్రోలర్ డాక్టర్ ఎ.కె. సింగ్, పతంజలి పరిశోధనా సంస్థ ఉపాధ్యక్షుడు డాక్టర్ అనురాగ్ వర్ష్నే, పతంజలి ఆయుర్వేద కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ అనిల్ కుమార్, పతంజలి ఆయుర్వేద ఆసుపత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అరుణ్ కుమార్ పాండే, డాక్టర్ దయాశంకర్, పతంజలి వెల్నెస్ సీనియర్ డాక్టర్ డాక్టర్ కనక్ సోని, డాక్టర్ సత్య ప్రకాష్ మిశ్రా తదితరులు పాల్గొన్నారు.

# 'తెల్ల పులిపిల్లకు మెగా మనవరాలి పేరు'

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, ఉపాసన కొణిదెల కుమార్తె క్లీంకార ఎప్పటికప్పుడు అభిమానుల మనసులను గెలుచుకుంటూ వస్తోంది. ఆమె రెండో పుట్టినరోజును జరుపుకుంది. ఈ సందర్భంగా, ఆమె జీవితంలో మెమరబుల్ మూమెంట్ చోటు చేసుకుంది. గత సంవత్సరం హైదరాబాద్ జూ పార్క్‌కు వెళ్లిన సమయంలో, రామ్ చరణ్, ఉపాసనా, చిన్నారి క్లీంకార ఒకనవజాత తెల్లబంగాళా పులి పిల్లను చూశారు. ఆ ప్రత్యేక క్షణాన్ని గుర్తుగా ఉంచుతూ, జూ అధికారులు ఆ పులి పిల్లకి క్లీంకార అనే పేరు పెట్టారు. ఇది వారి కుటుంబం జీవుల పట్ల చూపించే ప్రేమకు ఒక చిహ్నంగా నిలిచింది. తన రెండో పుట్టినరోజు సందర్భంగా, క్లీంకార మొదటిసారిగా తన పేరును కలిగి ఉన్న తెల్ల పులిని ప్రత్యక్షంగా చూసింది.



ఆ చిన్నారి, తెల్లటి పులిని మైమరచి చూడటాన్ని చూసిఅందరూ ఆనంద పడ్డారు. ఇది చిన్నారి కన్నులలో ఆశ్చర్యం, ప్రకృతితో కలిసి పోయే అనుబం ధాన్ని గుర్తు అరుదైన క్షణంగా నిలిచింది. జంతువుల పట్ల సహాను భూతి, ప్రేమను ఎప్పుడూ చూపిస్తూ ఉండే రామ్ చరణ్, ఉపాసనా అధికారికంగా ఆ పులిని దత్తత తీసుకున్నారు. హైదరాబాద్ జూకు వారు అందిస్తున్న మద్దతు, జంతు సంరక్షణ పట్లవారి నిబద్ధతకు నిదర్శనంగా నిలుస్తోంది. ఈపుట్టినరోజు వేడుక ఒక కుటుంబానికే కాదు, మనం ప్రకృతితో కలిసికట్టుగా జీవించాలన్న, ఇతర జీవుల రక్షణ బాధ్యత మనపై ఉందని గుర్తు చేసింది.


# జులై 24న 'హరి హర వీరమల్లు'

పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ చారిత్రక యోధుడిగా కనువిందు చేయనున్న ప్రతిష్టాత్మక చిత్రం హరి హర వీరమల్లు. ప్రముఖ నిర్మాత ఎ.ఎం. రత్నం సమర్పణలో మెగా సూర్య ప్రొడక్షన్స్ పతాకంపై ఎ.దయాకర్ రావు నిర్మిస్తున్న ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి, జ్యోతి కృష్ణ దర్శకులు. ఆస్కార్ విజేత ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్నారు. నిధి అగర్వాల్ కథానాయికగా నటిస్తున్న హరి హర వీరమల్లులో బాబీ డియోల్ ముఖ్య పాత్ర పోషిస్తున్నారు. పవన్ కళ్యాణ్ మొదటిసారి చారిత్రక యోధుడిగా నటిస్తుండటంతో పాటు, భారీ బడ్జెట్ తో పాన్ ఇండియా చిత్రంగా రూపొందుతుండటంతో హరి హర వీరమల్లుపై భారీ అంచనాలున్నాయి. ప్రపంచవ్యాప్తంగా సినీ ప్రియులు, పవన్ కళ్యాణ్ అభిమానులు ఈ సినిమా కోసం ఎంతో



ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ చిత్రం నుంచి ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, గీతాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. గ్లింప్స్, టీజర్‌లో యోధుడిగా కనిపించిన పవన్ కళ్యాణ్ లుక్‌కి, అద్భుతమైన విజువల్స్‌కి విశేష స్పందన లభించింది. మాట వినాలి, కొల్లగొట్టినాదిరో, అసుర హననం, తార తార గీతాలు ఒక దానిని మించి మరొకటి శ్రోతలను మెప్పించాయి. రికార్డు వ్యూస్‌తో సామాజిక మాధ్యమాల్లో సంచలనాలు సృష్టిస్తున్నాయి.హరి హర వీరమల్లు నుంచి వచ్చే ప్రతి కంటెంట్ సినిమా పై అంచనాలు పెంచేస్తోంది. ఆ అంచనాలకు తారాస్థాయికి తీసుకెళ్ళేలా.. అందరూ ఎంతగానో ఎదురుచూస్తున్న ట్రైలర్ త్వరలో విడుదల కాబోతుంది. అంతేకాదు, చిత్ర విడుదల తేదీని కూడా తాజాగా నిర్మాతలు ప్రకటించారు. ఈ చిత్రం జూలై 24వ తేదీన తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో విడుదలకానుంది. ఈ చిత్రానికి మనోజ్ పరమహంస మరియు జ్ఞాన శేఖర్ వి.ఎస్. ఛాయాగ్రాహకులుగా వ్యవహరిస్తున్నారు. ప్రవీణ్ కె.ఎల్. ఎడిటింగ్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ప్రముఖ కళా దర్శకుడు తోటతరణి నభూతో నభవిష్యతి అన్న చందాన అద్భుతమైన సెట్‌లను రూపొందించారు. చారిత్రాత్మక నేపథ్యంలో అద్భుతమైన నాటకీయత, శక్తివంతమైన ప్రదర్శనలు, ఉత్కంఠ భరితమైన యాక్షన్‌తో రూపొందింది.

# 'కన్నప్ప' లార్డ్ ఆఫ్ ద రింగ్స్ వర్షన్



మంచు విష్ణు

ఎంతగానో ఎదురు చూడ బడుతున్న పౌరాణిక నాటకం కన్నప్ప ఈ నెలాఖరుకు థియేటర్లలో విడుదలకు సిద్ధంగా ఉంది. మోహన్ లాల్, ప్రభాస్, విష్ణు మంచు, అక్షయ్ కుమార్, కాజల్ అగర్వాల్, మొదలైనవారు నటించన్న ఈచిత్రానికి ముఖేష్ కుమార్ సింగీత దర్శకత్వం వహించారు. మంచు ఇటీవల ఐఎండిబి యొక్క ఒరిజి నల్ సీరీస్ బిహైండ్ ది సీన్స్‌లో కనిపించారు. ఇక్కడ ఆయన ఈ చిత్రములో ఏముంది మరియు ప్రేక్షకులు ఏమి ఆశించవచ్చు అనే విషయాలను పంచుకున్నారు. కన్నప్ప భారత దేశములో జరిగిన నిజమైన కథ. ఇది శివుడికి అత్యంత గొప్ప భక్తుడిగా మారిన నాస్తికుడి కథ. ఇది ఒక స్వీయ సాక్షత్కార ప్రయాణము, ఈ కథ విన్నప్పుడు నేను స్క్రిప్ట్ లోని అర్థం స్పష్టంగా ప్రతి ధ్వనించింది. స్క్రిప్ట్ గురించి 10 సంవత్సరాలు పనిచేసిన తరువాత, ఇప్పుడు దీన్ని మీ ముందుకు తీసుకొనివచ్చి, నేను మీ ముందు ఉన్నాను అని మంచు అన్నారు. ఈ చిత్ర నిర్మాణము వెనుక ఉన్న ప్రేరణ గురించి మాట్లాడుతూ, మంచు ఇలా అన్నారు, 2014లో, ఒక స్క్రీన్ ప్లే రచయిత ఈ చిత్రాన్ని తీయాలని అనుకొని నన్ను కలిశారు. ఆయన నాకు కథ వినిపించినప్పుడు, నేను అప్పటికే దానిని జీవితము కంటే పెద్దదిగా చూశాను. అప్పటి నుండి, నా ప్రయాణము ప్రారంభం అయింది మరియు నేను స్క్రిప్ట్‌ను డెవలప్ చేయడం, ప్రీప్రొడక్షన్, స్టోరీబోర్డ్ మరియు అన్నిఅంశాలను మొదలు పెట్టాను. చిత్రములో చాలా భాగం కన్నప్ప నాస్తికుడు గానే ఉంటాడు. దీనిని ఎలా ముందుకు తీసుకెళ్ళాలి అనే ఆలోచనలతో నేను చిక్కుకుపోయాను. దీనిని వ్రాసేటప్పుడు, నేను పాత్ర పరంగా వ్రాశాను. కాని ఒక నటుడిగా, షూటింగ్‌కు ఒకరోజు ముందు, దీనిని తెరపైకి తీసుకొచ్చే ప్రయత్నములో, నేను అతనితో దీనిపై ఇంకా నాకు స్పష్టత లేదు అని చెప్పాను. ఆయన అప్పటికి మోనంగా ఉన్నారు, ఒక గంట తరువాత మళ్ళీ వచ్చారు.



రష్మిక మందన్న నయా లుక్

# 'కుబేర' సక్సెస్ మీట్

సూపర్ స్టార్ ధనుష్, కింగ్ నాగార్జున, రష్మిక మందన్న లేటెస్ట్ యునినామస్ బ్లాక్ బస్టర్ శేఖర్ కమ్ముల కుబేర. శేఖర్ కమ్ముల అమిగోస్ క్రియేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్‌తో కలిసి ఎస్‌విసిఎల్‌ఎల్‌పిపై సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్ మోహన్ రావు ఈ చిత్రాన్ని హై బడ్జెట్ హై ప్రొడక్షన్ వాల్యూస్‌తో నిర్మించారు. కుబేర తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో జూన్20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలై యునానిమస్ బ్లాక్ బస్టర్ విజయాన్ని అందుకొని అద్భుతమైన బుకింగ్స్‌తో సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ సక్సెస్ ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో కింగ్ నాగార్జున మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. మీడియా అందరికీ థాంక్యు. ఫస్ట్ టైం యునానమస్‌గా బ్లాక్ బస్టర్ రివ్యూలు వచ్చాయి. ఎందులోనూ 3 రేటింగ్‌కి తక్కువ లేదు. అంత యునానిమస్‌గా సినిమా అందరికీ నచ్చింది. నిర్మాతలు సునీల్, పుష్కర్ రామ్మోహన్ గారికి థాంక్యూ. శేఖర్‌తో నాకు ఎప్పటి నుంచో సినిమా చేయాలని ఉంది. సుమంత్, చైతన్య, అమల వీళ్లంతా పనిచేయడానికి ముందు నుంచే శేఖర్‌తో వర్క్ చేయాలని ఉండేడి. శేఖర్ కూడా ఖీమీతో ఒక స్టైలిష్, ఫ్యామిలీ సినిమా చేయాలని వుందని చెప్తుండేవారు. ఫైనల్‌గా మా కాంబినేషన్లో కుబేర వచ్చింది. ఇది బ్యూటిఫుల్ క్యారెక్టర్. నాకు ఎప్పటినుంచో ఒక కొత్త క్యారెక్టర్ చేయాలని ఉండేది. శేఖర్ సినిమాలన్నీ చూశాను. ఆయన క్యారెక్టర్‌కి అద్భుతంగా న్యాయం చేస్తారు. ఈ కథ వినగానే



నాది మెయిన్ కరెక్ట్ అనిపించింది. ప్రతి పాత్ర కూడా నేను చేసిన దీపక్ క్యారెక్టర్ చుట్టూనే తిరుగుతుంది. ఈ కథ వినగానే ఇది దీపక్ కథ అనిపించింది. శేఖర్ కూడా దీన్ని అలానే చెప్పారు. దీపక్ క్యారెక్టర్ ఆర్క్ అద్భుతంగా ఉంటుంది. అది నాకు చాలా నచ్చింది. ఈ సినిమాలో మిగతా క్యారెక్టర్ ఆర్క్స్ ఒకేలా ఉంటాయి. కానీ దీపక్ క్యారెక్టర్‌లో త్రీ షేడ్స్ ఇచ్చారు. అందుకే ఈ క్యారెక్టర్ బాగా నచ్చి ఒకే చెప్పాను. నాక్యారెక్టర్‌కి వచ్చిన రెస్పాన్స్ గొప్ప ఆనందంఇచ్చింది. ఫ్యాన్స్ కూడా చాలా హ్యాపీగా ఉన్నారు. మిస్సమ్మ మాయాబజార్ గుండమ్మ కథ ఈ సినిమా అన్నిట్లో కూడా హీరో ఎవరని చెప్పలేం. అందులో కథహీరో. అవన్నీ కూడా డైరెక్టర్ ఫిలిమ్స్. కుబేర కూడా అవుట్ అండ్ అవుట్ శేఖర్ కమ్ముల ఫిలిం. ఈ సినిమా కోసం ప్రాణం పోశారు. వెయిటింగ్ ఫర్ ద నెక్స్ట్. సినిమాని ఇంత పెద్ద బ్లాక్‌బస్టర్ చేసిన ఆడియన్స్ అందరికీ థాంక్యూ అన్నారు. డైరెక్టర్ శేఖర్‌కమ్ముల మాట్లాడుతూ, అందరికి నమస్కారం. చాలా ఎమోషనల్‌గా ఉంది. ఈ సినిమా కథ పుట్టినప్పటి నుంచి చాలా డిఫరెంట్‌గా చేద్దాం, హాలీవుడ్ స్థాయిలో తీద్దాం, రియల్ లొకేషన్స్‌లో చేద్దాం, ముంబైని కొత్తగా చూపిద్దామని ఆశ. నాగార్జున దగ్గరికి అదే ఆశతో వెళ్ళాము. చాలా డిఫరెంట్గా తీద్దామని ఆయనకి చెప్పాను.

# 'బకాసుర రెస్టారెంట్' నుంచి సాంగ్ రిలీజ్

పలు విజయవంతమైన చిత్రాలతో మంచి నటుడిగా, కమెడియన్‌గా అందరికి సుపరిచితుడైన ప్రవీణ్ ప్రధానపాత్రలో రూపొందుతున్న చిత్రం బకాసుర రెస్టారెంట్, ఈ చిత్రంలో వైవా హర్ష టైటిల్ రోల్‌లో నటిస్తున్నారు. కృష్ణభగవాన్, షైనింగ్ ఫణి, కేజీఎఫ్ గరుడరామ్, ఇతర ముఖ్య పాత్రలో యాక్ట్ చేస్తున్నారు. ఎస్‌జే శివ దర్శకుడిగా పరిచయం కాబోతున్న ఈ చిత్రాన్ని ఎస్‌జే మూవీస్ పతాకంపై లక్ష్మయ్య ఆచారి, జనార్ధన్ ఆచారి ఈ సినిమాను నిర్మిస్తున్నారు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం విడుదలకు సిద్ధమైంది.



హంగర్ కామెడీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రం ట్రైలర్‌ను ఇటీవల విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ ట్రైలర్‌కు మంచి స్పందన వస్తోంది. తాజాగా ఈ చిత్రం నుంచి అయ్యో ఏమీరా ఈ జీవితం అనే లిరికల్ వీడియో సాంగ్‌ను బ్లాక్‌బస్టర్ మాస్ దర్శకుడు హరీష్ శంకర్ విడుదల చేశారు. వికాస బడిసన స్వరాలు సమకూర్చిన ఈ పాటను ప్రముఖ గాయకుడు రాహుల్ సిప్లిగంజ్ ఆలపించాడు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ, ఇదొక యూత్‌ఫుల్ సాంగ్. రాహుల్ సిప్లిగంజ్ తన స్వరంతో ఈ పాటకు మరింత వన్నె తెచ్చాడు. వికాస బడిస స్వరాలు ఆకట్టుకునే విధంగా ఉంటాయి. సినిమాలో ప్రతి సన్నివేశం ఆడియన్స్‌కు థ్రిల్లింగ్‌తో పాటు వినోదాన్ని కూడా పంచుతుంది. ఓ ఇన్నోవేటివ్ కాన్సెప్ట్‌తో రూపొందుతున్న ఈ చిత్రం తప్పకుండా అందర్ని అలరిస్తుందనే నమ్మకం ఉందిఅతి త్వరలో చిత్ర విడుదల తేదీని ప్రకటిస్తాం అన్నారు. ప్రవీణ్, వైవా హర్ష, షైనింగ్ ఫణి (బమ్‌చిక్ బంటి), కేజీఎఫ్ గరుడ రామ్, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, ఉప్పెన జయకృష్ణ, వివేక్ దండు, అమర్, రామ్‌పటాస్, రమ్య ప్రియ, ప్రాచీ ఠాకూర్, జబర్ధస్త్ అప్పారావు తదితరులు.

# జులై 11న 'ది 100' విడుదల

మొగలి రేకులు ఫేమ్ హీరో ఆర్‌కె సాగర్ అప్ కమింగ్ ఎమోషనల్ యాక్షన్ థ్రిల్లర్ ది 100. రాఘవ్ ఓంకార్ శశిధర్ దర్శకత్వం వహిస్తున్నారు. క్రియా ఫిల్మ్ కార్ప్, దమ్మ ప్రొడక్షన్స్ బ్యానర్‌లపై రమేష్ కరుటూరి, వెంకీ పూశడపు, జె తారక్ రామ్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. భారత మాజీ ఉపరాష్ట్రపతి శ్రీ వెంకయ్య నాయుడు గారు లాంచ్ చేసిన ఫస్ట్‌లుక్ పోస్టర్, మెగా మదర్ శ్రీమతి కొణిదెల అంజనాదేవి లాంచ్ చేసిన టీజర్‌కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. మేకర్స్ సినిమా రిలీజ్ డేట్‌ని అనౌన్స్ చేశారు. జూలై 11న ఈ సినిమా థియేటర్స్‌లో విడుదల కానుంది. అలాగే ఈ సినిమా నుంచి హే మేఘలే సాంగ్‌ని లాంచ్ చేసిన మ్యూజిక్ ప్రమోషన్స్‌ని కిక్ స్టార్ట్ చేశారు. ఈ చిత్రంలో ఆర్కే సాగర్ విక్రాంత్ నటిస్తున్నారు. వ్యవస్థను సవాల్ చేయడాన్ని భయపడని డేరింగ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించనున్నారు. హే మేఘలే పాటకు హర్షవర్ధన్ రమేశ్వర్ సంగీతాన్ని సమకూర్చగా, శ్రీ హర్ష ఎమ్మానీ లిరిక్స్ రాశారు. ఈ పాట ద్వారా హీరో సమాజంలోని చీకటి శక్తులకు వ్యతిరేకంగా చేసే పోరాటం, అంకితభావంను అద్భుతంగా చూపించారు. రేవంత్, సాహితి చాగంటి ఆలపించిన ఈ పాత, ప్రేక్షకుల మనసుని తాకుతుంది. ఇది విక్రాంత్‌ని ఓ గ్లింప్స్ లా ప్రజెంట్ చేస్తూ సినిమా మీద మరింత ఆసక్తిని రేకెత్తించింది. ఈ చిత్రంలో ఆర్‌కే సాగర్‌కు జోడీగా మిషా నారంగ్ కథానాయికగా నటిస్తుండగా, ధన్య బాలకృష్ణ కీలక పాత్ర పోషిస్తున్నారు. ఈ సినిమాకు టాప్ టెక్నికల్ పని చేస్తోంది శ్యామ్ కె. నాయుడు సినిమాటోగ్రఫీని, హర్షవర్ధన్ రమేశ్వర్ మ్యూజిక్‌ను, అమర్ రెడ్డి కుడుముల ఎడిటింగ్‌ను, చిన్నా ప్రొడక్షన్ డిజైన్‌ను, సుధీర్ వర్మ పెరిచర్ల డైలాగ్స్‌ను అందించారు. సాంగ్ లాంచ్ ఈవెంట్‌లో హీరో ఆర్కే సాగర్ మాట్లాడుతూ, అందరికీ నమస్కారం. నా జర్నీ గురించి మీ అందరికీ తెలుసు. టీవీ నాకు ఆర్కే నాయుడు లాంటి అద్భుతమైన ఇమేజ్ ఇచ్చిం ది. సినిమాల్లోకి వచ్చి న తర్వాత కొన్ని క్యారెక్టర్స్ చేశాను. కానీ చాలా మంది అభిమానులు, ఇండస్ట్రీ శ్రేయోభిలాషులు మీకు యూనిఫాం ఉన్న క్యారెక్టర్ సూట్ అవుతుంది. అలాంటి క్యారెక్టర్ చేయండిఅని కోరారు. దానికి సరైన కంటెంట్ కోసం ఎదురు చూస్తూ ఉండగా ఈ సినిమా వచ్చింది.





# 'సతీ లీలావతి' ఫస్ట్ లుక్ రిలీజ్

నేటి కాలంలో కుటుంబ వ్యవస్థ బలహీన పడుతోంది. అందుకు కారణం మనుషుల మధ్య ఎమోషన్స్ లేకపోవటమే.. భావోద్వేగాలే బంధాలను కలకాలం నిలుపుతాయి. రెండు వేర్వేరు కుటుంబాలు, నేపథ్యాల నుంచి వచ్చిన వ్యక్తులు కలిసి ప్రయాణించాలంటే వారి మధ్య ఎమోషన్స్ ఇంకెంత బలంగా ఉండాలో ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు. ఇలాంటి సునిశితమైన అంశాన్ని హృద్యంగా తెరకెక్కిస్తున్నారు దర్శకుడు తాతినేని సత్య. ఈయన దర్శకత్వంలో లావణ్య త్రిపాఠి, మలయాళ నటుడు దేవ్ మోహన్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం సతీ లీలావతి. ప్రముఖ నిర్మాణ సంస్థ



ఆనంది ఆర్ట్స్ సమర్పణలో దుర్గాదేవి పిక్చర్స్ బ్యానర్‌పై నాగమోహన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు భీమిలీ కబడ్డీ జట్టు, ఎస్.ఎం.ఎస్(శివ మనసులో శృతి) ఫేమ్ తాతినేని సత్య దీన్ని రూపొందిస్తున్నారు. భార్య, భర్త మధ్య ఉండే అనుబంధాన్ని ఎమోషనల్‌గానే కాకుండా ఎంటర్ టైనింగ్‌గానూ చెప్పే ప్రయత్నమే సతీలీలావతి చిత్రం. సినిమా చిత్రీకరణ పూర్తయ్యింది. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. అనుకున్న ప్లానింగ్ ప్రకారం మేకర్స్ సినిమాను శరవేగంగా పూర్తి చేసి సిని మాను విడుదలచేయటానికి మేకర్స్ సన్నా హాలు చేస్తున్నారు. ఫీల్ గుడ్ మూవీగా అందరినీ ఆకట్టుకునేలా, అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించేలా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఈమూవీకి సంగీత దర్శకుడిగా మిక్కీ జే మేయర్, కెమెరామెన్‌గా బినేంద్ర మీనన్, ఎడిటర్‌గా సతీష్ సూర్య పని చేస్తున్నారు. లావణ్య త్రిపాఠి, దేవ్ మోహన్ తదితరులు.

# ఇన్‌స్టా స్టార్ హీరోయిన్ 'కేతిక శర్మ'


కేతిక కవ్వింపుతో బేజారు హీరోయిన్‌గా ఇన్ని ఫ్లాప్స్ పడ్డా ఈ అమ్మడికి ఇన్‌స్టాగ్రామ్‌లో మంచి ఫాలోయింగ్ ఉంది. మూడున్నర మిలియన్‌ల కంటే ఎక్కువ మంది ఈమెను ఇన్‌స్టాగ్రామ్‌లో ఫాలో అవుతున్నారు. ఆకాష్ పూరి హీరోగా నటించిన రొమాంటిక్ సినిమాతో టాలీవుడ్‌లో 2021లో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ కేతిక శర్మ. మొదటి సినిమా కమర్షియల్‌గా పెద్దగా ఆకట్టుకోలేక పోయింది.అయినా కూడా లక్ కలిసి వచ్చి కేతిక శర్మకు ఆఫర్లు వచ్చాయి. అదే ఏడాదిలో లక్ష్య సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. నాగ శౌర్య హీరోగా నటించిన లక్ష్య సినిమాలో హీరోయిన్‌గా నటించడం ద్వారా కూడా కేతిక శర్మ సక్సెస్‌ను సొంతం చేసుకోలేక పోయింది. అయినా కూడా ఆఫర్లు మాత్రం వస్తూనే ఉన్నాయి. లక్ష్య సినిమా ఫ్లాప్ అయినప్పటికీ ఈ అమ్మడు 2022లో రంగ రంగ వైభవంగా సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఆ సినిమాలో మెగా హీరోకు జోడీగా నటించడం ద్వారా కచ్చితంగా హిట్ దక్కుతుందని ఆశించింది. కానీ అది కూడా ఫ్లాప్‌గానే మిగిలింది. రాజా సాబ్ షూటింగ్ అప్డేట్ ఇచ్చిన నిర్మాత

సాధారణంగా హీరోయిన్స్ మొదటి సినిమా ఫ్లాప్ అయితే మళ్లీ కనిపించరు. కానీ లక్కీగా ఈ అమ్మడు వరుసగా మూడు సినిమాలతో ఫ్లాప్‌లను చవిచూసినా కూడా అదృష్టం కలిసి వచ్చింది. ఏకంగా పవన్ కళ్యాణ్ మూవీ బ్రో లో ముఖ్య పాత్రలో నటించే అవకాశం దక్కింది. ఆ సినిమా పర్వా లేదు అన్నట్లుగా నిలిచినా కూడా ఈమెకు ఆఫర్లు పెద్దగా రాలేదు. ఆ సినిమా వల్ల కేతిక కెరీర్‌కి పెద్దగా ప్రయోజనం ఏమీ దక్కలేదు. ఆ తర్వాత కూడా ఒకటి రెండు సినిమాల్లో హీరోయిన్‌గా నటించినా అవి కూడా పెద్దగా ఆడలేదు. ఈ ఏడాదిలో రాబిన్ హుడ్‌తో పాటు సింగిల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. సింగిల్ సినిమా మంచి విజయం సొంతం చేసుకున్న నేపథ్యంలో మరిన్న ఆఫర్లు ఈ అమ్మడికి వస్తాయేమో



చూడాలి. పారితోషికంలో ఆ ఐదుగురు కోట్ల కుబేరులే! ప్రస్తుతం ఒక తమిళ సినిమాలో నటిస్తున్న ఈ అమ్మడు ముందు ముందు తెలుగులో కూడా మరిన్ని సినిమాలు చేసే అవకాశాలు ఉన్నాయి.

# రోజువారీ అలవాట్లలో అందం



**కొంతమంది ముఖంపై ఎంత వెతికినా ఒక్క మొటిమైనా కనిపించదు. ఇక నల్లమచ్చల జాడే దొరకదు. మేకప్ మాయజాలం లేకుండానే న్యాచురల్ బ్యూటీస్‌గా కనిపించేస్తుంటారు. ఇలాంటి వాళ్లను చూడగానే.. అందం కోసం ఎన్నెన్ని సౌందర్య చికిత్సలు తీసుకుంటారో అనిపిస్తుంటుంది. నిజానికి ఈ మహిమంతా చికిత్సలు, చిట్కాల్లో కాదు. వారు పాటించే రోజువారీ అలవాట్లలో ఉంటుందంటున్నారు నిపుణులు. మరి, అవేంటో తెలుసుకొని మనమూ పాటించేద్దామా!**

★ ఉదయం నిద్ర లేచిన వెంటనే, రాత్రి పడుకునే ముందు ఈ రెండు సందర్భాల్లో ముఖం శుభ్రపరచుకునేవారు చాలా తక్కువమంది. ముఖంపై మొటిమలు రావడానికి ఈ నిర్లక్ష్యమూ ఓ కారణమే అంటున్నారు నిపుణులు. అందుకే ఈ రెండు సందర్భాలతో పాటు.. చెమట ఎక్కువగా వచ్చినప్పుడు తప్పని సరిగా ముఖం శుభ్రం చేసుకోవాలంటున్నారు. ఫలితంగా ముఖంపై దుమ్ము, జిడ్డుదనం తొలగిపోయి చర్మ రంధ్రాలు మూసుకుపోవు. తద్వారా మొటిమలూ ఏర్పడవు. అయితే ఈ క్రమంలో చర్మతత్వానికి సరిపడే ఫేస్‌వాష్‌ను ఎంచుకోవడమూ ముఖ్యమే.

★ పబ్లిక్ టాయిలెట్ కంటే మొబైల్ స్క్రీన్ ఎక్కువ అపరిశుభ్రంగా ఉంటుందని పలు అధ్యయనాలు చెబుతున్నాయి. ఫోన్ మాట్లాడేటప్పుడు, మొబైల్‌ను తాకిన చేతులతోనే ముఖాన్ని తడుముకోవడం వల్ల ఈ క్రిములు ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. ఈ సమస్య దరిచేరకుండా.. ఫోన్ స్క్రీన్‌ను ఎప్పటికప్పుడు శానిటైజర్‌తో శుభ్రం చేసుకోవడం తప్పనిసరి అంటున్నారు నిపుణులు ★ చేతుల్ని పదే పదే ముఖానికి తాకించే అలవాటు కొంతమందికి ఉంటుంది. ఫలితంగా చేతులకున్న నక్రిములు, మురికి ముఖం పైకి చేరి మొటిమలకు కారణమవుతాయి. అందుకే ముఖం కడుక్కునేటప్పుడు తప్ప అసలు చేతుల్ని ముఖానికి తాకించకుండా జాగ్రత్తపడమంటున్నారు నిపుణులు.

★ రోజూ వాడే క్రమంలో మన చర్మం, జుట్టు కుదుళ్లలో ఉన్న జిడ్డు దిండు కవర్ల పైకి చేరుతుంది. అది వాతావరణంలోని దుమ్మును ఆకర్షిస్తుంది. ఈ అపరిశుభ్రమైన దిండ్లనే వారాల తరబడి వాడడం, ఇతరులు వీటిని ఉపయోగించడం వల్ల ముఖంపై మొటిమలొస్తాయి. కాబట్టి వారానికోసారైనా దిండ్ల కవర్లను మార్చుకోవడం, ఎవరి దిండు వారే వాడుకోవడం మంచిదంటున్నారు నిపుణులు.



★ మొటిమల బెడద లేని వారు. రోజువారీ తీసుకునే ఆహారం విషయంలోనూ కచ్చితంగా వ్యవహరిస్తారట. ఈ నక్రమంలో కాయగూరలు, ఆలివ్ నూనె, తృణ ధాన్యాలు, తక్కువ మొత్తంలో మాంసం వంటివి తీసుకుంటారట! వీటి ద్వారా చర్మానికి కావాల్సిన పోషకాలన్నీ అందుతాయంటున్నారు నిపుణులు.

★ అధిక బరువూ మొటిమల సమస్యకు దారితీస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో వీరి శరీరంలో ఆండ్రోజెన్లు, ఇన్సులిన్ స్థాయులు ఎక్కువగా ఉంటాయి. ఇవి మొటిమలు రావడానికి కారణమవుతాయి. కాబట్టి బరువును అదుపులో ఉంచుకోవడం వల్ల ఆరోగ్యమే కాదు అందం కూడా. □

# చూపు లేకపోయినా సాహసాలే శ్వాసగా !

**'అంధత్వం లోపం కాదు.. చూపు కూడా మంచిని చూడలేకపోవడమే అసలైన అంధత్వం' అన్నారు అమెరికన్ రచయిత హెలెన్ కెల్లర్. ఈ మాటల్నే స్ఫూర్తిగా తీసుకొని జీవితంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకోవాలనుకుంది హిమాచల్ ప్రదేశ్‌కు చెందిన చోంజిన్ ఆంగ్మో. ఎనిమిదేళ్ల వయసులో కంటి చూపు కోల్పోయిన ఆమె.. పర్వతారోహణే ప్రాణంగా పెరిగింది. చూపు లేకపోయినా ఎన్నో సాహసాలకు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచిన ఆంగ్మో.. ఇటీవలే మరో అరుదైన చరిత్ర లిఖించింది. ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించి.. దృష్టి లోపం ఉన్నా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా, ప్రపంచంలోనే ఐదో వ్యక్తిగా రికార్డు సృష్టించింది. మరి, ఆంగ్మోకు ఈ సాహసం ఎలా సాధ్యమైంది?**

**తెలుసుకుందాం..**

ఆంగ్మోది హిమాచల్ ప్రదేశ్‌లోని చంగో అనే మారుమూల గిరిజన గ్రామం. పుట్టినప్పుడు ఆమెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవు. కానీ వయసు పెరుగుతున్న కొద్దీ కంటి చూపు క్రమంగా మందగిస్తూ.. ఎనిమిదో ఏట చూపు పూర్తిగా కోల్పోయిందామె. అయితే చిన్నతనం నుంచి చురుగ్గా ఉండటం ఆంగ్మోకు అలవాటు! 'కంటి చూపు కోల్పోవడం నా జీవితంలో ఓ పెద్ద మలుపు. అయినా నేను ఎప్పుడూ దీన్ని బలహీనతగా చూడలేదు.. అంటూ మరోసారి తన ధైర్యాన్ని ప్రదర్శించింది ఆంగ్మో.

**అది నా చిన్ననాటి కల ....** పర్వతారోహణనే తన లక్ష్యంగా పెట్టుకున్నానంటోంది ప్రతి ఒక్కరికీ ఏదో ఒక లక్ష్యం. మోంటెనీరింగ్ నా చిన్ననాటి కల. కానీ ఆర్థిక స్థోమత లేక దృష్టి సారించలేకపోయా. ఇంతలో కంటి చూపు పోయింది.అయినా పట్టు వీడలేదు. 2016లో ఆటల్ బిహారీ వాజ్‌పేయి. మోంటెనీరింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో పర్వతారోహణలో శిక్షణ తీసుకున్నా. ట్రైనింగ్ పూర్తవడమే తరువాయి.. ఒక్కో పర్వతాన్ని లక్ష్యంగా చేసుకుని ఎక్కేస్తున్నా. ఈ కోరికనే మొదట లద్దాఖ్‌లోని Mt Kang Yatsac 2 పర్వత శిఖరాగ్రానికి చేరుకున్నది. ఆపై 'దివ్యాంగుల సాహస యాత్ర బృందం'లో భాగమై 6 వేల మీటర్ల పైచిలుకు ఎత్తున్న శిఖరాన్ని అధిరోహించా.. అంటూ తన మోంటెనీరింగ్ కెరీర్ ప్రారంభమైన తీరు గురించి చెబుతోంది పర్వతారోహకులు..

**ఆమె మాటలే నాకు స్ఫూర్తి...** ఇక గతేడాది అక్టోబర్‌లో ఎవరెస్ట్ బేస్ క్యాంప్‌నకు చేరుకొని దృష్టి లోపం ఉన్నా ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళగా నిలిచింది ఆంగ్మో. ఎప్పటికైనా ఎవరెస్టు అధిరోహించాలని కలలు కన్న ఆమె ఇటీవలే తన లక్ష్యాన్ని పూర్తి చేసుకుంది దృష్టి లోపంతో ఎవరెస్ట్ ఎక్కిన తొలి భారతీయ మహిళగా, ప్రపంచంలోనే ఐదో వ్యక్తిగా చరిత్రకెక్కింది. ప్రపంచంలోనే ఎత్తైన శిఖరంపై నిల్చొని మువ్వన్నెల కుతాను రెపరెపలాడించింది. అమెరికా రచయిత్రి దివ్యాంగుల హక్కుల పోరాట యోధురాలు హెలెన్ కెల్లర్ నాకు స్ఫూర్తి! 'అంధత్వం లోపం కాదు.. చూపు కూడా మంచిని చూడలేకపోవడమే అసలైన అంధత్వం' అన్నారామె. ఆ మాటల్నే నా మనసులో నింపుకొన్నా.. ఏ పని మొదలు పెట్టినా ఆత్మవిశ్వాసంతోనే ముందుకు సాగుతున్నా.." అంటోన్న ఆంగ్మో.. ఈ పట్టుదలతోనే ప్రపంచంలోనే అతి ఎత్తైన యుద్ధభూమి సియాచిన్ గ్లేసియానూ అధిరోహించింది. 2021లో చేపట్టిన 'ఆపరేషన్ బ్లూ ఫ్రీడమ్' అనే



సామాజిక కార్యక్రమంలో భాగంగా ప్రత్యేక అవసరాలున్న వ్యక్తుల బృందంతో కలిసి ఈ అరుదైన ఘనత సాధించింది ఆంగ్మో. అంతేకాదు.. ఈ బృందంలో తనొక్కరేనత మహిళ కావడం మరో విశేషం! ఇక భవిష్యత్తులో 'సెవెన్ సమిట్ ఛాలెంజ్ (ఏడు ఖండాల్లో ఏడు అతి ఎత్తైన పర్వతాలు అధిరోహించడం) పూర్తిచేయడమే తన లక్ష్యమంటోంది ఆంగ్మో.



**సాహసాలే శ్వాసగా..** అలల పాఠశాలలో కొన్ని ఆంగ్మో, ఢిల్లీ యూనివర్సిటీకి చెందిన 'మిరందా హౌస్'లో డిగ్రీ మాస్టర్స్ పూర్తి చేసింది. ప్రస్తుతం 'యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా'లో కస్టమర్ సర్వీస్ అసోసియేట్‌గా విధులు నిర్వర్తిస్తోన్న ఈ ఉమన్ మైంటెనీర్. ప్రస్తుతం పలు సాహస క్రీడల్లోనూ సత్తా చాటుతోంది. ఈ క్రమం రాష్ట్రస్థాయి ఈత పోటీల్లో, జాతీయ స్థాయి జూడో ఛాంపియన్‌షిప్‌లో పోటీపడి పలు పతకాలు గెలుచిన ఆంగ్మో. జోనల్, జాతీయ స్థాయుల్లో నిర్వహించిన ఫుడ్‌బాల్ క్రీడల్లోనూ సత్తా చాటింది. మరోవైపు మారథాన్లలోనూ చురుగ్గా పాల్గంటుందీ డేరింగ్ లేడీ. మనాలీ నుంచి ఖార్దుంగ్ లా పాస్ వరకు ఉన్న క్లిష్టమైన రహదారిపై మోటార్‌బైక్ నడిపింది ఆంగ్మో. కేవలం పదిరోజుల్లోనే ఈ సాహస యాత్ర పూర్తిచేసి ఆమె. పలు సైక్లింగ్ సాహసయాత్ర లోనూ పాల్గొని తన ధైర్య సాహసాల్ని ప్రదర్శించింది. ఇలా తన శారీరక లోపాల్ని అధిగమించి సాహస క్రీడల్లో పర్వతారోహణలో సరికొత్త రికార్డులు సృష్టిస్తోన్న ఆంగ్మోను గతేడాది రాష్ట్రపతి ముర్ము జాతీయ పురస్కారంతో సత్కరించారు. దీంతో పాటు పలు ప్రతిష్ఠాత్మక పురస్కారాలు ఆమెను వరించాయి. గతంలో ఓసారి 'మన్ కీ బాత్'లో భాగంగా ఆంగ్మో సాధించిన ఘనతల్ని ప్రస్తావిస్తూ ప్రధాని మోడీ ప్రశంసించారు. □



## తెలుసుకుందాం..

మహిళగానే కాదు, ఐపిఎస్‌కు ఎంపికయ్యాక కూడా వివక్షను ఎదుదర్కొన్నా. ఐపిఎస్ శిక్షణ తర్వాత నన్ను డెస్క్ వర్క్‌కే పరిమితం చేశారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు తీసుకునేంతవరకే వీటిని ఎదుర్కొన్నా. నేటి మహిళలకు ఎన్నో అవకాశాలు, సౌకర్యాలు. ఇప్పుడు వాళ్లకి కావాల్సింది స్పష్టత, సంకల్పం, అదే సమయంలో కెరియర్, కుటుంబం రెండింటినీ సరిగ్గా సమన్వయం చేసుకోవాలి. అప్పుడే జీవితంలో సంతోషం ఉంటుంది.

**-మంజరి జరూహార్, తొలితరం ఐపిఎస్ అధికారిని**

# ఇంట్లో ఈగల బెడదా?

ఇంట్లో ఈగల బెడద ఉందా! డైనింగ్ టేబుల్, వంటగట్టు మీద, గచ్చుపైనా, పెంపుడు



జంతువుల చుట్టూ వాలి ఇబ్బంది పెడుతుంటాయి. దీనినుంచి బయట పడాలంటే ఈ కింది చిట్కాలను పాటించేయండి. రెండు నిమ్మ చెక్కలను లీటరు వేడినీటిలో వేసి మరిగించాలి. ఆపై దానికి కొన్ని చుక్కలరోజ్‌మెరీ నూనెను కలిపి ఒక స్ప్రేబాటిల్లో పోసుకోవాలి. ఈగలు ఉన్నచోట చల్లితే సరి సమస్య పోవడమే కాదు పరిమళాలూ వెదజల్లుతాయి. కప్పు నీటికి, రెండుకప్పుల వెనిగర్, అరకప్పు నిమ్మరసం కలిపి ఇంట్లోనే ఈగల మందునూ తయారు చేసుకోవచ్చు. చిన్నపిల్లలు ఉంటే ఆహారపదార్థాలు కింద పడకుండా తినరు. సోఫా, కార్పెట్లు ఇలా ఎక్కడబడితే అక్కడ పడేస్తారు. వీటిని శుభ్రం చేయడమూ కష్టమే. ఇలాంటప్పుడు వంటసోడాను వీటిపై చల్లి మందపాటి బ్రష్‌తో రుద్ది, కొద్దిసేపయ్యాక దులిపేయాలి. దీంతో కంటికి కనిపించని ఈగల గుడ్లు కూడా తొలగిపోతాయి. □

# తండ్రిని మించిన ప్రేమను చూపిన యేసుక్రీస్తు..

'తండ్రి నన్ను ఏలాగు ప్రేమించెనో నేనును మిమ్మును అలాగు ప్రేమించితిని, నా ప్రేమ యందు నిలిచియుండుడి' (యోహాను 15:9), 'నా కుమారుడా, ప్రభువు చేయు శిక్షను తృణీకరింపకుము ఆయన నిన్ను గద్దించినప్పుడు విసుకకుము ప్రభువు తాను ప్రేమించువానిని శిక్షించి తాను స్వీకరించు ప్రతి కుమారుని దండించును' (హెబ్రీయులకు 12:5,6). ఇటీవలే 'ఫాదర్స్ డే' తండ్రుల దినోత్సవం జరిగింది. ఈలోకంలో తల్లి ప్రేమకు, తండ్రి ప్రేమకు వెలకట్టలేం. వారు మనకోసం, మన ఉన్నతికోసం తమ జీవితాలనే త్యాగం చేస్తారు. మన శ్రేయస్సుకోసం దివారాత్రులు కష్టపడతారు. అందుకే దేవుడు తన ప్రేమను తల్లిప్రేమతోను, తండ్రి ప్రేమతోను పోల్చాడు. యేసుక్రీస్తు ఈలోకంలో జీవించినంతకాలం తండ్రికి ఎంతో విధేయతతో జీవించాడు. ప్రతివిషయంలోనూ తండ్రి చిత్తాని తెలుసుకుని ప్రవర్తించాడు. మనం కూడా యేసుక్రీస్తు అడుగుజాడల్లో జీవించాలి. ఎందుకంటే ఆయన మనల్ని తన బిడ్డలుగా భావించాడు కాబట్టే మనకోసం ప్రాణాల్ని సిలువలో పెట్టాడు. దేవుడు మనల్ని ఎంతగా ప్రేమించాడు అంటే తన రక్తం చివరిబొట్టువరకూ మనకోసమే చిందించాడు. లోబడని పిల్లల కోసం ఆయన చేతులను చాపి పిలుస్తున్నాడు.

యేసుప్రభువు నిజమైన దేవుడని, ఆయన మనకోసం సిలువలో మరణించాడనే సత్యాన్ని తెలుసుకుని, ఆయనను క్షమించమని వేడుకుంటే, మనం ప్రభువు బిడ్డలుగా మారిపోతాం. ఆక్షణం నుంచి మనల్ని ప్రతివిషయంలోనూ సంరక్షిస్తూనే ఉంటాడు. మన అవసరాలను తీర్చడం మాత్రమే కాదు.. నిత్యం మనతోనే ఉంటాడు. దేవుడు మనల్ని తన అరచేతిలో చెక్కుకున్నాడు. 'తండ్రి తన కుమారులయెడల జాలిపడునట్లు యెహోవా తనయందు భయభక్తులు గలవారి యెడల జాలిపడును' (కీర్తన 103:13). మనం తప్పులు చేస్తే, నిజమైన పశ్చాత్తాపంతో క్షమించమని వేడుకుంటే దేవుడు క్షమిస్తాడు. అంతేకాదు, ఆ తప్పులు తిరిగి చేయకుండా ఉండేందుకు కావాల్సిన శక్తిని ఇస్తాడు. యేసుక్రీస్తు మనల్ని ప్రేమించినంతగా ఈలోకంలో ఎవరూ ప్రేమించలేరు. పిల్లల కోసం తల్లిదండ్రులు మరణించడం చాలా అరుదుగా జరుగుతుంది. అయితే దేవాదిదేవుడు లోకంలో జీవించే ప్రతిఒక్కరికోసం ఆయన రక్తాన్ని



ధారపోసాడు. ఆయన ప్రేమలో ఎలాంటి కల్మషం లేదు. ఈలోకంలో మనకోసం అన్నింటిని విడిచిపెట్టి జీవించాడు. యూదులు, పరిసయ్యుల అవమానాలను భరించాడు. చివరికి మరణించి, మూడవరోజున సజీవుడిగా లేచాడు. ఆ దేవుడి ప్రేమను గుర్తించి, ఆయన చెంతకు రావాలనే ప్రభువు ప్రగాఢ కాంక్ష. మనం ఆయనను ప్రేమించడం కాదు, ఆయనే మొదట మనల్ని ప్రేమించాడు. కాబట్టే మన జీవించకముందే లోకంలోని వారందరి కోసం మరణించాడు. ఆ సత్యాన్ని తెలుసుకుని, ప్రభువును సేవిస్తే, నిత్యరాజ్యం ఇస్తాడు. లేకపోతే అపవాదికి ఏర్పాటు చేసిన నిత్యనరకంలో మనం వేదనతో ఉండాలి. ఆ బాధ నుంచి విడిపించేందుకే దేవుడు మరణించాడు.'ఆ ఆత్మ కలిగినవారమై మనము-అబ్బా తండ్రీ అని మొఱ్ఱపెట్టుచున్నాము' (రోమ 8:15). నిజమే కదా మనకు ఏ కష్టం వచ్చినా, బాధకలిగినా వెంటనే దేవా..తండ్రీ అని పిలుస్తాం. ఎంత గొప్ప అనుబంధం మనకు దేవుడితో ఉందో గ్రహించవచ్చు. ఆ అనుబంధం నిరంతరం కలిగి ఉండాలని దేవుడి ఆకాంక్ష.

**-పి.వాణిపుష్ప**

అంతర్వాణి

# రుచికరమైన చికెన్ స్నాక్స్ !



## చైనీస్ చికెన్ నూడుల్స్ ..

**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్: ముప్పావు కిలో, కార్న్‌ఫ్లక్లర్: ఒకటిన్నర టేబుల్ స్పూన్లు, ఉప్పు: ముపానవపుటీస్పూను, నూనె: 4 టేబుల్ స్పూన్లు, నూడుల్స్ పావుకిలో, వెల్లుల్లితురుము: టేబుల్ స్పూను, ఎండుమిర్చి: మూడు, కాలీఫ్లవర్ రెమ్మలు, కప్పు: క్యాప్సికమ్ ముక్కలు, అరకప్పు, జీడిపప్పు: అరకప్పు,

సాస్‌కోసం: వినెగర్ : 2 టేబుల్‌స్పూన్లు, సోయాసాస్: టేబుల్‌స్పూను, చిల్లీసాస్: 3 టేబుల్‌స్పూన్లు, ఉప్పు: తగినంత.

**తయారు చేసే విధానం :** ○. జీడిపప్పుని వేయించి ఉంచాలి. తరవాత నీళ్ల వంపేసి చల్లని నీళ్లతో కడిగి పక్కన ఉంచాలి.

○. చికెన్ ముక్కల్ని కాసేపు ఆరనిచ్చాక వాటిమీద ఉప్పు,కార్న్‌ఫ్లోర్ చల్లాలి. బాణలిలో నూనె పోసి కాగాక కొంచెంకొంచెంగా చికెన్ ముక్కలు వేసి వేయించి తీయాలి. తరవాత మిగిలిన నూనె వంపేసి మూడు టేబుల్ స్పూన్లు మాత్రం ఉంచాలి. ఇప్పుడు అందులో వెల్లుల్లి తురుము, ఎండుమిర్చి వేసి వేగాక కాలీఫ్లవర్ రెమ్మలు, క్యాప్సికమ్ ముక్కలు వేసి వేయించాలి. తరవాత చికెన్ ముక్కలు వేసి, మూడు నాలుగు నిమిషాలు వేయించాక సాస్‌కోసం తీసుకున్నవన్నీ వేసి కలపాలి. ఇప్పుడు ఉడికించిన నూడుల్స్ వేసి బాగా కలపాలి. చివరగా వేయించిన జీడిపప్పు వేసి, ఇష్టమైతే కాస్త ఉల్లికాడల తురుము, నువ్వులు చల్లి దించాలి.

## పెప్పర్ చికెన్..



**కావలసినవి :** చికెన్ : అరకిలో, అల్లం వెల్లుల్లి: 3 టేబుల్ స్పూన్లు, పసుపు: టీస్పూను, ఉప్పు: సరిపడా, ఉల్లిపాయ ముక్కలు: కప్పు, మిరియాల పొడి, ఒకటిన్నర టీస్పూన్లు, కారం- 4. టీస్పూన్లు, గరంమసాలా: టీస్పూను, కరివేపాకు: కట్ట, జీలకర్ర: అరటీస్పూను, యాలకులు: మూడు, దాల్చినచెక్క: అంగుళం ముక్క, లవంగాలు: నాలుగు, నూనె: 3 టేబుల్‌స్పూన్లు.

**తయారు చేసే విధానం :** చికెన్ ముక్కలకి కాస్త ఉప్పు, టేబుల్‌స్పూను అల్లంవెల్లుల్లి, పసుపు పట్టించి పక్కన ఉంచాలి. 2. నాన్‌స్టిక్ పాన్‌లో జీలకర్ర, దాల్చినచెక్క, లవంగాలు, యాలకులు వేసి వేయించాలి. తరవాత మిగిలిన అల్లంవెల్లుల్లి వేసి వేగాక ఉల్లిముక్కలు, ఉప్పు వేసి వేయించాలి. కారం, గరంమసాలా, కచ్చాపచ్చాగా దంచిన మిరియాలపొడి వేసి నూనె బయటకు వచ్చేవరకూ వేయించాలి. ఇప్పుడు చికెన్ ముక్కలు కూడా మరో నాలుగు నిమిషాలు వేయించి, మూతపెట్టి ముక్క పూర్తిగా ఉడికేవరకూ ఉంచి దించాలి.

## చికెన్ పాప్‌కార్న్...



**కావలసినవి :** చికెన్‌ముక్కలు: పావుకిలో, కార్న్‌ఫ్లోర్: 2 టేబుల్‌స్పూన్లు, గుడ్డు: ఒకటి, బ్రెడ్ పొడి: కప్పు, ఉప్పు: తగినంత, అల్లంవెల్లుల్లి: టేబుల్‌స్పూను, మిరియాలపొడి: పావుటీస్పూను, కారం: 2 టీస్పూన్లు, గరంమసాలా: టీస్పూను, నూనె : వేయించడానికి సరిపడా.

**తయారుచేసే విధానం :** ..○ ఓ గిన్నెలో కారం, మిరియాలపొడి, అల్లంవెల్లుల్లి, మసాలా పొడి, ఉప్పు వేసి కలపాలి. ○ చికెన్‌ని చిన్న చిన్న ముక్కలుగా కోయాలి. వీటిమీద కారం మిశ్రమం చల్లి ముక్కలకి పట్టేలా బాగా కలపాలి. తరవాత కార్న్‌ఫ్లోర్ కూడా వేసి కలపాలి. ఇప్పుడూ విడిగా ఓ గిన్నెలో గుడ్డు తెల్లసొన, మరో గిన్నెలో బ్రెడ్ పొడి వేయాలి. ఒక్కోముక్కనీ తెల్లసొనలో ముంచి బ్రెడ్‌పొడిలో దొర్లించి తీయాలి. ఇలాగే అన్నీ చేయాలి. ముక్కలు బాగాకరకరలాడాలంటే మరోసారి గుడ్డుసొనలో ముంచి బ్రెడ్ పొడి అద్దాలి. వీటిని ఓ పావుగంటసేపు పక్కన ఉంచాలి. ○ బాణలిలో నూనె వేసికాగాక కొంచెం కొంచెంగా చికెన్ ముక్కలు వేసి వేయించి తీయాలి.

## చికెన్ 65..



**కావలసినవి :** బోన్‌లెస్ చికెన్: పావుకిలో, అల్లం తురుము : టీస్పూను, వెల్లుల్లితురుము : టీస్పూను, నిమ్మరసం : టేబుల్‌స్పూను, పెరుగు: టేబుల్‌స్పూను, గుడ్డు: ఒకటి, కరివేపాకు: 4, రెబ్బలు, పసుపు : చిటికెడు, మిరియాలపొడి: అరటీస్పూను, ఉప్పు: తగినంత, బియ్యప్పిండి : 2, టేబుల్‌స్పూన్లు, జీలకర్ర: టీస్పూను, వెల్లుల్లి: టీస్పూను, పచ్చిమిర్చి : రెండు, కారం : టీస్పూను, పెరుగు: 2, టేబుల్‌స్పూన్లు: నూనె : వేయించడానికి సరిపడా.

**తయారు చేసే విధానం :** ○. గిన్నెలో అల్లం వెల్లుల్లి తురుము, నిమ్మరసం, పెరుగు, గుడ్డసొన పసుపు, మిరియాలపొడి, ఉప్పు: బియ్యపినపండి అనీనన వేసి కలపాలి.ఈ మిశ్రమాన్ని చికెన్ ముక్కలకు పట్టించి కనీసం ఓ గంట సేపు నాననివ్వాలి. ○. బాణలిలో నూనె వేసి కాగాక, చికెన్ ముక్కల్ని వేయించి తీయాలి.తరవాత అందులోని నూనెని వంపేసి ఓ రెండు టేబుల్‌స్పూన్లు మాత్రం ఉంచి, జీలకర్ర, వెల్లుల్లి తురుము, సన్నగా తరిగిన పచ్చిమిర్చి కరివేపాకు వేసి వేయించాలి. ఇప్పుడు కారం, పెరుగు కూడా వేసి కలిపి ఓ నిమిషం తరవాత వేయించిన చికెన్ ముక్కల్ని వేసి మీడియం వంట మీద ఓ రెండు నిమిషాలు ఉంచి తీయాలి. □

# మరకల్ని వదిలించే లాండ్రీ పాడ్స్

పాపాయి గౌనుపై ఇంకు, చీరపై నూనె... ఇలా దుస్తులపై రకరకాల మరకలు పడుతుంటాయి. ఇవి మామూలు డిటర్జెంట్‌తో వదిలిపోవు. అలాగని పదే పదే ఉతికితే మృదుత్వాన్ని కోల్పో తాయి. చివరికి డ్రైవాష్‌కు ఇస్తేనే కానీ పని అవ్వదు. మీకూ ఇలాంటి పరిస్థితులు ఎదురయ్యాయా? ఇక, ఇబ్బంది అక్కర్లేదు. సులువుగా మరకల్ని వదిలించే లాండ్రీ పాడ్స్ వచ్చేశాయి. స్టెయిన్ రిమూవర్, సాఫ్ట్‌వేర్లూ, డిటర్జెంట్ సొల్యూషన్... అన్నీ కలగలిపి తయారు చేసిన వీటిని నీళ్లల్లో వేస్తే చాలు కరిగిపోతాయి. దుస్తులూ సులువుగా శుభ్రపడ తాయి. మృదుత్వాన్నీ కోల్పోవు. పెద్ద పెద్ద కంపెనీలూ ఇప్పుడీ పద్ధతి ఫాలో అవుతున్నాయి. మంచి ఆలోచనే కదూ... మరి ఈ మల్టీపర్పస్ పాడ్స్ని మీరూ ప్రయత్నించి చూస్తారా? □





ఆట

# వరల్డ్ టేబుల్ టెన్నిస్ టోర్నీలో ముగిసిన భారత్ పోరాటం

**న్యూఢిల్లీ:** స్లోవేనియాలో భారత పోరాటం ముగిసింది, అన్ని ప్యాడ్లర్లు ముందుగానే నిష్క్రమించారు. స్లోవేనియాలోని వరల్డ్ టేబుల్ టెన్నిస్ స్టార్ కాంటెండర్ ల్జుబ్లియానాలో జరిగిన రెండో రౌండ్‌లో మానికా బాత్రా నిరాశపరిచింది. మహిళల సింగిల్స్‌లో



భారత ప్రచారాన్ని ముగించి, మనికా చైనాకు చెందిన హి జువోజియా చేతిలో 0-3 (9-11, 6-11, 4-11) తేడాతో వరుస గేమ్‌లలో ఓడిపోయింది. 47వ ర్యాంక్‌లో ఉన్న భారత ఆటగాడు తొలి రౌండ్‌లో సానుకూల సంకేతాలను చూపించాడు. పోర్చుగల్‌కు చెందిన క్వాలిఫయర్ ఫుయును 3-0 (11-6, 11-8, 11-5) తేడాతో ఏకపక్ష పోరులో ఓడించాడు. పురుషుల సింగిల్స్‌లో, మానవ్ ఠక్కర్ మొదటి హర్డిల్‌లోనే నిష్క్రమించాడు. ప్రపంచ 38వ ర్యాంకర్ చైనాకు చెందిన జుయే ఫీ చేతిలో 03 (9-11, 6-11, 9-11) తేడాతో ఓడిపోయాడు. మిక్స్‌డ్ డబుల్స్ జోడీ మణిక మరియు పయాస్ జైన్ కూడా ప్రారంభంలోనే నిష్క్రమించారు. అర్హత రౌండ్లలో పరాజయం పాలైన తర్వాత ప్రధాన డ్రాకు చేరుకున్న ఈ జంట, ప్రారంభ రౌండ్‌లో హాంకాంగ్, చైనాకు చెందిన విబి వింగ్ లామ్-యియు క్వాన్ తో చేతిలో 1-3 (9-11, 12-10, 9-11, 7-11) తేడాతో ఓడిపోయింది. ఇక పురుషుల డబుల్స్ జోడీ మానవ్ ఠక్కర్-మనుష్ షా కూడా మొదటి అడ్డంకిలోనే నిష్క్రమించారు, కొరియాకు చెందిన క్వాలిఫయర్లు కిమ్ మిన్హ్యోక్-పార్క్ గాంగ్హ్యోన్ చేతిలో 1-3 (10-12, 6-11, 11-8, 6-11) తేడాతో ఓడిపోయారు. మొదటి రెండు గేమ్‌లను 10-12, 6-11 తేడాతో ఓడిపోయిన తర్వాత, ఠక్కర్ మరియు షా మూడవ గేమ్‌ను 118 తేడాతో గెలుచుకోవడం ద్వారా కొద్దిగా కోలుకున్నారు. కానీ ప్రత్యర్థులను సాగదీయడంలో విఫలమై, లొంగిపోయి, నాల్గవ గేమ్‌ను 6-11 తేడాతో కోల్పోయారు. కాగా గత వారం, ఈ భారత జంట డబ్ల్యూటిటి కాంటెండర్ స్కోప్జే-2025లో ఫైనల్‌లో దక్షి ణ కొరియాకు చెందిన జోంగ్‌హూన్ లిమ్-జున్‌సంగ్ ఓహ్ చేతిలో 0-3 (9-11, 7-11, 9-11) తేడాతో ఓడిపోయి రన్నరప్‌గా నిలిచింది. ఇక మహిళల డబుల్స్ మెయిన్ డ్రాలో భారత క్రీడాకారిణికి ప్రవేశం లభించలేదు.



## పారిస్ డైమండ్ లీగ్‌లో మెరిసిన

# గోల్డెన్ బాయ్

## నీరజ్ రెండేళ్ల నిరీక్షణకు ఎండ్‌కార్డ్

**న్యూఢిల్లీ:** భారత జావెలిన్ త్రో స్టార్, ఒలింపిక్ గోల్డ్ మెడలిస్ట్ నీరజ్ చోప్రా మరోసారి తన సత్తా చాటాడు. పారిస్‌లో జరిగిన ప్రతిష్టాత్మక డైమండ్ లీగ్ ఈవెంట్‌లో అగ్రస్థానంలో నిలిచి, రెండేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తన తొలి డైమండ్ లీగ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. ఈ విజయం నీరజ్‌కు, భారత అథ్లెటిక్స్‌కు ఎంతో కీలకమైనది. ఈ లీగ్ జావెలిన్ త్రో ఈవెంట్‌లో నీరజ్ చోప్రా అద్భుతమైన ప్రదర్శన కనబరిచాడు. తన తొలి ప్రయత్నంలోనే 88.16 మీటర్ల దూరం జావెలిన్‌ను విసిరి అగ్రస్థానంలో నిలిచాడు. ఆ తర్వాత రెండవ ప్రయత్నంలో 85.10 మీటర్లు విసిరాడు. అతని మూడవ, నాల్గవ, ఐదవ ప్రయత్నాలు ఫౌల్‌గా మారినప్పటికీ, చివరి ప్రయత్నంలో 82.89 మీటర్లు విసిరి తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నాడు. ఈ పోటీలో నీరజ్ చోప్రా ప్రధాన ప్రత్యర్థులుగా భావించిన జర్మనీకి చెందిన జూలియన్ వెబర్ 87.88 మీటర్లతో రెండో స్థానంలో నిలవగా, బ్రెజిల్‌కు చెందిన లూయిజ్ మారిసియో డా సిల్వా 86.62 మీటర్లతో మూడో స్థానాన్ని దక్కించుకున్నాడు. గత రెండు టోర్నమెంట్లలో (దోహా డైమండ్ లీగ్ 2025, పోలాండ్ ఈవెంట్) జూలియన్ వెబర్ చేతిలో ఓడిపోయిన నీరజ్, ఈసారి ప్రతీకారం తీర్చుకున్నాడు. కాగా పారిస్ ఒలింపిక్స్ ముందు ఈ విజయం కీలకమైంది. పారిస్ ఒలింపిక్స్ 2024లో నీరజ్ చోప్రా రజత పతకం సాధించాడు. అయితే, ఇప్పుడు 2025లో పారిస్‌లోనే డైమండ్ లీగ్ గెలుచుకోవడం రాబోయే ఒలింపిక్స్‌కు సన్నాహకంగా నిలుస్తుంది. ఇది నీరజ్ ఫామ్ ను, అతని మానసిక దృఢత్వాన్ని నిరూపిస్తుంది. ప్రపంచ అథ్లెటిక్స్ లో భారత జాతీయ పతాకాన్ని సగర్వంగా నిలబెడుతున్న నీరజ్ చోప్రాకు ఈ విజయం ఒక గొప్ప ప్రోత్సాహకం.





# ఆసియా కప్ లెగ్ 2లో భారత్ 9 పతకాలతో సరి

## నిరాశ పరచిన రికర్వ్ ఆర్చర్లు

**న్యూఢిల్లీ:** ఆసియా కప్ లెగ్ 2 టోర్నమెంట్‌లో భారత జూనియర్ ఆర్చర్లు 9 పతకాలతో ముగించారు. సింగపూర్‌లో జరిగిన ఈ టోర్నమెంట్‌లో భారత జూనియర్ ఆర్చర్లు రెండు స్వర్ణాలు, ఆరు రజతాలు, ఒక కాంస్యంతో సరిపెట్టారు. రికర్వ్, కాంపౌండ్ విభాగాల్లో 10 ఫైనల్స్‌లో ఏడు స్థానాల్లో నిలిచినప్పటికీ, భారత ఆర్చర్లు రెండుసార్లు మాత్రమే పోడియంపై అగ్రస్థానంలో నిలిచారు. మిగిలిన ఫైనల్స్‌లో మొత్తం ఐదింటిలో తీవ్ర నిరాశాజనకంగా ముగించారు. రికర్వ్‌లో ఒక్క స్వర్ణం కూడా గెలుచుకోలేకపోయింది. టాప్‌సీడ్ అయిన పురుషుల జట్టు ఫైనల్‌లో జపాన్ చేతిలో ఓడిపోయింది. విష్ణు చౌదరి, పరాస్ హుడా మరియు జుయెల్ సర్కార్ మూడు సెట్లలో రెండింటిలో 50 మార్కును చేరుకోలేకపోయారు, వరుస సెట్లలో 6-0 తేడాతో ఓడిపోయారు. రికర్వ్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్‌లోనూ ఇదే కథ జరిగింది. ఇండోనేషియాతో జరిగిన మ్యాచ్‌లో నాల్గవ సీడ్ చౌదరి-వైష్ణవి పవార్‌లు తప్పులకు పాల్పడ్డారు. 32 పాయింట్లతో ఆరంభం, ఆ తర్వాత వన్‌పాయింటర్‌తో కూడిన వినాశకరమైన రెండవ సెట్, వారి ఓటమిని నిర్ణయించింది. మూడవ మ్యాచ్‌లో కూడా వారు 32-35 తేడాతో ఓడిపోయి రజతంతో ముగించారు. మహిళల రికర్వ్ జట్టు అన్ని వ్యక్తిగత ఎంట్రీలతో పాటు, పతక రౌండ్లకు కూడా చేరుకోలేక పోయింది, రికర్వ్ ఫలితాలు నిరుత్సాహపరిచినప్పటికీ, కాంపౌండ్ విభాగం కొంత ఊరటనిచ్చింది, రెండు బంగారు పతకాలను ఇక్కడే సాధించారు. మహిళల ఈవెంట్‌లో రెండవ సీడ్ తేజల్ సాల్వే 146-144 తేడాతో ఉన్నత ర్యాంక్‌లో ఉన్న షణ్ముఖి నాగ సాయి బుద్దేపై విజయంతో స్వర్ణం ఖాయం అయింది.

# సౌరాష్ట్ర ప్రో టి20 ఛాంపియన్‌గా కచ్ రైడర్స్

**న్యూఢిల్లీ:** ఒకప్పుడు ఫైనల్‌కు చేరుకునే అవకాశం లేదని భావించిన జట్టు సౌరాష్ట్ర ప్రో టీ20 లీగ్-2025 ఛాంపియన్‌గా అవతరించింది. అద్భుతమైన ధృఢత్వం, సంకల్పాన్ని ప్రదర్శించిన జెఎండి కచ్ రైడర్స్ నిరంజన్‌షా స్టేడియంలో అన్మోల్ కింగ్స్ హాలార్‌పై సమగ్ర విజయాన్ని సాధించింది. నిర్ణయాత్మక చివరి మ్యాచ్‌లో 15 బంతులు మిగిలి ఉండగానే 6 వికెట్ల తేడాతే విక్టరీ సాధించింది. కచ్ రైడర్స్ టాస్ గెలిచి మొదట బౌలింగ్ ఎంచుకుంది. అన్మోల్ కింగ్స్ తరపున నిహాల్‌చౌదరి, కెప్టెన్ తరంగ్ గోహెల్ ఇన్నింగ్స్ ప్రారంభించారు. తరంగ్ ఖాతా తెవరకుండానే ఔటయ్యాడు. నిహాల్ (11) అర్థ యాదవ్ చేతిలోఔటయ్యాడు. సిద్ధాంత్ రాణా (33) కీలక పాత్ర పోషించాడు. పార్శ్వరాజ్ రాణా(38) అతనికి మంచి సహకారం అందించాడు. దివ్యాంగ్ కనాని (20), యష్రాజ్ చుడాసమా (13) జట్టుకు తోడ్పడ్డారు. అయితే 19.4 ఓవర్లలో 142 పరుగులకు ఆలౌట్ అయ్యారు. కచ్ రైడర్స్ బౌలర్లలో దేవాంగ్ కరమట 3.14 ఓవర్లలో 5/14 వికెట్లు పడగొట్టాడు. అర్థ యాదవ్ 3 ఓవర్లలో 2/22 వికెట్లు తీసుకున్నాడు. కెప్టెన్ ధమేంద్రసింహ్ జడేజా (1/17), పార్థభట్ (1/26), ధ్రువమ్ పటేల్ (1/22) ఇన్నింగ్స్‌లో తలా ఒక వికెట్ తీసుకున్నారు. ఇక 143 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన కచ్ రైడర్స్ జట్టుకు సమర్థ వ్యాస్, కృష్ణకాంత్ పాఠక్ ఓపెనర్లు అయ్యారు. వారు రెండు వికెట్లు త్వరాగా కోల్పోయి 2.4 ఓవర్లలో 12/2తో నిలిచారు. రెండవ వికెట్ పడటంతో, విశ్వరాజ్ జడేజా, పవన్ పర్మార్ మధ్యలో జత కలిశారు. ఈ జంట మూడో వికెట్‌కు 94 పరుగులు జోడించే ముందు పవన్ (48) ఔటయ్యాడు. జడేజా కూడా ఖాతా తెరవకుండానే ఔట్‌య్యాడు. కానీ విశ్వరాజ్ 17.3 ఓవర్లలోనే లక్ష్యాన్ని ఛేదించడానికి సహాయం చేశాడు. అతను 64 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు. పార్థ భూత్ (12) తన వంతు సహకారాన్ని అందించాడు. అన్మోల్ కింగ్స్ హాలార్ తరపున ఆదిత్య జడేజా మాత్రమే ఇన్నింగ్స్‌లో వికెట్లు తీయగలిగాడు. అతను 3.3 ఓవర్లలో 3/26 తీసుకున్నాడు.



# చుక్కలనంటిన వెండి

**ముంబై, జూన్ 21:** ప్రస్తుతం బంగారం, వెండి ధరలు ఆకాశన్నంటుతున్నాయి. తులం బంగారం ధర లక్ష రూపాయలు దాటేసింది. ఇక కిలో వెండి ధర విషయానికొస్తే అది కూడా లక్షా ఎప్పుడో దాటేసింది. వెండి ఇప్పుడు కిలోకు రూ.1.10 లక్షలకు చేరుకుంది. కొన్ని ప్రాంతాల్లో అయితే రూ.1.20 లక్షలుగా ఉంది. ప్రస్తుత పారిశ్రామిక డిమాండ్, ఆర్థిక పరిస్థితులు మరియు సాంకేతిక పురోగతి కారణంగా వెండి ధర మరింత పెరుగుతుందని విశ్లేషకులు అంటున్నారు. వెండి ధర త్వరలో రూ.2 లక్షలకు చేరుకుంటుందని, దేశంలోని విశ్లేషకులు దీనిపై పరిశోధనలు చేస్తున్నారన్న అంచనాలు రిటైల్ పెట్టుబడిదారులలో, మార్కెట్ పరిశీలకులలో సంచలనం సృష్టించాయి. వెండి ధరలు రూ.110,000కి చేరుకున్న తర్వాత ఈ అంచనాకు వచ్చాయి. భారత దేశంలోని మార్కెట్ నిపుణులు వెండి ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. ప్రస్తుత ప్రపంచ పరిస్థితిలో వెండి, బంగారం రెండింటికీ డిమాండ్ పెరుగుతోందని అన్నారు. కానీ వెండి ముఖ్యంగా వార్తల్లో ఉంటుంది. ఎందుకంటే ఇది సురక్షితమైన పెట్టుబడి మాత్రమే కాదు, భారీ పారిశ్రామిక డిమాండ్ కూడా వెండికి ఉంది. భౌగోళిక రాజకీయ, ఉద్రిక్తతలు, వాణిజ్య అనిశ్చితుల మధ్య బంగారం ఎల్లప్పుడూ పెట్టుబడిదారుల మొదటి ఎంపిక అని నివేదిక పేర్కొంది. కానీ ఇప్పుడు వెండి కూడా వేగంగా పెరుగుతోంది. ఎలక్ట్రిక్ వాహనాలు, సౌరశక్తి వంటి రంగాలలో వెండికి డిమాండ్ పెరుగుతూనే ఉంది. ఈ రెండు రంగాలు భవిష్యత్తు అవసరాలు, వాటిలో వెండి కీలక పాత్ర పోషిస్తుంది. వెండి ధరలు వచ్చేనెలలో కిలోపై భారీగా పెరిగే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. బలహీనమైన యుఎస్ డాలర్, పారిశ్రామిక డిమాండ్, సురక్షితమైన పెట్టుబడి వంటి కారణాల వల్ల వెండి ధర పెరిగే అవకాశం ఉందని, ఇది స్థిరత్వాన్ని అందించడమే కాకుండా 2025లో వెండి ధరల పెరుగుదలను సద్వినియోగం చేసుకోవడానికి కూడా సహాయపడుతుంది అంటున్నారు మార్కెట్ నిపుణులు.



# హెచ్‌డిఎఫ్‌సిని కొనుగోలు చేస్తున్న ఐసిఐసిఐ?

**ముంబై, జూన్ 21:** హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌కు చెందిన మార్టిగేజ్ సంస్థ హెచ్‌డీఎఫ్‌సీని మరో ప్రైవేటురంగబ్యాంక్ ఐసీఐసీఐ కొనుగోలు చేయాలనుకుందా? అంటే అవుననే అంటున్నారు హెచ్‌డీఎఫ్‌సీ మాజీ ఛైర్మన్ దీపక్ పరేఖ్. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీవిలీనానికి ముందు ఈ ప్రతిపాదన తన వద్దకు వచ్చిందని చెప్పారు. ఐసీఐసీఐ మాజీ సీఈఓ చందాకొచ్చర్‌కు చెందిన యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. ఐసీఐసీఐ బ్యాంక్ సీఈఓగా చందాకొచ్చర్ ఉన్న సమయంలోనే ఈ ప్రతిపాదన రావడం గమనార్హం. బ్యాంకింగ్ వ్యవస్థతో పాటు పలు అంశాలపై చందాకొచ్చర్‌తో మాట్లాడిన పరేఖ్.. హెచ్‌డీఎఫ్‌సీ విలీన అంశం గురించి కూడా మాట్లాడారు. హెచ్‌డీఎఫ్‌సీని.. ఐసీఐసీఐ ప్రారంభించింది కదా! మరి మీరెందుకు మళ్లీ విలీనం చేయకూడదన్న ప్రశ్న మీ నుంచి వచ్చింది అంటూ నాటి రోజుల నుంచి గుర్తు చేసుకున్నారు. ఇప్పటి వరకు ఈ విషయం గురించి తానెక్కడా మాట్లాడలేదని పేర్కొన్నారు. అప్పట్లో తిరస్కరించడానికి గల కారణాలను వివరించారు. ‘విలీనం ఏమాత్రం సరికాదని నాడు తోసిపుచ్చా. మా పేరు, బ్యాంక్, ఇలా చాలా అంశాలు అందుకు కారణం’ అని పరేఖ్ పేర్కొన్నారు. 2009 నుంచి 2018 వరకు ఐసీఐసీఐ సీఈఓగా చందాకొచ్చర్ వ్యవహరించారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో హెచ్‌డీఎఫ్‌సీ విలీనానికి ఆర్‌బీఐ కూడా ఎంతో సహకారం అందించిందని పరేఖ్ పేర్కొన్నారు. అలాగని, రాయితీలు, గడువు వంటి రూపంలో కాదన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్‌లో రివర్స్ మెర్జర్‌ను ఒక బాధాకర, ఆనందకరమైన రోజుగా అభివర్ణించారు. విలీనం సంస్థకు ప్రయోజనకరమని పేర్కొన్నారు. చైనాలో పెద్దపెద్ద బ్యాంకులు ఉన్నట్లు మన దేశంలోనూ ఆ తరహాబ్యాంకులు ఉండాలని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి బ్యాంకులతో పోటీ పడే విధంగా మన బ్యాంకులు అవతరించాలన్నారు. అందుకోసం బ్యాంకింగ్‌రంగంలో కన్సాలిడేషన్ జరగాలని అభిప్రాయపడ్డారు. బ్యాంకుల కొనుగోళ్ల ద్వారానే అది సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశంలో బీమా రంగాన్ని సరిగా అర్థం చేసుకోవడం లేదని ఆందోళన వ్యక్తంచేశారు.



# లైఫ్‌టైమ్ దాటిన వాహనాలకు పెట్రోడీజిల్ బంద్

**న్యూఢిల్లీ, జూన్ 21:** ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ రికగ్నిషన్ (ఎఎన్‌పిఆర్) కెమెరాల ద్వారా గుర్తించి అన్ని వాహనాల లైఫ్ టైమ్ అయిపోయిన (ఎండ్ ఆఫ్ లైఫ్) వాహనాలను జూలై 1 నుండి ఢిల్లీలోని పెట్రోల్ బంకుల్లో ఇంధనం నింపడానికి అనుమతించబోమని కమిషన్ ఆఫ్ ఎయిర్ క్వాలిటీ మేనేజ్‌మెంట్ (సిఎక్యూఎం) ప్రకటించింది. 10 సంవత్సరాల కంటే పాత డీజిల్ వాహనాలు, 15 సంవత్సరాల కంటే పాత పెట్రోల్ వాహనాల జీవిత కాలం అయిపోయిన (ఇఒఎల్) వాహనంగా పరిగణిస్తారు. సిఎక్యూఎం ప్రకారం, ఈ నిషేధం నవంబర్ 1 నుండి గురుగ్రామ్, ఫరీదాబాద్, ఘజియాబాద్, గౌతమ్ బుద్ధ నగర్, సోనిపట్‌లకు విస్తరించనున్నారు. అలాగే ఏప్రిల్ 1, 2026 నుండి మిగిలిన ఎన్‌సిఆర్ ప్రాంతాలను కవర్ చేస్తుంది. ఢిల్లీలోని 500 ఇంధన కేంద్రాలలో ఎఎన్‌పిఆర్ కెమెరాలను ఏర్పాటు చేశామని, దీనివల్ల వాహన డేటా రియల్ టైమ్ ట్రాకింగ్ సాధ్యమవుతుందని సిఎక్యూఎం సభ్యుడు డాక్టర్ వీరేంద్ర శర్మ అన్నారు. ఇప్పటి వరకు ఈ వ్యవస్థ 3.63 కోట్లకుపైగా వాహనాలను తనిఖీ చేసిందని, వాటిలో 4.90 లక్షల వాహనాలను లైఫ్ టైమ్ నిలిచిపోయినట్లు గుర్తించామని చెప్పారు. 29.52 లక్షల వాహనాలు తమ కాలుష్యనియంత్రణ ధృవీకరణపత్రాన్ని (పియుసిసి) పునరుద్ధరించాయని, ఫలితంగా రూ.168కోట్ల విలువైన చలాన్లు జారీ చేసినట్లు శర్మ చెప్పారు. డేటాను పర్యవేక్షించడానికి ఎక్కువగా ఫ్లాగ్ చేయబడిన వాహనాలతో ఇంధన స్టేషన్లను గుర్తించడానికి కఠినమైన నిర్ణయాల అమలుకు ఢిల్లీ రవాణా శాఖ 100 ప్రత్యేక బృందాలను నియమించింది. ఢిల్లీ, ఎన్‌సిఆర్ పొల్యూషన్‌ను శుభ్రం చేయడానికి పాత బీఎస్ ప్రమాణాల వాహనాలను తొలగించడం చాలా ముఖ్యం అని శర్మ అన్నారు. వాయు కాలుష్యంలో ఈ వాహనాలు పెద్ద పాత్ర పోషిస్తాయి. ఇప్పుడు పారదర్శకమైన, డిజిటల్, జవాబుదారీ వ్యవస్థ అమలు చేసినందున ఈ వ్యవస్థను మరింత ప్రభావవంతంగా చేయడానికి టోల్ కేంద్రాలలో కూడా దీనిని ఉపయోగిస్తారు. దీని కోసం సుమారు 100 అమలు బృందాలు పని చేస్తాయి. వాహనాలు ఇంధన స్టేషన్ల వద్దకు చేరుకున్నప్పుడు ఎఎన్‌పిఆర్ వ్యవస్థ స్వయంచాలకంగా లైసెన్స్ ప్లేట్ నంబర్‌లను స్కాన్ చేస్తాయి. ఇది వాహన డేటాబేస్‌తో డేటాను క్రాస్‌రిఫరెన్స్ చేస్తుంది. ఇది రిజిస్ట్రేషన్ వివరాలు, ఇంధన రకం, వాహనం వయస్సు వంటి సమాచారాన్ని సేకరిస్తుంది. ఒక వాహనం చట్టపరమైన కాలపరిమితికంటే ఎక్కువగా ఉన్నట్లు తేలితే, దానిని ఎండ్ ఆఫ్ లైఫ్‌గా గుర్తిస్తారు.



# సిమ్‌కార్డు పొందాలంటే ఈ రూల్స్ తప్పదు..

**ముంబై, జూన్ 21:** భారత ప్రభుత్వం ఇటీవల ఒక ముఖ్యమైన నిర్ణయంతీసుకుంది. మొబైల్ నంబర్లు, వ్యాపార కాల్‌లకు కెవైసిని తప్పనిసరి చేసింది. టెలికాం రంగంలో పారదర్శకత, భద్రత, చట్టవిరుద్ధ కార్యకలాపాలను అరికట్టడం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో ప్రీపెయిడ్ వినియోగదారులకు కెవైసి సౌలభ్యం ఉండేది. ఇక్కడ వారు పూర్తి కెవైసి లేకుండా కూడా సిమ్ కార్డులను పొందవచ్చు. కానీ ఇప్పుడు అలా కుదరదు. కొత్త మార్గదర్శకాల ప్రకారం, వినియోగదారులు వారి గుర్తింపు, చిరునామా రుజువుతో కెవైసిని పూర్తి చేయాలి. ఈ ప్రక్రియను ఆఫ్‌లైన్‌లో (టెలికాం స్టోర్లలో) లేదా ఆన్‌లైన్‌లో (టెలికాం కంపెనీలవెబ్‌సైట్‌లు లేదా యాప్‌ల ద్వారా) పూర్తి చేయ వచ్చు. భద్రత, పారదర్శకతను పెంచే లక్ష్యంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. కేవైసీ లేకుంటే ఉగ్రవాద నిధులు, మనీ లాండరింగ్, మోసం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలను అణిచివేస్తుంది. దీనితో పాటు, అన్ని మొబైల్ నంబర్లు నమోదిత వినియోగదారులకు అనుసంధానించబడి ఉన్నాయని నిర్ధారిస్తుంది. దీనివల్ల అత్యవసర సేవలు, ప్రభుత్వ పథకాలను సులభంగా యాక్సెస్ చేయవచ్చు. కొత్త విధానం వల్ల అతిపెద్ద ప్రభావం ప్రీపెయిడ్ వినియోగదారులపై ఉంటుంది. వారు ఇకపై కేవైసీ లేకుండా సిమ్ కార్డులను పొందలేరు. ఈ ప్రక్రియ కొంచెం తక్కువ సౌకర్యవంతంగా ఉంటుంది. కానీ దీర్ఘకాలంలో ఇది భద్రత, నమ్మకాన్ని పెంచుతుంది. ఇప్పటికే కెవైసి పూర్తి చేసిన పోస్ట్‌పెయిడ్ వినియోగదారులకు ఇబ్బంది ఉండదు. అయితే, వారు ఎప్పటికప్పుడు కేవైసీ అప్‌డేట్ చేసుకోవాల్సి ఉంటుంది. కెవైసి ఎలా చేయాలి? కేవైసీని పూర్తి చేయడానికి సిమ్ కార్డు దారులు గుర్తింపు రుజువు (ఆధార్ కార్డ్, పాన్ కార్డ్, ఓటరు ఐడి వంటివి) అందించాల్సి ఉంటుంది.



# వాణిజ్యం

# హోండా స్పోర్ట్స్ ఎడిషన్ రిలీజ్..

**న్యూఢిల్లీ, జూన్ 21:** హోండా కార్స్ ఇండియా కొత్త సిటీ స్పోర్ట్ స్పెషల్ ఎడిషన్‌ను రూ.14.89 లక్షల (ఎక్స్ షోరూమ్) ధరకు అందుబాటులో ఉంచింది. ముఖ్యంగా ఈ కారులో యువతను ఆకర్షించేలా అవుటర్‌తో పాటు ఇంటీరియర్‌లో ప్రత్యేక మార్పులు చేశారు. న్యూ సిటీ స్పోర్ట్ ఎడిషన్ పరిమిత సంఖ్యలో అందుబాటులో ఉంటుంది. అలాగే ఈ విభాగంలో వోక్స్ వ్యాగన్ వర్టస్, స్కోడా స్లావియా, హ్యుందాయ్ వెర్నాతో పోటీ పడుతుందని నిపుణులు చెబుతున్నారు. సిటీ స్పోర్ట్ ఎడిషన్ సెడాన్‌కు సంబంధించిన అవుటర్ వ్యూ మాదిరి తీర్చిదిద్దారు. ముఖ్యంగా ఈ కారు క్రోమ్ గ్రిల్ నలుపు రంగులో ఆకట్టుకుంటుంది. అలాగే వెనుక స్పాయిలర్ కూడా ఆకర్షణీయంగా ఉంటుంది. ఓఆర్‌వీఎంలు క్రిస్టల్ బ్లాక్ ఫినిషింగ్‌తో వస్తున్నాయి. మల్టీస్పోక్ అల్లాయ్ వీల్స్ మెటాలిక్ గ్రే రంగులో ఆకట్టుకుంటుంది. షార్క్‌ఫిన్‌యాంటెన్నా కూడా గ్లోస్‌బ్లాక్ రంగులో డిజైన్ చేశారు. ముఖ్యంగా బూట్ పై ‘స్పోర్ట్’ చిహ్నం ఉంది. హోండా కార్స్ ఇండియా కొత్త సిటీ స్పోర్ట్ స్పెషల్ ఎడిషన్ క్యాబిన్ ఫుల్ బ్లాక్ ఇంటీరియర్‌తో వస్తుంది. అలాగే డాష్ బోర్డ్‌పై ఎరుపు రంగుతో ఉంటుంది. సీట్లు కాంట్రాస్ట్ ఎరుపు రంగు స్టిచింగ్‌తో బ్లాక్ లెథరెట్లో అప్హోల్స్టర్ చేశారు. కొత్త సాఫ్ట్ టచ్ డోర్ ఇన్సర్ట్లు ఆకట్టుకుంటాయి. అలాగే ఏసీ వెంట్స్, స్టీరింగ్ వీల్ కూడా నలుపు రంగులో ఉంటాయి. ఇక స్పెసిఫికేషన్ల విషయానికి వస్తే హెండా సిటీ స్పోర్ట్ ఎడిషన్ 119 బీహెచ్‌పీ గరిష్ట శక్తి 145 ఎన్ పీక్ టార్క్ ఉత్పత్తి చేసేలా 1.5 లీటర్ నేచురల్లీ ఆస్పిరేటెడ్ పెట్రోల్ ఇంజిన్‌తో వస్తుంది.



# 61 లక్షల యూజర్లను కాపాడిన ఎయిర్‌టెల్

**ముంబై, జూన్ 21:** దేశవ్యాప్తంగా ఎఐ ఆధారిత మోసాలను గుర్తించే వ్యవస్థను ప్రారంభించిన 37 రోజుల్లోనే ఝార్ఖండ్, బిహార్‌రాష్ట్రాల్లోని 6.1 మిలియన్ల మంది వినియోగదారులను ఆన్‌లైన్ మోస గాళ్ల బారినపడకుండా కాపాడినట్లు ఎయిర్‌టెల్ తెలిపింది. పెరుగుతున్న ఆన్‌లైన్ మోసాల నుంచి వినియోగదారులను రక్షించే చర్యల్లో గణనీయమైన పురోగతి సాధించినట్లు చెప్పింది. వినియోగదారులకు సైబర్ దాడుల నుంచి రక్షించేందుకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఫ్రాడ్ డిటెక్షన్ సిస్టమ్‌ను ఎయిర్‌టెల్ దేశవ్యాప్తంగా అందు బాటులోకి తీసుకురావాలని యోచించింది. అందులో భాగం గా ఎయిర్‌టెల్ ఈ విధానాన్ని ప్రారంభించిన 37 రోజుల్లోనే రెండు రాష్ట్రాల్లో 6.1 మిలి యన్లకు పైగా వినియోగ దారులను విజయవం తంగా రక్షించిందని ఒక ప్రకటనలో తెలిపింది. అధునాతనవ్యవస్థ ఎస్ఎంఎస్ లు, సోషల్ మీడియా ఖాతాలు, ఇ-మెయిల్స్, ఇతర బ్రౌజర్లలోని లింక్‌లను స్కాన్ చేసి ఫిల్టర్ చేస్తుందని తెలిపింది. ఇది ప్రతి రోజూ ఒక బిలియన్‌యూఆర్‌ఎల్స్‌ను పరిశీలించడానికి రియల్ టైమ్ థ్రెట్ ఇంటెలిజెన్స్‌ను ఉపయోగిస్తున్నట్లు చెప్పింది. హానికరమైన సైట్ల నుంచి జరిగే ప్రమాదాన్ని గుర్తించి 100 మిల్లీ సెకన్లలో రక్షణ కల్పిస్తున్నట్లు పేర్కొంది.




Printed and Published by GireeshSanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 396, Lower Tankbund, Hyderabad - 500 080 Phone : 2764 4999. Fax: 040-27642512, RNI No. 62142/95, Editor : *DamerlaSai Baba, *responsible for selection of news under the PRB Act. Regd.: No.HSD/337/21-22 Air Surcharge: Delhi : 40 Ps.